సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 109

సోమవారం 10-7-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



భారత్ శుభారంభం

రాణించిన హర్మన్‌ప్రీత్.. తొలి టీ20లో బంగ్లాదేశ్‌పై విజయం - 12లో



గెట్.. సెట్.. ఫారిన్

విదేశాలకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం - 13లో



యాత్ర పునఃప్రారంభం

ప్రతికూల వాతావరణం వల్ల జమ్మూకశ్మీర్‌లో 3 రోజులుగా నిలిచిపోయిన అమర్‌నాథ్ యాత్ర ఆదివారం పునఃప్రారంభమైంది.

వివరాలు 6లో ▸



ఎన్డీయేలోకి ఎల్జేపీ(రామ్ విలాస్)!

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలోకి బిహార్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) భాగస్వామిగా చేరనున్నట్లు సమాచారం.

వివరాలు 6లో ▸



చంద్రయాన్-3.. త్రీ ఇన్ వన్

చంద్రయాన్-1, 2తో ఆర్బిటార్ ద్వారా ల్యాండర్‌ను, ల్యాండర్ ద్వారా రోవర్‌ను పంపిన భారత్.. ఒకేసారి మూడింటినీ పంపిస్తోంది.

వివరాలు 6లో ▸



దయా హృదయం.. మహా ఖరీదు

అస్థికలను భద్రపర్చడానికి హాంకాంగ్‌లో భారీ భవనం నిర్మించారు. ఒక కలశానికి పదేళ్లకు రూ.63 లక్షల ఖర్చు అవుతుంది.

వివరాలు 6లో ▸

ఇక గ్లోబల్ గండికోట

ఒబెరాయ్ సెవెన్ స్టార్ హోటల్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం జగన్

విశాఖ, తిరుపతిలో కూడా ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన

- ఇలాంటి గ్రూపుల రాకతో ఈ ప్రాంతానికి అంతర్జాతీయంగా గుర్తింపు
- గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే గండికోట ప్రపంచానికి పరిచయం
- ఇలాంటి కంపెనీలు మన గురించి బయట గొప్పగా చెప్పుకునే పరిస్థితి కల్పిద్దాం.. మరెన్నో ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి వచ్చేందుకు ఈ గ్రూప్ దిక్సూచి
- ఈ నెలలో వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్
- ఆ తర్వాత రెట్టించిన వేగంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు హబ్‌గా మారుతున్న కొప్పర్తి



ఒబెరాయ్ సెవెన్ స్టార్ హోటల్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్, చిత్రంలో విక్రమ్ ఒబెరాయ్

> ప్రస్తుతం దేశంలో పర్యాటకం కీ రోల్ పోషిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఒక దార్శనికతతో తన డైనమిక్ లీడర్‌షిప్‌తో సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోంది. ఇందులో మమ్మల్ని భాగస్వాములను చేస్తున్నందుకు కృతజ్ఞతలు. ప్రపంచ స్థాయి సెవెన్ స్టార్ రిసార్ట్స్‌ను, మంచి రూమ్స్, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేస్తాం. ఏపీలో హోటల్స్ స్థాపించడం వల్ల ఇక్కడి వారికి ఉపాధి ఇవ్వగలుగుతాం. ప్రఖ్యాతిగాంచిన ఈ గండికోటలో మంచి సౌకర్యాలతో లగ్జరీ సెవెన్ స్టార్ రిసార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతి, వైజాగ్‌లో కూడా హోటల్స్‌ను ప్రారంభిస్తాం. 2025కు ఈ హోటల్స్ ప్రారంభమవుతాయి.
>
> - విక్రమ్‌సింగ్ ఒబెరాయ్, ఒబెరాయ్ హోటల్స్ సీఈవో

సాక్షి ప్రతినిధి, కడప: గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే మన గండికోటను ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోటలో ఆదివారం ఆయన ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుపతి, విశాఖపట్నం ఒబెరాయ్ హోటల్స్‌కు కూడా వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. దేవుడి దయ వల్ల ఈరోజు మరో మంచి కార్యక్రమం జరుగుతోందన్నారు. ఒక్కరోజే గండికోట, విశాఖపట్నం, తిరుపతితో కలిపి మూడు చోట్ల ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు జరగడం సంతోషకరం అని చెప్పారు. ఒబెరాయ్ లాంటి గ్రూపు ఇక్కడకు వచ్చి.. సూపర్ లగ్జరీ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణం చేపడుతోందన్నారు. ఇలాంటి పెద్ద పెద్ద గ్రూపులు వచ్చి ఇలాంటి హోటల్స్ కడితే గండికోట గ్లోబల్ టూరిజం మ్యాప్‌లోకి చేరుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల

మిగతా 2వ పేజీలో ▶



ఆదివారం హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిలో వరదల ధాటికి ఉధృతంగా ప్రవహిస్తున్న బియాస్ నది



మనాలిలో నదిలో కొట్టుకుపోతున్న వాహనాలు

ఉత్తరాదిన భారీ వర్షాలు

- ఢిల్లీలో 40 ఏళ్ల రికార్డు బద్దలు
- వివిధ ఘటనల్లో 19 మంది మృతి..
- పొంగిపొర్లుతున్న పలు నదులు
- కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లిన ఏపీ వాసి మృతి

ఉత్తరభారతాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో 19 మంది చనిపోయారు. ఢిల్లీలోని యమున సహా పలు నదులు పొంగిపొర్లుతున్నాయి. దేశ రాజధానిలో 24 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 153 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఢిల్లీతోపాటు జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరించింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

బూతు'కూన'ల బరితెగింపు



టీడీపీ నేతలు కూన రవికుమార్, ఆయన సోదరుడు వెంకట సత్యనారాయణ ఆగడాలకు అంతులేకుండా పోయింది. ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించడం, దూషించడం వారికి నిత్యకృత్యంగా మారింది. పొందూరు విద్యుత్ శాఖ ఏఈని కూన రవి ఫోన్‌లో బెదిరించిన వైనం వెలుగులోకి వచ్చింది.

వివరాలు 14లో ▸

భారత్ నుంచి వియత్నాం చేరుకున్న 'కిర్పాన్'



ఐఎన్ఎస్ కిర్పాన్ యుద్ధ నౌకకు వియత్నాం నౌకాదళం నుంచి ఘన స్వాగతం లభించింది. ద్వైపాక్షిక సంబంధాల్ని మరింత బలోపేతం చేసుకునేందుకు వియత్నాంకు ఈ నౌకను భారత్ కానుకగా ఇచ్చింది.

వివరాలు 14లో ▸

ఏపీలో అమెరికా పూల సోయగాలు



ఉత్తర అమెరికా ప్రాంతానికి చెందిన లిసియాంతస్ పువ్వులు.. గులాబీలను పోలి ఉండే కట్ ఫ్లవర్స్. బొకేలు, అలంకరణకు ఉపయోగించే ఈ పూలకు మంచి డిమాండ్ ఉంది. వీటి సాగుకు ఏపీలోనూ అనువైన వాతావరణం ఉన్నట్టు శాస్త్రవేత్తలు తేల్చారు.

వివరాలు 3లో ▸

ఇక సులభంగా సరుకు రవాణా




భూమిపైన ఉన్న జల మార్గాలను వినియోగించడం ద్వారా ఇంధనం, సమయం ఆదా చేసే దిశగా ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ అడుగులు వేస్తోంది. దీనికోసం రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి నదుల్లో రోరో సర్వీసులను ప్రవేశపెట్టడంపై దృష్టిసారించింది.

వివరాలు 14లో ▸

లంక భూములకు పట్టాలు

ఎకరాలు	లబ్ధిదారులు
9,000	19,000కు పైగా

- పూర్తయిన అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం
- జిల్లా కలెక్టర్ సంతకంతో పట్టాలిచ్చేందుకు ఏర్పాట్లు
- త్వరలో మంత్రివర్గ సమావేశంలో ఆమోదించే అవకాశం



సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి నదీ తీరంలో ఉన్న లంక భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలిచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎనిమిది జిల్లాల్లో ఉన్న కృష్ణా, గోదావరి లంకల్లోని 9,062 ఎకరాలకు సంబంధించిన 19 వేల మందికిపైగా ఈ పట్టాలు ఇవ్వనుంది. మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేయడమే తరువాయి. ఆ తర్వాత పట్టాల పంపిణీ ప్రారంభం కానుంది.

రాష్ట్రంలోని నిరుపేదలకు 54 వేల ఎకరాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్న విషయం తెలిసిందే. ఆ భూములతోపాటే లంక భూములను సాగుచేసుకుంటున్న రైతులకు డి-పట్టాలు ఇవ్వనున్నారు. కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో ఒండ్రు మట్టి ఒక దగ్గర చేరి కాలక్రమేణా సాధారణ భూములుగా మారి సారవంతంగా ఉండడంతో రైతులు వాటిని సాగుచేసుకుంటారు. ఈ భూములను మూడు కేటగిరీలుగా విభజించారు. గట్టుకు దగ్గరగా ఉండి వరద వచ్చినా కొట్టుకుపోని భూమిని ఏ-కేటగిరీగా.. వీటికి అనుకుని కొంత నదిలోకి ఉన్న భూమిని బి-కేటగిరీగా.. ఏ, బీ కేటగిరీకి అనుకుని వరదలొస్తే పూర్తిగా మునిగిపోయే భూమిని సీ-కేటగిరీగా విభజించారు.

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు..

కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని ఈ మూడు కేటగిరీల్లో

మిగతా 3వ పేజీలో ▶

కొర్రలకు 'మద్దతు' ఇవ్వండి



- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన
- రాష్ట్రంలో కొర్రల సాగు ప్రోత్సాహానికి చర్యలు
- రైతుల నుంచి కొర్రలు కొనుగోలు చేసి పీడీఎస్ ద్వారా పంపిణీకి కసరత్తు.. ఇప్పటికే కార్డుదారులకు రాగులు, జొన్నలు పంపిణీ
- గ్రామీణ ప్రాంతాల్లోనూ ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీకి అభిప్రాయ సేకరణ
- పేదలకు బలవర్ధక ఆహారం అందించడమే లక్ష్యంగా అడుగులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొర్రల సాగును ప్రోత్సహించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రైతులకు భరోసా కల్పించేలా కొర్రలను మద్దతు ధర పంటల జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటివరకు చిరుధాన్యాల్లో రాగులు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్నకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తోంది. అయితే అనంతపురం, కడప, సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో ఎక్కువగా కొర్రలను సాగు చేస్తున్నారు. మంచి దిగుబడులు రావడం, మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో రైతుకు లాభసాటిగా మారింది. మరోవైపు ప్రభుత్వం కూడా సాంప్రదాయ పంటల నుంచి చిరుధాన్యాల సాగువైపు రైతులను నడిపించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పౌరసరఫరాల శాఖ కాన్ఫరెన్స్‌లో..

మిగతా 3వ పేజీలో ▶



శ్రీకాళహస్తిలో ఘోర ప్రమాదం

- లారీని ఢీకొట్టిన కారు
- ఆరుగురు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- త్రిపురాంతకం వద్ద మరో ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి
- మరో 10 మందికి గాయాలు



లారీ కింద ఇరుక్కున్న కారు

- వివరాలు 14లో

ఖలిస్తానీ, భారత్ మద్దతుదారుల

పోటాపోటీ ప్రదర్శనలు

- కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాదులు నిరసనకు దిగగా.. భారత్ మద్దతుదారులు జాతీయ జెండాలు చేతపట్టి వందేమాతరం నినాదాలతో హోరెత్తించారు.

- వివరాలు 6లో

ఇదం జగత్



అయనకు సీఎం కావాలని ఉన్నప్పుడు మీకు పీఎం కావాలని ఉంటుందిగా.. అప్పుడే రిటైర్ అంటే ఎలా సార్!!



కొత్త డయాఫ్రమ్ వాల్!

పోలవరం ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో నిర్మాణం

- జల్ శక్తి మంత్రి షెకావత్ సూత్రప్రాయంగా అంగీకారం.. తుది నిర్ణయం కోసం సమగ్రంగా చర్చించి నివేదిక ఇవ్వాలని ఆదేశం
- నేడు జల్ శక్తి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమావేశం
- బాబు కమీషన్ల పాపం ఖరీదు రూ.2,020 కోట్లు
- స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేయకుండా గ్యాప్-2లో డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించిన ఫలితం ఇదీ
- భారీ వరదలకు కోతకు గురై దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్
- చంద్రబాబు ఘోర తప్పిదాలతో భారీ అగాథాలు.. పోలవరం పనుల్లో తీవ్ర జాప్యం

సాక్షి, అమరావతి: పోలవరం ఈసీఆర్‌ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ గ్యాప్-2లో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి కేంద్ర జల్ శక్తి శాఖ ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ అంశంపై సమగ్రంగా చర్చించి కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ఆవశ్యకతపై నివేదిక సమర్పించడమే అజెండాగా కేంద్ర జల్ శక్తి శాఖ ప్రత్యేక కార్యదర్శి పంకజ్ కుమార్ సోమవారం ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఆ నివేదిక ఆధారంగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణంపై కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తుది నిర్ణయం తీసుకోనున్నారు. పోలవరం నిర్మాణ ప్రాంతంలో భౌగోళిక పరిస్థితుల కారణంగా వరద ప్రవాహాన్ని దిగువకు పంపే స్పిల్ వేను గోదావరి కుడి గట్టుకు అవతల రాతి నేలపై.. 194.6 టీఎంసీలను నిల్వ చేసేలా 2,454 మీటర్ల పొడవున ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్‌ను మూడు భాగాలుగా (గ్యాప్-1లో 564, గ్యాప్-2లో 1,750, గ్యాప్-3లో 140 మీటర్లు) గోదావరి గర్భంలో ఇసుక తిన్నెలపై నిర్మించేలా సీడబ్ల్యూసీ డిజైన్‌ను రూపొందించింది. ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్-3లో కాంక్రీట్ డ్యామ్‌ను నిర్మించారు. గ్యాప్-1, గ్యాప్-2లో పునాది

మిగతా 2వ పేజీలో ▶

బెంగాల్‌లో 15కు చేరిన మృతులు



- పశ్చిమబెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో జరిగిన హింసాత్మక ఘటనల్లో మృతుల సంఖ్య 15కు చేరింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఉద్రిక్తతలు పెరగడంతో భారీగా పోలీసులు మోహరించారు. మరణాల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఈ మరణాలపై 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఎన్నికల సంఘం ఆదేశించింది.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించింది..

ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు


నెల్లూరు(పొగతోట): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకున్నామని, ప్రభుత్వం చర్చలకు పిలిచి సుహృద్భావ వాతావరణంలో సమస్యలను పరిష్కరించిందని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం నెల్లూరులో ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచల్‌రెడ్డి అధ్యక్షతన ఏడు జిల్లాల నాయకులకు అభినందన సభ నిర్వహించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేసిన నేతలను సన్మానించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం కృషి భేష్

ఢిల్లీ స్కోటెక్ టీం ప్రతినిధులు

కంచికచర్ల (నందిగామ): రాష్ట్రంలోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం అభినందనీయమని ఢిల్లీ స్కోటెక్ టీం సభ్యుడు జియోజాన్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఆదివారం ఢిల్లీకి చెందిన స్కోటెక్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా జియోజాన్ మాట్లాడుతూ మహిళలు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వ ప్రోత్సాహంతో వివిధ రకాల షాపులు, మార్ట్‌లు ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. ఇక్కడ మహిళలు స్వయం శక్తితో ఎదుగుతున్నారని, మహిళా మార్ట్‌లో బయట మార్కెట్ ధర కన్నా తక్కువ ధరలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించటం మంచి పరిణామమని పేర్కొన్నారు.

కొత్త డయాఫ్రమ్ వాల్!



▶ మొదటి పేజీ తరువాయి

డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించాలని సీడబ్ల్యూసీ పేర్కొంది.

కమీషన్ల కోసం చంద్రబాబు ఘోర తప్పిదం..

గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను తొలుత పూర్తి చేసి ఆ తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు కట్టాలి. వాటి మధ్యన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2లలో డయాఫ్రమ్ వాల్ నిర్మించాలి. కానీ చంద్రబాబు కమీషన్ల దాహంతో స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే గ్యాప్-2లో 1,396 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని 2018 జూన్ 11 నాటికి పూర్తి చేసి ఘోర తప్పిదానికి పాల్పడ్డారు. ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఇరువైపులా 800 మీటర్ల పొడవున ఖాళీ ప్రదేశాలను వదిలేసి చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో గోదావరికి 2019 అక్టోబర్‌లో భారీ వరద వచ్చింది. 2,454 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి.. ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడంతో 800 మీటర్లకు కుచించుకుపోయింది. దీంతో వరద ఉధృతి పెరిగి డయాఫ్రమ్ వాల్ కోతకు గురై దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. చంద్రబాబు నిర్వాకాల కారణంగా పోలవరం నిర్మాణంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఆ తప్పిదాలను సరిదిద్దేందుకు రూ.2,020 కోట్లకుపైగా వ్యయం అవుతుందని సీడబ్ల్యూసీ అంచనా వేసింది.

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేశారు. గోదావరి వరదను మళ్లించాక ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1లో 393 మీటర్ల పొడవుతో డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. వరద ఉధృతికి గ్యాప్-1లో డయాఫ్రమ్ వాల్‌కు ఏమాత్రం నష్టం వాటిల్లలేదు.
- వరదల ఉధృతికి గ్యాప్-2లో జి.కొండ కుడివైపున 89 మీటర్ల నుంచి 1,485 మీటర్ల వరకూ 1,396 మీటర్ల పొడవున నిర్మించిన డయాఫ్రమ్ వాల్ గత సర్కారు నిర్వాకాలతో దెబ్బతింది.
- దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పటిష్టతపై ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) నిపుణులు పలు రకాల పరీక్షలు నిర్వహించి 175 మీటర్ల నుంచి 360 మీటర్ల వరకూ 185 మీటర్ల మేర డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైనట్లు తేల్చారు.
- 480 నుంచి 510 మీటర్ల మధ్య 30 మీటర్ల మేర డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. 950 – 1,020 మధ్య 70 మీటర్ల మేర దెబ్బతినగా 1,170 నుంచి 1,370 మీటర్ల వరకూ 200 మీటర్ల మేర పూర్తిగా దెబ్బతిన్నట్లు తేల్చారు. అంటే 1,396 మీటర్ల పొడవున నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌లో 485 మీటర్ల మేర పూర్తిగా దెబ్బతిన్నట్లు నిర్ధారించారు.
- 363 మీటర్ల నుంచి 1,035 మీటర్ల వరకూ 672 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్ పైభాగంలో ఐదు మీటర్ల మేర దెబ్బతిన్నట్లు ఎన్‌హెచ్‌పీసీ స్పష్టం చేసింది.

డ్యామ్ భద్రత దృష్ట్యా..

దెబ్బతిన్న చోట్ల సమాంతరంగా 'యూ' ఆకారంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించి పాత దానితో అనుసంధానం చేస్తే సరిపోతుందని తొలుత సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ, ఎన్‌హెచ్‌పీసీ నిపుణులు ప్రతిపాదించారు. అయితే ఈ పనులు చేసేందుకు చాలా సమయం పడుతుంది. ఒకవేళ అలా చేసినా కూడా డయాఫ్రమ్ వాల్ పూర్తి సామర్థ్యం మేరకు ఊట నీటికి అడ్డుకట్ట వేయలేదు. అంతిమంగా ఇది డ్యామ్ భద్రతకే ప్రమాదకరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈనెల 3న కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నిర్వహించిన సమావేశంలో ఆ శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో పాత డయాఫ్రమ్ వాల్‌లో దెబ్బతిన్న చోట్ల సమాంతరంగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడం కంటే డ్యామ్ భద్రత దృష్ట్యా 1,396 మీటర్ల పొడవునా కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికే జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మొగ్గు చూపారు. దీనిపై సమగ్రంగా చర్చించి నివేదిక ఇవ్వాలని జల్ శక్తి శాఖ ప్రత్యేక కార్యదర్శిని ఆదేశించడంతో నేడు ఢిల్లీలో సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

ఇదీ డయాఫ్రమ్ వాల్..

డయాఫ్రమ్ వాల్‌ను ఎలా నిర్మిస్తారంటే?.. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో రాతి పొర తగిలేవరకూ పెద్ద పెద్ద డాగర్లు, ట్రెంచ్ కట్టర్లతో భూగర్భాన్ని తవ్వుతూ పోతారు. ఇలా తవ్వే క్రమంలో ఖాళీ ప్రదేశాన్ని బెంటనైట్ మిశ్రమంతో నింపుతారు. రాతి పొర తగిలాక కాంక్రీట్ మిశ్రమాన్ని తవ్విన ప్రాంతంలోకి పంపుతారు. అప్పుడు బెంటనైట్ మిశ్రమం బయటకు వస్తుంది. కాంక్రీట్ మిశ్రమంతో కొంత మేర మిగిలిపోయిన బెంటనైట్ మిశ్రమం కలిసి ప్లాస్టిక్ కాంక్రీట్‌గా ఏర్పడుతుంది. ఇది అత్యంత పటిష్టంగా ఉంటుంది. భూగర్భంలో ఒకవైపు నుంచి మరో వైపునకు ప్రవాహం వెళ్లకుండా (ఊట నీరు) సమర్థంగా అడ్డుకుంటుంది. దీంతో దీనిపై నిర్మించే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ అత్యంత పటిష్టంగా ఉంటుంది. గోదావరికి 50 లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ వరద వచ్చినా చెక్కుచెదరకుండా నిలబడుతుంది.

పోలవరం వద్ద 498.07 టీఎంసీల లభ్యత

- గోదావరి బేసిన్‌లో 41 ఏళ్లుగా వర్షపాతం, ప్రవాహం ఆధారంగా సీడబ్ల్యూసీ అధ్యయనం
- పోలవరం, ధవళేశ్వరం బ్యారేజీల మధ్య ఏటా 778.39 టీఎంసీల ప్రవాహం
- తెలుగు రాష్ట్రాల్లో గోదావరి బేసిన్‌లో 75 శాతం లభ్యత ఆధారంగా 1,435 టీఎంసీల లభ్యత

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరిలో 75 శాతం (నికర జలాలు) లభ్యత ఆధారంగా ఏటా సగటున 498.07 టీఎంసీల లభ్యత ఉంటుందని కేంద్ర జలసంఘం తాజాగా తేల్చింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా 484.7 టీఎంసీలను వినియోగించుకోవడానికి గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) మన రాష్ట్రానికి అనుమతి ఇచ్చింది. అంటే ట్రిబ్యునల్ అనుమతించిన దాని కంటే పోలవరం వద్ద గోదావరిలో నికర జలాల లభ్యత 13.37 టీఎంసీలు అధికంగా ఉన్నట్లు సీడబ్ల్యూసీ అంచనా వేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలో సబ్ బేసిన్ల వారీగా గోదావరిలో నీటి లభ్యతను తేల్చాకే రెండు రాష్ట్రాలు కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని గోదావరి బోర్డును ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కోరాయి. దీంతో గోదావరి బోర్డు ఆ బాధ్యతను సీడబ్ల్యూసీకి అప్పగించింది.

పోలవరానికి సగటున 1,198.35 టీఎంసీలు

తెలుగు రాష్ట్రాల పరిధిలో పెన్‌గంగా (జీ-7), ప్రాణహిత (జీ-9), దిగువ గోదావరి (జీ-10), ఇంద్రావతి(జీ-11), శబరి (జీ-12) పరీవాహక ప్రాంతాలలో 1971-72 నుంచి 2011-12 మధ్య 41 ఏళ్లలో కురిసిన వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా గోదావరిలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలో గోదావరిలో ఏటా 1,435 టీఎంసీల నికర జలాల లభ్యత ఉంటుందని తేల్చింది. పోలవరం వద్దకు ఏటా సగటున 1,198.35 టీఎంసీల ప్రవాహం వస్తుందని అంచనా వేసింది. 75 శాతం లభ్యత ఆధారంగా చూస్తే 498.07 టీఎంసీల లభ్యత ఉంటుందని తేల్చింది. పోలవరం, ధవళేశ్వరం బ్యారేజీల మధ్య ఏటా సగటున 778.39 టీఎంసీల ప్రవాహం ఉంటుందని సీడబ్ల్యూసీ అంచనా వేసింది. ఇందులో 75 శాతం లభ్యత ఆధారంగా చూస్తే 45.83 టీఎంసీల లభ్యత ఉంటుందని తేల్చింది.

ఇక గ్లోబల్ గండికోట

▶ మొదటి పేజీ తరువాయి

వైఎస్సార్ జిల్లా, గండికోట రెండూ అంతర్జాతీయంగా చోటు దక్కించుకుంటున్నాయని అన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉద్యోగావకాశాలు విస్తృతం

ఇక్కడ ఒబెరాయ్ హోటల్ రావడం వల్ల ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయి. ఈ హోటల్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 500 నుంచి 800 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒబెరాయ్ ప్రాజెక్టు అనేది మిగిలిన ప్రాజెక్టులు రావడానికి ఒక దిక్సూచిగా ఉపయోగపడుతుంది. గండికోటలో ఇలాంటి గ్రూపు ప్రాజెక్టులు రావడానికి ఇంకా అవకాశం ఉంది. ఒబరాయ్ లాంటి ఇంకో గ్రూపుని తీసుకొచ్చే కార్యక్రమం ముమ్మరంగా చేస్తాం.

- ఇంతకుముందు విక్రమ్ ఒబెరాయ్‌తో మాట్లాడుతూ ఇక్కడ గోల్ఫ్ కోర్ట్ పెట్టే ఆలోచన చేస్తే హోటల్‌కు మంచిదని, ఈ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయని.. ఈ హోటల్‌ను ఒక గోల్ఫ్ రిసార్ట్‌గా దేశానికి, ప్రపంచానికి పరిచయం చేసే అవకాశాలు ఉంటాయని చెప్పాను. ఆ దిశగా అడుగులు వేసేలా ఆలోచన చేస్తామన్నారు.
- విక్రమ్ ఒబెరాయ్‌కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇక్కడ ఈ ప్రాజెక్టు రావడానికి శాయశక్తులా కృషి చేసిన చీఫ్ సెక్రటరీ కెఎస్ జవహర్‌రెడ్డి నుంచి పర్యాటక శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సహా ప్రతి ప్రభుత్వ అధికారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఈ ప్రాజెక్టుకు మీ అందరి సహకారం చాలా అవసరం. ఈ కంపెనీ మన గురించి బయట గొప్పగా మాట్లాడితే ఇంకా నాలుగు కంపెనీలు ఇక్కడకు వచ్చే పరిస్థితి ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి.
- ఏవైనా చిన్న చిన్న అంశాలుంటే కలిసి మాట్లాడుకుని పరిష్కరించుకుందాం. మనం ఎంత సహకారం అందిస్తే మన జిల్లా ప్రతిష్ఠ అంతగా పెరిగి అంత ఎక్కువ పరిశ్రమలు వస్తాయి.. పారిశ్రామిక వేత్తలు పెట్టుబడి పెడతారు. మీ సోదరునిగా అందరికీ ఇదే నా విజ్ఞప్తి. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.


ఏపీ కార్ల్ లో నూటెక్ బయోసైన్సెస్‌ను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

ఇక వేగంగా స్టీల్ ప్లాంట్ పనులు

- జమ్మలమడుగు నియోజకవర్గంలో స్టీల్ ఫ్యాక్టరీ రావాలని కలలు కన్నాం. మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగ అవకాశాలు రావాలని దశాబ్దాలుగా కన్న కలను నిజం చేస్తూ గతేడాది జిందాల్ గ్రూపుతో కలిసి ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. ఇందుకు సంబంధించిన వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు ఈ నెలలోనే ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ వస్తుంది. ఆ తర్వాత రెట్టించిన వేగంతో పనులు జరుగుతాయి.
- రేపు కొప్పర్తిలో డిక్సన్ కంపెనీకి సంబంధించిన ప్లాంట్‌కు ప్రారంభోత్సవం చేస్తున్నాం. కొప్పర్తిలో డిక్సన్ గ్రూపు 1000కి పైగా ఉద్యోగాలు ఇచ్చింది. మరో రెండు నెలల్లో ఇంకో 1000 ఉద్యోగాలు రాబోతున్నాయి. ఛానల్ ప్లే అనే మరో కంపెనీ హోం ఆడియో సిస్టమ్స్ తయారు చేస్తుంది. రేపు కొప్పర్తిలో ఆ కంపెనీతో ఎంఓయూపై సంతకాలు చేయనున్నాం. ఈ కంపెనీ ద్వారా 150 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.
- ఎల్ఈడీ టీవీలు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ తయారు చేసే టెక్నో డామ్ ఇండియా అనే మరో కంపెనీతో కూడా రేపు ఎంఓయూ చేయబోతున్నాం. ఈ కంపెనీ ద్వారా మరో 200 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. వైఎస్సార్ జిల్లాకు ఇంకా మంచి చేయాల్సిన అవసరం, మంచి జరిగే రోజులు చాలా ఉన్నాయి. దేవుడి దయ, మీ చల్లని ఆశీస్సులతో రాబోయే రోజుల్లో ఇంకా మెరుగ్గా చేసే పరిస్థితులు, అవకాశం రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఏపీటీడీసీ చైర్మన్ వరప్రసాద్, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయ రామరాజు, ఒబెరాయ్ గ్రూప్ పీసీఓ ప్రెసిడెంట్ శంకర్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


పులివెందులలో నూతనంగా నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎం జగన్


పర్యాటక అభివృద్ధి పరుగులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికా బద్ధమైన విజనరీతో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రాచీన సాంస్కృతిక వైభవం కలిగిన గండికోటలో ఒబెరాయ్ హోటల్ నిర్మాణం సీఎం చొరవ వల్లే సాధ్యమైంది. కోవిడ్ దెబ్బతో కుదేలైన పర్యాటక రంగాన్ని సీఎం ప్రణాళిక బద్ధంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

– ఆర్‌కే రోజా, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి

పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం



రాష్ట్ర పర్యాటక రంగంలో కొత్త అధ్యాయానికి సీఎం శ్రీకారం చుట్టారు. గండికోట చాలా ప్రసిద్ధిగాంచిన ప్రాంతం. ఈ ప్రాంతంలో గండికోట, మైలవరం రిజర్వాయర్లు ఉన్నాయి. జలయజ్ఞంలో భాగంగా నిర్మించిన ఈ జలాశయాలున్న ఈ ప్రాంతంలో టూరిజం రిసార్ట్స్ నెలకొల్పడం సీఎం దార్శనికతకు నిదర్శనం. పోలవరం వద్ద కూడా పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

– కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

పారిశ్రామిక హబ్‌గా వైఎస్సార్ జిల్లా



ముఖ్యమంత్రి విజనరీతో వైఎస్సార్ జిల్లా పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో వేల కోట్ల రూపాయల ఒప్పందాలు కుదుర్చుకున్నాం. అందులో భాగంగానే నేడు ఒబెరాయ్ సంస్థ మూడు చోట్ల హోటల్స్ నిర్మాణానికి ముందుకు వచ్చింది. చిత్రావతి, పెన్నా సంగమం ఒడ్డున దుర్భేద్యమైన గండికోటను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి సీఎం చొరవ తీసుకుంటున్నారు.

– వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప ఎంపీ

వరల్డ్ క్లాస్ హోటల్స్... ఒబెరాయ్ గ్రూపులు



రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒక్క సెవెన్ స్టార్ రిసార్ట్స్ కూడా లేదు. అలాంటిది ఒకేసారి గండికోట, తిరుపతి, వైజాగ్‌లలో మూడు చోట్ల ఒబెరాయ్ గ్రూప్ లగ్జరీ రిసార్ట్స్ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేయడం గర్వించదగిన విషయం.

– రజత్ భార్గవ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్

ఈ ప్రాంతాభివృద్ధికి సీఎం విశేష కృషి



జమ్మలమడుగు ప్రాంతం అభివృద్ధికి సీఎం ప్రత్యేక చేయూత ఇస్తున్నారు. దివంగత సీఎం వైఎస్సార్ గండికోట పరి సర ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించారు. ఆయన మన మధ్య నుంచి దూరమవ్వడంతో ఆ తర్వాతి ప్రభుత్వాలు పట్టించు కోలేదు. ప్రస్తుతం సీఎం జగన్ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– డాక్టర్ సుధీర్ రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే




గరండాల్ రివర్ ఫ్రంట్ గార్డెన్‌లో జెండా ఊపి బోటింగ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


పులివెందులలో వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్


బాణాన్ని సంధిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పులివెందుల సిటీఫారెస్ట్‌ను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్


విక్రమ్‌సింగ్ ఒబెరాయ్‌తో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

అభివృద్ధికి 'పులివెందుల' ఆదర్శం


వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభోత్సవ సందర్భంగా హాకీ ఆడుతున్న సీఎం వైఎస్ జగన్

- మున్సిపల్ భవన ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్
- రూ.142.37 కోట్లతో చేపట్టిన పలు నిర్మాణాలు ప్రజలకు అంకితం
- సిటీ ఫారెస్ట్, రివర్ ఫ్రంట్, స్కిల్ ట్రైనింగ్ అకాడమీ, నూటెక్ బయో సైన్సెస్, స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభం

పులివెందుల : అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణం దేశానికే ఆదర్శం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఆయన పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ.142.37 కోట్లతో పూర్తి చేసిన పలు భవనాలను, నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలా తీర్చిదిద్దామని చెప్పారు. రూ.3.25 కోట్లతో నిర్మించిన పులివెందుల మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ భవనం, రూ.16.18 కోట్లతో 30 ఎకరాల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన పులివెందుల సిటీ ఫారెస్ట్ (రాణి తోపు), రూ.39 కోట్లతో ఏర్పాటు చేసిన గరండాల్ రివర్ ఫ్రంట్(ఫేజ్-1) గార్డెన్‌లను సీఎం ప్రారంభించారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో 1.25 కి.మీ పొడవుతో నిర్మితమైన ఈ పార్కులో రెండు చెక్‌డ్యాంలు, బోటింగ్, ఫ్లోటింగ్ జెట్టీ, వ్యూ పాయింట్, సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, యోగా, వాటర్ ఫౌంటెన్, బీచ్ వాలీబాల్, మియావకీ ఫారెస్ట్, హార్డ్ అండ్ సాఫ్ట్ స్కేప్స్, ఓపెన్ జిమ్ తదితర సదుపాయాలు ఉన్నాయి. రూ.32.82 కోట్లతో ఎనిమిది ఎకరాల్లో నిర్మించిన వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమికి సంబంధించి అకాడమిక్ బ్లాక్, హాస్టల్ బ్లాక్, మల్టీపర్పస్ భవనాలను ప్రారంభించారు. ఏపీ కార్ల్ ప్రాంగణంలో రూ.25 కోట్లతో ఏర్పాటు చేసిన నూటెక్ బయో సైన్సెస్ (లైవ్ స్టాక్ ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించే సప్లిమెంట్స్ తయారీ), రూ.26.12 కోట్లతో 12.86 ఎకరాలలో 12 రకాల క్రీడాంశాలకు సంబంధించిన వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించారు. హాకీ, ఆర్చరీ బ్లాక్‌లలో సీఎం జగన్.. క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలకు శుభారంభం పలికారు.



పులివెందుల మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

క్లుప్తంగా...

లండన్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



లండన్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి/కడప కార్పొరేషన్: ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత వైఎస్సార్ చిరస్మరణీయులని వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్ చింతా ప్రదీప్ కొనియాడారు. లండన్ నగరంలోని ఈస్ట్ హామ్‌లో శనివారం వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ వైఎస్సార్ తర్వాత పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి యూకే నలుమూలల నుంచి వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మలిరెడ్డి కిషోర్‌రెడ్డి, పీసీ రావు, కిరణ్, ఓబుల్ రెడ్డి, మనోహర్, నారాయణ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కువైట్‌లో..



కువైట్‌లో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తూ..

వైఎస్సార్ జయంతి వేడుకలు కువైట్‌లో ఘనంగా నిర్వహించారు. మొదట వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి, కమిటీ సభ్యులు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. గల్ఫ్ కోకన్వీనర్ గోవిందు నాగరాజు, కువైట్ కో కన్వీనర్ ఎంవీ నరసారెడ్డి, ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, రమణయాదవ్, మర్రి కళ్యాణ్, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, అబుతురాబ్, బీఎన్ సింహా, వైఎస్ లాజరస్ పాల్గొన్నారు.

దుబాయ్‌లో..



దుబాయ్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు

దుబాయ్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూఏఈ(దుబాయ్) కన్వీనర్ సయ్యద్ అక్రం బాషా, జీసీసీ యూఏఈ సలహాదారు ప్రసన్న సోమిరెడ్డి, కమిటీ సభ్యులు వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ యూఏఈ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నేతలు, ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల్ని నాశనం చేసింది బాబే

- ఎంపీ నందిగం సురేష్



సాక్షి, అమరావతి: పచ్చటి పొలాలను ఛిన్నాభిన్నం చేసి అమరావతి రైతులను సర్వ నాశనం చేసింది టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబేనని వైఎస్సార్ సీపీ ఎంపీ నందిగం సురేష్ ధ్వజమెత్తారు. చంద్రబాబు స్వార్థంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కృత్రిమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. అమరావతి ప్రాంతంలో పెయిడ్ టెంట్ వద్ద మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు దగ్గర బానిసలా బతకొద్దన్నారు. నక్కా నిజంగా దళితుడైతే అమరావతిలో ఇళ్ల పట్టాలను అడ్డుకున్న చంద్రబాబును ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. లోకేశ్‌కు సత్తా ఉంటే ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి రావాలన్నారు. వాహనం ఎక్కి ఊగడం, వాగడం మినహా వారాహి యాత్రలో పవన్ కళ్యాణ్ చేస్తున్నది ఏమిటని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఎంపీ సురేష్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ నేతలు ఇకనైనా అమరావతి అనే బూటకపు వ్యాపారాన్ని కట్టిపెట్టాలి. ప్రజలంతా మూడు ప్రాంతాలు అభివృద్ధి కావాలని కోరుకుంటున్నారు. టీడీపీ నేతలు పది రోజులకోసారి సీఎం జగన్‌ను దూషించడం మినహా అక్కడ జరుగుతున్న ఉద్యమం ఏముంది? చంద్రబాబును నమ్మితే నడి సంద్రంలో ముంచేస్తారు. 2024 తర్వాత ఆయన రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటారు'అని చెప్పారు.

బీసీలకు అండ టీడీపీ : లోకేశ్



బిట్రగుంట: బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా టీడీపీ అండగా నిలిచిందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం తాటిచెట్లపాలెంలో బీసీ సంఘాల ప్రతినిధులతో ఆదివారం ముఖాముఖి నిర్వహించారు. బీసీలు అంటే సీఎం జగన్‌కు చిన్నచూపు అని ఆరోపించారు.

జనం రాకపోవడంతో 'సాక్షి'పై అక్కసు

బోగోలు మండలంలో లోకేశ్ పాదయాత్రకు జనాలు రాకపోవడం, నేతల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించడంతో యాత్ర మొత్తం నీరసంగా సాగింది. యాత్రకు జనాలు రాని విషయాన్ని 'సాక్షి' ఫొటోలతో సహా ప్రచురించడంతో ఆ పార్టీ నాయకులు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి 'సాక్షి'పై అక్కసు వెళ్లగక్కారు.

ఏపీలో అమెరికా పూల సోయగాలు

లిసియాంతస్ సాగుకు ఏపీ అనుకూలమని తేల్చిన ఉద్యాన వర్సిటీ

ఉత్తర అమెరికాలో ఇవి ఎంతో స్పెషల్

రైతులకు శిక్షణ, సాంకేతిక చేయూత అందించేందుకు నిర్ణయం



సాక్షి, అమరావతి: లిసియాంతస్.. ఉత్తర అమెరికా ప్రాంతానికి చెందిన ఈ పువ్వులు గులాబీలను పోలి ఉండే కట్ ఫ్లవర్స్. విభిన్న రంగుల్లో ఉండే ఇవి మైదాన, కొండ ప్రాంతాల్లోనే కాదు ఇంటి ఆవరణలో పూలకుండీల్లోనూ పెంచుకునేందుకు అనువైనవి. బొకేలు, అలంకరణకు ఉపయోగించే ఈ పూలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. వీటిని మన రాష్ట్రంలోనూ సాగు చేసేవిధంగా శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ఫలించాయి. దేశంలోని బెంగళూరు పరిసర ప్రాంతాల్లో కొద్దిపాటి విస్తీర్ణంలో లిసియాంతస్ పూల ను సాగు చేస్తున్నారు. వీటి సాగుకు ఆంధ్రప్రదేశ్‌లోనూ అనువైన వాతావరణం ఉన్నట్టు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు గుర్తించారు. అల్లూరి జిల్లాలోని చింతపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రంలోని పాలీహౌస్‌లో 6 రకాల లిసియాంతస్‌పై పరిశోధనలు జరిపారు. పింక్, ఆకుపచ్చ, పసుపు, తెలుపు, నీలం, పికోటీ, చాంపేన్ రకాలను ప్రయోగాత్మకంగా సాగు చేశారు. శీతాకాలంలో మైదాన ప్రాంతాల్లోను, కొండ ప్రాంతాల్లో వేసవి కాలంలోనూ వీటిని సాగు చేయవచ్చని గుర్తించారు. ఇండోర్ డెకరేషన్‌కు ఉపయోగించే ఈ పూలు కనీసం ఐదారు రోజుల పాటు తాజాదనం కోల్పోకుండా ఉంటున్నాయి. అలంకరణ కోసం ఉపయోగించే ఈ పూలకు యూరోప్, చైనా, ఇంగ్లాండ్, వియత్నాం, మలేషియా, జపాన్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది.

రూ.40 లక్షల ఆదాయం

వీటి పంట కాలం నాలుగు నెలలు. నర్సరీల్లో 70 నుంచి 75 రోజులు ఉంచాలి. నాటిన 60 రోజులకు పుష్పిస్తాయి. ఒక మొక్క మూడు కొమ్ములతో ఉంటుంది. కాండానికి 9 నుంచి 12 పువ్వులు వస్తాయి. సీజన్ బట్టి ఒక్కొక్క పువ్వు రూ.20 నుంచి రూ.35 వరకు పలుకుతుంది. రూ.24 లక్షల వరకు పెట్టుబడి పెడితే.. రూ.40 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడి పోనూ రూ.12 లక్షల నుంచి రూ.16 లక్షల నికర ఆదాయం పొందొచ్చు. మన ప్రాంతానికి రోసిట 3 బ్లూ పికోటీ వెరైటీ-2, ఎక్స్ కాలిబూర్ 3 బ్లూ పికోటీ, రోసిట 4 ప్యూర్ వైట్, రోసిట 3 పింక్ పికోటీ, రోసిట 4 గ్రీన్ రకాలు అనుకూలమని తేల్చారు.

లంక భూములకు పట్టాలు

▶ మొదటి పేజీ తరువాయి

లంక భూములను సాగుచేసుకుంటున్న అనేకమంది రైతులకు పట్టాల్లేవు. తమకు పట్టాలివ్వాలని అక్కడి రైతులు అనేక ఏళ్లుగా ప్రభుత్వాలను కోరుతున్నారు. కానీ, గత ప్రభుత్వాలు వారి అభ్యర్థనలను పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు సిద్ధమైంది. వివాదాల్లేకుండా సాగు చేసుకుంటున్న అర్హులకు పట్టాలిచ్చేందుకు వీలుగా లంక భూముల అసైన్ నిబంధనలను సవరించింది. ఈ నిబంధనల ప్రకారం దరఖాస్తులు తీసుకోగా ఎనిమిది జిల్లాల నుంచి 19,282 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించిన రెవెన్యూ యంత్రాంగం.. 9,062.39 ఎకరాలకు సంబంధించిన 19,176 దరఖాస్తులను అర్హమైనవిగా తేల్చింది. ఎ-కేటగిరీలో 475.93 ఎకరాలను 1,178 మందికి.. బి-కేటగిరీలో 848.22 ఎకరాలను 2,333 మందికి.. సి-కేటగిరీలో 7,738.25 ఎకరాలను 15,665 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు అసైన్‌మెంట్ కమిటీలు ఆమోదం కూడా తెలిపాయి. ఈ భూములకు జిల్లా కలెక్టర్ సంతకంతో పట్టాలు ఇవ్వనున్నారు. సాధారణ వ్యవసాయ భూముల పంపిణీలో ఇచ్చే పట్టాలపై తహసీల్దార్ సంతకం ఉంటుంది. కానీ, ఇవి లంక భూములు కావడంతో కలెక్టర్ సంతకాలతో ఇవ్వాలని నిర్ణయించారు. అత్యధికంగా కృష్ణాజిల్లాలో 3,570 ఎకరాలను 6,257 మందికి పట్టాలు ఇవ్వనున్నారు. అతిత్వరలో వీటిని రైతుల చేతికి అందనున్నాయి.

కేటగిరీల మార్పునకు కసరత్తు

అలాగే, నిబంధనలకు అనుగుణంగా లంక భూముల కేటగిరీలను మార్చేందుకు కసరత్తు జరుగుతోంది. సి-క్లాస్ నుంచి బి-క్లాస్‌కి మార్చాలని 2,628 ఎకరాలకు సంబంధించి అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, రివర్ కన్జర్వేటర్ (ఇరిగేషన్ ఈఈ)లతో ఏర్పాటైన కమిటీలు వాటిలో నిబంధనల ప్రకారం సుమారు 1,370 ఎకరాల కేటగిరీ మార్చేందుకు అనుమతిచ్చాయి.



జిల్లాల వారీగా పట్టాలిచ్చే లంక భూములు, లబ్ధిదారుల వివరాలు..

జిల్లా	భూములు (ఎకరాల్లో)	లబ్ధిదారులు
కృష్ణా	3,570.80	6,257
బాపట్ల	1,010.18	2,480
ఎన్టీఆర్	985.26	1,761
కోనసీమ	984.41	3,003
తూ.గోదావరి	919.90	3,182
ప.గోదావరి	836.16	1,318
పల్నాడు	507.80	765
గుంటూరు	247.88	410
మొత్తం	9,062.39	19,176

కొర్రలకు 'మద్దతు' ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

కొర్రలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో ఏపీ పౌరసరఫరాల సంస్థ సమగ్ర వివరాలతో కొర్రలకు మద్దతు ధర కోసం ప్రతిపాదనలు పంపే పనిలో నిమగ్నమైంది.

పీడీఎస్ ద్వారా పంపిణీకి చర్యలు..

రాష్ట్రంలోని 1.47 కోట్ల రైస్ కార్డుదారులకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో సీఎం జగన్ అడుగులు వేస్తున్నారు. రెండు నెలల నుంచి రాయలసీమ, ఉత్తరాంధ్రలోని 13 జిల్లాల్లో రాగులు, జొన్నలను పంపిణీ చేస్తున్నారు. కార్డుదారుల ఐచ్ఛికం మేరకు 2 కేజీల బియ్యం బదులు వీటిని అందిస్తుండగా.. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రాయలసీమ, ఉత్తరాంధ్రలో రాగులను ఎక్కువగా వినియోగిస్తుంటారు. దీంతో పీడీఎస్‌లో జొన్నల కంటే రాగులకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే 8 వేల టన్నులకు పైగా రాగులను పంపిణీ చేశారు. తాజాగా కొర్రలను కూడా పీడీఎస్ జాబితాలో చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. స్థానికంగా రైతుల నుంచే కొనుగోలు చేసి తిరిగి ప్రజలకు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించింది.

గ్రామాల్లో సర్వే..

మరోవైపు రాష్ట్రంలోని అన్ని మునిసిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని పంపిణీ చేస్తున్నారు. కార్డుకు కిలో చొప్పున రూ.16కు ప్రత్యేక ప్యాకింగ్‌లో దీనిని అందిస్తున్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో గోధుమ పిండి వినియోగం తక్కువ ఉండటంతో.. కొత్తగా సర్వే చేపట్టి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ప్రకారం పంపిణీకి నిర్ణయం తీసుకోనున్నారు. అయితే బియ్యం బదులుగా కూడా గోధుమ పిండిని తీసుకునే వెసులుబాటు కల్పించి.. ఇప్పుడిచ్చే ధర కంటే తక్కువకే సరఫరా చేసే యోచనలో పౌరసరఫరాల శాఖ ఉంది.



పౌష్టికాహారం తప్పనిసరి

ఆరోగ్య రక్షణ దృష్ట్యా ప్రతి ఒక్కరూ బలవర్థక ఆహారం తీసుకోవాల్సిన అవసరముంది. అందుకే పేదలకు పీడీఎస్ ద్వారా పంపిణీ చేసే నిత్యావసరాల్లో చిరుధాన్యాలను అందిస్తున్నాం. ఇప్పటివరకు రాగులు, జొన్నలు ఇచ్చాం. ఇకపై కొర్రలను కూడా పంపిణీ చేసే ఆలోచన చేస్తున్నాం. దీని ద్వారా రైతులకు, వినియోగదారులకు లాభం కలుగుతుంది. ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని గ్రామీణ ప్రాంతాల్లోని కార్డుదారులు కూడా కోరుకుంటే అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– హెచ్.అరుణ్ కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ


'తానా'లో తంతానా!

- 'జై ఎన్టీఆర్' నినాదాల కలకలం
- తన్నుకున్న లోకేశ్, జూ.ఎన్టీఆర్ వర్గాలు

పెన్సిల్వేనియా(అమెరికా): అమెరికాలో 'తానా' (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) సభల సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, లోకేశ్ వర్గాలు పరస్పరం తన్నుకున్నాయి. రెండుగా చీలిపోయిన టీడీపీ ఎన్నారై సభ్యులు పిడిగుద్దులు గుద్దుకున్నారు. తరని పరుచూరి, సతీష్ వేమన వర్గాలు పరస్పరం చొక్కాలు పట్టుకుని మరీ దాడులకు దిగాయి. టీడీపీ ఎన్నారై అధ్యక్షుడు కోమటి జయరాం సమక్షంలోనే ఈ ఘటన జరిగింది. లోకేశ్ నాయకత్వంపై వ్యక్తమైన విమర్శలే ఘర్షణకు కారణమని తెలుస్తోంది. కొందరు 'జై ఎన్టీఆర్' అని నినదించడంతో ఉలిక్కిపడ్డ చంద్రబాబు వర్గం దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. పార్టీ పగ్గాలు చంద్రబాబు చేతిలో ఉన్నంతవరకు టీడీపీకి మనుగడ లేదని, 2024లోనూ పరాజయం ఖాయమని కొందరు వాదించినట్లు సమాచారం. జూనియర్ ఎన్టీఆర్‌కు పార్టీ పగ్గాలను అప్పగించాలని ఓ వర్గం డిమాండ్ చేసింది. దీంతో కలవరం చెందిన చంద్రబాబు వర్గం దాడులకు దిగినట్లు తెలిసింది. పెన్సిల్వేనియాలో తానా 23వ మహాసభలను ఘనంగా ప్రారంభించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రిటైర్డ్ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే బాలకృష్ణ తదితరులు వేడుకలను ప్రారంభించారు. తొలిరోజు బాంకెట్ డిన్నర్ ముగిశాక కొందరు కన్వెన్షన్ సమీపంలోని హాల్లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీకి సంబంధించిన అంశాలపై తరని పరుచూరి, సతీష్ వేమన వర్గాల మధ్య వివాదం రేగడంతో ముష్టి యుద్ధానికి దిగారు.

సీఎంను ఏకవచనంతోనే సంబోధిస్తా..

- నాకు రాజకీయాలు అవసరంలేదు..
- ఇందులోకి వచ్చి తిట్టించుకోవడం నాకు సరదా కాదు
- వలంటీర్ల ద్వారా గ్రామాల్లో నిఘా
- ఏలూరు వారాహి విజయయాత్రలో పవన్‌కళ్యాణ్



సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'రాజకీయాల్లో అధికార పార్టీ నాయకులు విలువలపై మాట్లాడుతూ మా అమ్మ నుంచి నా భార్య వరకు అందరి గురించి నీచంగా మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి కూడా స్థాయి దిగజారి మాట్లాడుతున్నాడు. నేనూ ముఖ్యమంత్రిని ఏకవచనంతో మాట్లాడతాను. ముఖ్యమంత్రికి మనమేమి బానిసలం కాదు. మనకంటే ఆయనకు ఎక్కువ సౌకర్యాలిచ్చాం. మనందరికీ ధర్మాధికారిగా ఉంచాం'.. అని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. ఆదివారం రాత్రి వారాహి విజయయాత్రలో భాగంగా ఏలూరు నగరంలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..

నాకు రాజకీయాలు అవసరంలేదు. రాజకీయాల్లోకి వచ్చి తిట్టించుకోవడం నాకు సరదా కాదు. ఎన్నో అవమానాలు భరించా, ఎన్నో దెబ్బలు తిన్నాను.. రేపు ఓడిపోయినా కూడా పోరాటం చేస్తూనే ఉంటా. ట్యాక్స్‌లు సక్రమంగా వినియోగించి మేలు చేయాలని ముఖ్యమంత్రి స్థానంలో ఉంచాం. కాగ్ 2021–22 నివేదికలో ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపించింది. వంద మందిలో 30మందికి మాత్రమే ముఖ్యమంత్రి మేలుచేస్తూ 70 మందిని వదిలేస్తున్నాడు. నేను ప్రజా సమస్యలు గురించి మాత్రమే మాట్లాడతాను. నేనేం మాట్లాడినా వక్రీకరించి నన్ను విమర్శిస్తున్నారు. 20 లక్షల పక్షులకు నిలయమైన కొల్లేరు విషతుల్యమవుతున్నా ఎవరూ మాట్లాడరు. కొల్లేరును కాపాడుకోవడం అంటే మీ భవిష్యత్తును మీరు కాపాడుకోవడమే. అభివృద్ధి అంటే జగన్, మంత్రి అభివృద్ధి కాదు.. రాష్ట్రంలో ఒక్కో ఎమ్మెల్యే వందల కోట్లు దోచేస్తున్నారు. దేశంలో అన్ని షాపుల్లో డిజిటల్ పే ఉంది.. కానీ, మద్యం దుకాణంలో మాత్రం లేదు.

గ్రామాల్లో వలంటీర్ల నిఘా..

ఇక వలంటీర్లు గ్రామాల్లో నిఘా పెడుతున్నారు. ప్రతి గ్రామంలో ఎవరెవరు ఏ పార్టీ మనిషి, ఏ కుటుంబంలో ఎంతమంది ఉన్నారో ఆరా తీస్తున్నారు. చివరికి.. ఆడపిల్లలు ఎవరినైనా ప్రేమిస్తున్నారా, కుటుంబాల్లో ఎవరైనా వితంతువులు ఉన్నారా.. ఇలా వలంటీర్ల వద్ద నుండి సమాచారం సేకరించి హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారు. ఈ విషయంపై కేంద్ర నిఘా వర్గాలు నన్ను హెచ్చరించాయి. ఇందులో వైసీపీ పెద్దల హస్తం ఉంది.

ప్రజలతోనే నేరుగా సంబంధాలు

మా ప్రభుత్వంవల్ల లబ్ధిపొందితేనే ఓటు వేయమని సీఎం ధైర్యంగా చెబుతున్నారు: ఎంపీ మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

కాకినాడ రూరల్: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు నేరుగా వెళ్తున్నామని, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సేవలందిస్తున్నామని.. ఇలా ప్రజలతో నేరుగా సంబంధాలు పెట్టుకుని ఎన్నికల్లో గెలవాలన్నదే తమ వ్యూహమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ పి. మిథున్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లుగా 'జగన్ కావాలా.. వద్దా' అనే రెండు అంశాలపైనే ఎన్నికలుంటాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ పి. మిథున్‌రెడ్డి అన్నారు. కాకినాడలో ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చెప్పని విధంగా తమ వల్ల లబ్ధిపొందితేనే ఓట్లు వేయండని.. లేకుంటే వద్దని జగన్ ధైర్యంగా చెప్పారన్నారు. వచ్చే ఎన్నికల కోసం చంద్రబాబు ఎక్కువ హామీలు ఇస్తున్నారని.. అయితే, ఎన్నికల్లో గెలవడానికి మేనిఫెస్టో ఒక్కటే చాలదని, ప్రజల నమ్మకం పొందడం ముఖ్యమని ఆయన స్పష్టంచేశారు. ముద్రగడ పద్మనాభం చాలా సీనియర్ నేతని, వైఎస్సార్‌సీపీలోకి వస్తే ఆహ్వానిస్తామని, ఆయనొస్తే పార్టీ బలపడుతుందన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. అయితే, ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ముద్రగడ కలిసి తీసుకోవాల్సిన నిర్ణయమని మిథున్‌రెడ్డి చెప్పారు. ముందస్తు ఎన్నికలతో తమకు ఉపయోగమేమీ ఉండదన్నారు.

రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న పవన్ కళ్యాణ్

వ్యూహంలో భాగంగా తన కార్యకర్తలను, అభిమానులను రెచ్చగొట్టేలా పవన్ ప్రసంగాలు చేశారని మిథున్‌రెడ్డి అన్నారు. కాకినాడ జిల్లా కాపులకు అడ్డా అని, అక్కడ ఆ వర్గ ఎమ్మెల్యేపై మాట్లాడితే వ్యతిరేకత వస్తుందనే భయంతోనే వ్యూహాత్మకంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని టార్గెట్ చేశారని ఆయన చెప్పారు. ఇక ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 34 సీట్లూ వైఎస్సార్‌సీపీకి రాకుండా చూస్తానని చెబుతున్న పవన్.. ఆయన పార్టీ అసలు ఎన్ని సీట్లలో పోటీచేస్తుందో చెప్పాలని మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మంత్రి చెల్లుబోయిన వేణు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పెండెం దొరబాబు, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, జ్యోతుల చంటిబాబు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సిరీస్‌లా వారాహి యాత్ర

- పవన్ సినిమాల్లో హీరో.. రాజకీయాల్లో సైడ్ హీరో
- పారిశ్రామిక పెట్టుబడులపై కేబినెట్లో కీలక నిర్ణయాలు
- ఒబెరాయ్ గ్రూప్ రాకతో పర్యాటకానికి మరింత ఊపు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేస్తున్న వారాహి యాత్రను పార్ట్-1, పార్ట్-2 పేరుతో వెబ్‌సిరీస్‌లా చేస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. పార్ట్-1లో వారం రోజులకే జ్వరం వచ్చిందని నిలిపివేశాడని.. ఇప్పుడు పార్ట్-2 పేరిట మళ్లీ ప్రారంభించాడని.. అసలు ఆయన ఆ యాత్ర ఎందుకు చేస్తున్నాడో ఆయనకు తెలీదన్నారు. సినిమాలో పవన్ హీరో కానీ రాజకీయాల్లో ఆయన సైడ్ యాక్టర్ మాత్రమేనని మంత్రి సెటైర్లు వేశారు. ఆదివారం మంత్రి ఇక్కడి సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పవన్ ఒకరోజు సీఎం అవుతానంటాడు.. మరోరోజు ఆ పదవి ఇష్టం లేదంటాడు.. పొత్తులు గురించి నాకు వదిలేయండని చెబుతాడని.. నిజానికి, చంద్రబాబుని సీఎం చేయాలని పవన్ తహతహలాడుతున్నాడని విమర్శించారు. స్థిరత్వంలేని ఆయన మాటలకు జనసేన కార్యకర్తలే ముక్కున వేలేసుకుంటున్నారని మంత్రి విమర్శించారు.

12న కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు

విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో జరిగిన ఒప్పందాలపై 12న జరగనున్న కేబినెట్ సమావేశంలో సీఎం జగన్ కీలక నిర్ణయాలు తీసుకోనున్నారని మంత్రి తెలిపారు. ఒబెరాయ్ గ్రూప్ రాకతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి మరింత విస్తరించనుందన్నారు. ఎంఓయూలో భాగంగా ఒబెరాయ్ గ్రూప్ గండికోట, తిరుపతి, విశాఖలో సెవెన్ స్టార్ రిసార్టుల నిర్మాణం చేపడుతుందన్నారు. త్వరలో అరకులో కూడా ఈ గ్రూప్ కార్యకలాపాలను ప్రారంభించనుందని మంత్రి చెప్పారు.

త్వరలో డిక్సన్ కంపెనీ ప్రారంభం

కడపలో డిక్సన్ కంపెనీ టీవీ స్క్రీన్‌ల తయారీ పరిశ్రమను త్వరలోనే ప్రారంభించనుందని, తద్వారా వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి తెలిపారు. విశాఖపట్నం–చెన్నై, చెన్నై–బెంగళూరు, బెంగళూరు– హైదరాబాద్ కారిడార్ల మధ్య పారిశ్రామిక అవసరాల కోసం 50 వేల ఎకరాలు సిద్ధంచేశామన్నారు.

రుషికొండలో రుసుం వసూలుచేయలేదు..

రుషికొండ బీచ్‌లో ప్రవేశానికి రుసుం వసూలుచేస్తున్నారని వస్తున్న వార్తల్లో నిజంలేదని మంత్రి అమర్‌నాథ్ స్పష్టంచేశారు. ఆ బీచ్‌కు 'బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్' లభించిన నేపథ్యంలో అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రుసుం వసూలుచేయాలని కేంద్ర ప్రభుత్వ నిబంధనల్లో పేర్కొన్నారని తెలిపారు. కానీ, తమ ప్రభుత్వం ఎలాంటి రుసుం వసూలుచేయడంలేదన్నారు.

బాబూ.. ఏం సెప్తిరి.. ఏం సెప్తిరి!

- భర్త ఉన్నప్పటికీ వితంతు పింఛన్ ఇవ్వాలా?
- ఫిర్యాదు వచ్చిందని విచారిస్తుంటే దుష్ప్రచారం
- అక్రమంగా పింఛన్ ఆపారంటూ నానా యాగీ
- ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డగింత
- విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు
- ఇవన్నీ దాచేసి అసత్య ప్రచారం బాబుకే చెల్లు

ఎద్దు ఈనిందంటే ముసుపటికొకడు గాటికి కట్టెయ్యమన్నాడట. టీడీపీ అధినేత చంద్రబాబు వాలకం అచ్చం అలానే ఉంది. నిత్యం ప్రభుత్వంపై బురద చల్లనిదే నిద్రపట్టని పచ్చ పత్రికల ఓనర్లు ఇష్టానుసారం అబద్ధాలు ప్రచారం చేస్తుండటం ఈమధ్య కాలంలో శ్రుతిమించింది. వాటికి తాళం వేస్తూ తబలా వాయించనిదే బాబుకూ నిద్రపట్టడం లేదు. భర్త, పిల్లలున్న మహిళకు వితంతు పింఛన్ ఎందుకిస్తున్నారంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సదరు మహిళ తన వాళ్లను వెనకేసుకొచ్చి ఎంపీడీఓ కార్యాలయం వద్ద గొడవకు దిగితే పోలీసులు కేసు పెట్టారు. ఇందులో ఏం తప్పుందో.. నిస్సిగ్గుగా ప్రభుత్వాన్ని నిలదీస్తూ ట్వీట్ చేసిన చంద్రబాబే చెప్పాలి.

తర్లుపాడు: ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం పోతలపాడుకు చెందిన రాచీటి వెంకట రమణమ్మ, లక్ష్మయ్య దంపతుల మూడో సంతానం పెరికె నాగులు. ఈమెకు 2010లో మార్కాపురం మండలం జమ్మనపల్లికి చెందిన పరిశపోగు సుబ్బయ్యతో వివాహమైంది. 2012 నవంబర్ 10వ తేదీన వీరికి బాబు జన్మించాడు. ఆ తర్వాత ఆరు నెలలకు భర్త అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి నాగులు వితంతు పింఛన్ తీసుకుంటోంది. 2018లో నంద్యాల సమీపంలోని గాజులపల్లికి చెందిన పెరికె ఇర్మియతో ఈమెకు రెండో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు. గర్భిణిగా ఉన్నప్పుడు స్థానిక సబ్‌సెంటరులో, అంగన్‌వాడీ కేంద్రంలో భర్త పేరు ఇర్మియగా నమోదు చేసుకుంది. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు రికార్డుల్లో కూడా భర్త పేరు ఇర్మియగా తెలిపింది. అత్తతో విభేదాల కారణంగా స్వగ్రామమైన పోతలపాడులో భర్తతో కలిసి నివాసముంటోంది. భర్త బేల్దారి పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటూ అప్పుడప్పుడు వచ్చివెళ్తుంటాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు జూన్ చివరి వారంలో నాగులు అక్రమంగా వితంతు పింఛన్ పొందుతోందని పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

విచారిస్తామని చెప్పడమే తప్పా?


జూలై 1వ తేదీన పింఛన్ అందించాల్సిన వలంటీర్ గ్రామస్తుల ఫిర్యాదు విషయం తెలుసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడాక పింఛన్ అందిస్తానని నాగులుతో చెప్పాడు. అధికారులు విచారణ చేస్తుండగా జూలై 6వ తేదీన నాగులు, మరికొందరు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని లోపల ఉంచి బయట గడియ పెట్టి ఆందోళనకు దిగారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని మీర్జపేటలో ఉన్న ఎంపీడీవో హుటాహుటిన కార్యాలయం వద్దకు వెళ్లారు. ఆయన్ను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. కార్యాలయంలోనికి వెళ్లి మాట్లాడుకుందామని బతిమాలినా వినిపించుకోకుండా దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఎంపీడీవో విషయాన్ని తర్లుపాడు ఎస్ఐ వేముల సుధాకర్‌కు తెలుపడంతో ఆయన అక్కడకు చేరుకుని ఎంపీడీవోను లోపలికి పంపాలని వారికి సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. వినకపోవడంతో ఆందోళనకారులను చెదరగొట్టి ఎంపీడీవోను లోనికి పంపారు. లిఖిత పూర్వకంగా అర్జీ ఇస్తే విచారించి, న్యాయం చేస్తానని ఎంపీడీవో హామీ ఇవ్వడంతో ఆయనకు దరఖాస్తు చేసుకున్నారు. తన విధులకు ఆటంకం కల్పించి, దౌర్జన్యానికి పాల్పడ్డారన్న ఎంపీడీవో ఫిర్యాదు మేరకు గాయం శ్రీనివాసరెడ్డి, చెంచిరెడ్డి, నాగులుతోపాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వాస్తవం ఇలా ఉంటే పింఛన్ ఎందుకు తొలగించారని అడిగినందుకు కేసు పెట్టడం దారుణం అని చంద్రబాబు పచ్చమీడియా వార్తలకు వంతపాడుతూ దుర్మార్గంగా ట్వీట్ చేశారు.



అంగన్‌వాడీ రికార్డులో పెరికె నాగులు భర్త ఇర్మియాగా నమోదైన పేరు

ఎల్లో మీడియా వార్తలే చంద్రబాబు ట్వీట్లు

సాక్షి, అమరావతి: ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎల్లో మీడియాలో వచ్చే వార్తలనే ప్రతిపక్ష నేత చంద్రబాబు ట్వీట్లుగా మలుస్తున్నారు. రోజూ పుంఖానుపుంఖాలుగా వచ్చే వార్తలకు తన వ్యాఖ్యలు జోడించి వాటినే ట్విటర్‌లో పోస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. శనివారం కూడా 'రాష్ట్రంలో రోజుకో ఘోరం.. ప్రతిచోటా ప్రభుత్వ టెర్రరిజం' అంటూ మూడు వ్యతిరేక వార్తలను కోట్ చేశారు. రాష్ట్రంలో జరిగే ఏ ఘటననైనా ప్రభుత్వానికి ముడిపెట్టి ఘోరం జరిగిపోతోందని, అందులో వైఎస్సార్‌సీపీ ప్రమేయం ఉందని, సీఎం జగనే అది చేయించారనే రీతిలో ఈనాడు, దాని తోకపత్రికలో వార్తలు వండివార్చడం పరిపాటిగా మారింది. ధర్మవరానికి చెందిన ఇద్దరు వస్త్ర వ్యాపారులను విజయవాడలో నిర్బంధించి దాడి చేసిన కేసులో ఫిర్యాదు లేకున్నా పోలీసులు విచారించి బాధ్యుడిని అరెస్ట్‌చేస్తే, దాంతో ప్రభుత్వానికి లింకుపెట్టి ఎల్లో పత్రికలు వార్తల్ని అచ్చేశాయి. వ్యాపారుల మధ్య జరిగిన ఘటనను వైఎస్సార్‌సీపీకి అంటగట్టడం, శాంతి భద్రతలు క్షీణించాయంటూ ఎల్లో మీడియా గగ్గోలు పెడుతోంది. దానికి చంద్రబాబు ఆయన పరివారం తాళం వేస్తున్నారు. టీడీపీ నేతలు కూడా రోజూ ప్రెస్‌మీట్లు పెట్టి.. ఎల్లో మీడియా బురద వార్తలను చదువుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



యుద్ధపు అంతాన్ని కేవలం చనిపోయినవాళ్లే చూశారు.

– ప్లేటో

సాక్షి

సోమవారం, 10 జూలై 2023

వానలు కురవాలి

ఇది ఆషాఢ మాసం. వర్షారంభ కాలం. ఆషాఢమంటే ఆకాశంలో కనిపించే మబ్బులు. నేలమీద కురిసే తొలకరి చినుకులు వీచే మట్టి పరిమళాలు. 'తొలకరి వాన మొలకల తల్లి' అనే నానుడి ఉంది. ఆషాఢంతో ముడిపడిన అనేక సంప్రదాయాలు మన జనజీవనంలో ఉన్నాయి. ఆషాఢం నుంచి కార్తీకం మొదలయ్యే వరకు వానలు కురుస్తాయి. పూర్వం మనకు వానాకాలంతోనే ఏడాది మొదలయ్యేది. అందుకే, వానను వర్షం అని అంటారు. ఏడాదులను వర్షాలతో లెక్క కట్టడం కూడా మనకు వాడుకలో ఉన్న పద్ధతే! ప్రకృతిలోని జీవకళకు వానలే ఆధారం. వర్షసౌందర్యాన్ని వర్ణించని కవులు అరుదు. 'సదా మనోజ్ఞం స్వనదుత్సవోత్సుకమ్/ వికీర్ణ విస్తీర్ణ కలాప శోభితమ్/ ససంభ్రమాలింగన చుంబనాకులం/ ప్రవృత్త నృత్యం కులమద్య బర్హిణామ్' అని కాళిదాసు 'ఋతుసంహారం'లో వర్షర్తు సౌందర్యాన్ని వర్ణించాడు. మబ్బులు కమ్మి ఉరుములు మెరుపులతో వాన కురుస్తున్నప్పుడు నెమళ్లన్నీ పింఛాలు విప్పి జంటలు జంటలుగా ఒకదానినొకటి ముద్దాడుతూ నర్తిస్తున్నాయట! తొలకరి జల్లులు కురిసే వేళల్లో ఇలాంటి చూడచక్కని దృశ్యాలు కనిపిస్తాయి.

'ఎలగోలు జల్లు మున్ బెళబెళ నేటవా/ల్పడి గాలి నట్టిండ్ల దడిపి చనగ/... భూభిదాపాది దుర్వారాంభోభరంపు/... కడవ వంచి/నట్లు హోరని దారౌఘ మైక్యమొంది/ మిన్ను మన్ను నొకటిగా వృష్టి బలిసె' అంటూ హోరైన గాలితో చిటపట చినుకులుగా మొదలైన వర్షం వేగాన్ని పుంజుకుని మింటినీ మంటినీ ఏకం చేసేంత కుంభవృష్టిగా పరిణమించిన వైనాన్ని శ్రీకృష్ణ దేవరాయలు 'ఆముక్తమాల్యదలో' కళ్లకు కట్టాడు. ఇలాంటి దృశ్యాన్నే శేషేంద్ర తన 'ఋతుఘోష'లో 'విరిసెను మేఘపరంపర/ మెరసెను శాంపేయలతలు మిన్నులు మొరసెన్/ పరచెను ఝంఝానిలములు/ కురిసెను వర్షము కుంభగుంభిత రీతిన్' అని వర్ణించారు. సకాలంలో సజావుగా కురిస్తే, వర్షం హర్షదాయకమే! వర్షం ఒక్కొక్కప్పుడు బీభత్సం సృష్టిస్తుంది. శేషేంద్ర తన కావ్యంలో వర్షబీభత్సాన్ని కూడా వర్ణించారు. 'పసికందుల్ జడివానలో వడకగా పాకల్ ధరం గూలి తా/మసహాయస్థితి తల్లిదండ్రులును హాహాకారముల్ సేయగా... నిర్వేల హాలాహల శ్వసనంబుల్ ప్రసవించె దీనజనతా సంసారపూరంబులన్' అంటూ జడివానకు పూరిపాకలు కూలిపోయినప్పుడు నిరుపేదల నిస్సహాయతను కళ్లకు కట్టారు.

రుతువులలో వర్షర్తువంతటి అస్తవ్యస్తమైన రుతువు మరొకటి లేదు. వానాకాలానికి ఉండే సహజ లక్షణం అనిశ్చితి. 'వాన రాకడ ప్రాణం పోకడ ఎవరికీ తెలీదు' అని సామెత. వర్షాకాలంలో మోతాదుగా వానలు కురుస్తాయనే భరోసా ఎప్పుడూ లేదు. భూమ్మీద ఎక్కడో ఒకచోట అతివృష్టి లేదా అనావృష్టి దాదాపు సర్వసాధారణం. మనుషులు అతివృష్టినీ తట్టుకోలేరు, అనావృష్టినీ భరించలేరు. సకాలంలో వానలు కురవకుంటే వానల కోసం ఎదురు చూస్తారు. ఎదురుచూపులకు ఫలితం దక్కకుంటే కప్పలకు పెళ్లిళ్లు చేయడం, వరుణ హోమాలు చేయడం వంటి తతంగాలను యథాశక్తి సాగిస్తారు. ప్రార్థనల ఫలితంగానో, ప్రకృతి రుతుధర్మ ప్రకారమో జడివానలు మొదలైతే, చిత్తడితో నిండిన వీథుల్లోకి వెళ్లలేక వానలను తిట్టుకుంటారు. మనుషులు స్తుతించినా, నిందించినా వాటితో ఏమాత్రం నిమిత్తం లేకుండా వానలు వాటి మానాన అవి వచ్చిపోతుంటాయి. అతివృష్టి వరదబీభత్సం వంటి ఉపద్రవాలను తెచ్చిపెడితే, అనావృష్టి కరవు కాటకాలతో ఆకలిమంటలు రేపుతుంది. 'ఆకాశంబున మేఘమాలికల రూపైనం గనన్ రాదు, శు/ష్కాకారంబుల బైరులెల్ల సుదుమై యల్లాడె తీవ్రంబుగా/... మాకీ కష్టము వెట్టె దైవమని యేలా మాటికిం జింతిలన్?' అంటూ దువ్వూరి రామిరెడ్డి తన 'కృషీవలుడు' కావ్యంలో కళ్లకు కట్టారు. అనావృష్టి ప్రభావం రైతులకే ఎక్కువగా ఉంటుంది. చినుకు కరవై బీడువారిన నేలను చూస్తే రైతు గుండె చెరువవుతుంది.

ఆషాఢం అంటే తొలకరి చినుకులు మాత్రమే కాదు, అరచేతులను పండించే గోరింట కూడా! ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయం. పురాతన నాగరికతల కాలం నుంచి గోరింటాకు వాడుకలో ఉంది. అయినా మన కావ్య ప్రబంధాలలో కాళిదాసాది పూర్వకవులు గోరింటాకుపై ఎందుకో శీతకన్నేశారు. గోరింట ప్రస్తావన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలలోనే కనిపిస్తుంది గాని, కావ్యాలలో కనిపించదు. జానపద గీతాల్లో గోరింట ప్రస్తావన కనిపిస్తుంది. 'గోపాల కృష్ణమ్మ పెళ్లయ్యేనాడు/ గోరింట పూచింది కొమ్మ లేకుండా' అనే జానపద గీతం ఉంది. 'గోరింటాకు' సినిమా పాట పల్లవిని కృష్ణశాస్త్రి బహుశా దీనినుంచే సంగ్రహించి ఉంటారు.

ఆధునిక కవుల్లో కొద్దిమంది గోరింటపై దృష్టి సారించారు. సరోజినీ నాయుడు 'గోరింటాకు' కవిత రాశారు. 'వధువు నెన్నుదుటికి కుంకుమం ఎరుపు/ మధురాధరాలకు తాంబూల మెరుపు/ లిల్లీల తలపించు కాళ్లకూ వేళ్లకూ/ లేత గోరింటాకు ఎరుపే ఎరుపు' అంటూ గోరింటాకు ఎరుపును ఎంతో మురిపెంగా వర్ణించారు. ఆమె ఇంగ్లిష్‌లో రాసిన కవితను సినారె తెలుగులోకి అనువదించారు. 'బొప్పి గట్టినగాని యే పురుషుడైన/ తెలివినొందడు లోకంబు తెలియబోడు/ రాళ్లదెబ్బల గోరింట రంగొసంగు/ మనుజు డగచాటులనె గాని మారడెపుడు' అంటారు ఉమర్ అలీషా. అగచాట్లలో నలిగితే తప్ప మనిషి మారడని చెప్పడానికి రాళ్లదెబ్బలతో నలిగితేనే గోరింట రంగునిస్తుందని పోల్చడం విశేషం. ఆషాఢంలోని తొలకరి జల్లులతో మొదలయ్యే వానాకాలంలో సజావుగా వానలు కురిస్తే పంటపొలాల్లో నవధాన్యాలు పండుతాయి. ఆషాఢంలో అతివలు అలంకరించుకునే గోరింటాకుతో అరచేతులు పండుతాయి. ప్రకృతి కరుణిస్తే బతుకులు పండుతాయి. మన పంట పండాలంటే వానలు కురవాలి.

మొండి మౌనానికి మోక్షం ఎన్నడు?

కామెంట్



కరణ్ థాపర్

రెండు నెలలుగా మణిపూర్ అతలాకుతలం అవుతోంది. అయినప్పటికీ ప్రధాని ఒక్క మాటా మాట్లాడటం లేదు. ఆయన తాజా 'మన్ కీ బాత్'లో గుజరాత్‌లో తుపాను గురించి మాట్లాడారు కానీ, అంతకన్నా ప్రధానమైనదైన మణిపూర్ గాయాన్ని వదిలేశారు. టర్కీలో భయంకర భూకంపం సంభవించినప్పుడు మొదట సానుభూతి తెలిపిన వారిలో ఆయనా ఒకరు. మణిపూర్ విషయం వచ్చేటప్పటికి... తన సొంత ప్రజలు, ఇంకా చెప్పాలంటే తన ఓటర్లకు జరుగుతున్న దానిపై మొండిగా మౌనాన్ని ఆశ్రయించారు. మణిపూర్ సంక్షోభం గురించి తాను ప్రతి ఒక్క రోజూ ప్రధానికి వివరిస్తూనే ఉన్నానని హోమ్ మంత్రి చెబుతున్నారు. అందులో సందేహించడానికేం లేదు. కానీ మణిపూర్‌పై మాట్లాడేందుకు ప్రధాని ఉద్దేశపూర్వకంగా నిరాకరించడాన్ని అంగీకరించడమే మరింత కష్టతరంగా ఉంది.

నేను ఇంతకు ముందెన్నడూ ఆరంభించని విధంగా ఈ వ్యాసాన్ని మొదలు పెట్టబోతున్నాను. ఒక ఉద్దేశ ప్రకటనతో. కొలిచినట్లుగా, సమతూకంతో, వేరుగా ఉండి చూస్తూ నాకు వీలైనంతగా ఇందులో న్యాయంగా ఉండేందుకు ప్రయత్నిస్తాను. విషయం మణిపూర్ అయినప్పుడు ఇలా ఉండటం తప్పనిసరి. నేనిక్కడ మూడు ముఖ్యమైన అంశాలను ప్రస్తావించాలని అనుకుంటున్నప్పటికీ మానని గాయాల్ని రేపడం లేదా భావావేశాలను భగ్గుమనిపించడం మాత్రం నా ఆకాంక్ష కాదు.

మొదటిది, ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను ఎందుకు తొలగించలేదు? 65 రోజుల తర్వాత కూడా పరిస్థితిని అదుపు చేయలేకపోవడంలోని ఆయన అసమర్థత లేదా అశక్తత కచ్చితంగా రూఢి అయినదే. సొంత శాసనసభ్యులకు కూడా ఆయనపై నమ్మకం పోయింది. మే నెలలో, ప్రత్యేక పాలన కోసం డిమాండ్ చేసిన ఏడుగురు బీజేపీ కుకీ ఎమ్మెల్యేలు తమ ముఖ్యమంత్రిపై తమకు విశ్వాసం లేదని బహిరంగంగానే ప్రకటించారు. జూన్‌లో ఎనిమిది మంది బీజేపీ మెయితీ ఎమ్మెల్యేలు, "మణిపూర్ ప్రజలు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తిగా నమ్మకం కోల్పోయారు" అని పేర్కొంటూ ప్రధానమంత్రికి వినతి పత్రం సమర్పించారు. అంటే తమ 32 మంది ఎమ్మెల్యేలలో 15 మంది.

లెక్కల్ని పక్కన పెడితే, బీరేన్ సింగ్‌ను తొలగించాలనే డిమాండ్ వెనుక లోతైన నైతిక హేతువే ఉంది. మణిపూర్ జనాభాలో 16 శాతంగా ఉన్న కుకీలు... ప్రస్తుతం ఆ రాష్ట్రంలో జరుగుతున్న దానికి ఆయనే కారణం అని నిందిస్తున్నారు. మెయితీ దురహంకారిగా, కుకీల వ్యతిరేకిగా వారు ఆయన్ని పరిగణిస్తున్నారు. గతవారం బీరేన్ సింగ్ అధికార ట్విట్టర్ అకౌంట్ ఈ ఆరోపణకు ఒక ధ్రువీకరణగా నిలిచింది. తనను విమర్శిస్తున్నది కుకీలు, మయన్మార్‌కు చెందిన వారు మాత్రమే నన్న అర్థం వచ్చేలా బీరేన్ సింగ్ ఒక ట్విట్టర్ యూజర్‌కు బదులిచ్చినట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' రాసింది. "మీరసలు ఎప్పుడో రాజీనామా చేయవలసింది కదా?" అని ఆ యూజర్ చేసిన కామెంట్‌కు సమాధానంగా, "నీది భారతదేశమా? లేక మయన్మారా?' అని బీరేన్ సింగ్ ప్రశ్నించినట్లు ట్విట్టర్ స్క్రీన్ షాట్‌లు చూపిస్తున్నాయి. కుకీలను అన్నిటి కంటే ఎక్కువగా ద్వేషించే వ్యక్తి ముఖ్యమంత్రిగా కొనసాగితే సయోధ్యపై ఏ విధమైన ఆశ ఉంటుంది?



నేను లేవనెత్తాలని అనుకుంటున్న రెండవ అంశం, జూన్ నెలాఖరులో జరిగిన ఒక సంఘటన. దాదాపు 1,500 మంది మెయితీ మహిళలు, బహుశా 'మీరా పైబిస్' మహిళా ఉద్యమ కార్యకర్తలు... తూర్పు ఇంఫాల్‌లోని 3వ ఆర్మీ దళ శిబిరాన్ని చుట్టుముట్టి మెయితీ వేర్పాటువాద 'కంగ్లేయ్ యావోల్ కన్న లుప్' గ్రూపునకు చెందిన 12 మంది మెయితీ తీవ్రవాదులను విడిపించుకుని వెళ్లారు. 2015లో చందేల్‌లో పొంచివుండి జరిపిన మెరుపుదాడితో 18 మంది సైనికులను హతమార్చింది ఈ 'కంగ్లేయ్ యావోల్ కన్న లుప్' గ్రూపు సభ్యులే. ఆ పన్నెండు మందిలో తనను తాను లెఫ్టినెంట్ కల్నల్ మెయి రంగ్‌థెమ్ తంబా అని చెప్పుకునే వ్యక్తి ఆనాటి దాడికి వ్యూహం రచించాడు.

వీళ్లసలు ఎప్పటికీ విడుదల కావలసినవాళ్లు కాదు. కానీ విడుదలయ్యారు. ఇంకా ఘోరం ఏమిటంటే, విడిపించుకుని వెళ్లిన ఈ మహిళలందరికీ బీజేపీ మెయితీ ఎమ్మెల్యే తౌనోజం శ్యామ్‌కుమార్ సింగ్ మద్దతు ఉండటం. వారిని విడిపించుకుని వెళ్లేటప్పుడు తను అక్కడ ఉన్నానన్న విషయాన్ని ఆయన ఖండించడం లేదు కానీ, వాళ్లను విడుదల చేయాలని తను అడగలేదని మాత్రం గట్టిగా చెబుతున్నారు. అయితే భద్రతా అధికారులు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు చెప్పిన కథనం భిన్నంగా ఉంది. ఎమ్మెల్యేనే స్వయంగా మిలిటెంట్ల విడుదలకు బలగాలతో చర్చలు జరిపారని!

వైరుధ్యం ఏమిటంటే కుకీలను వెళ్లి కలుసుకోవాలనీ, ద్వైపాక్షికంగా ఉండాలనీ బీరేన్ సింగ్‌కు హోమ్ మంత్రి చెప్పారని 'ది హిందూ'లో వార్త వచ్చిన తర్వాతే ఈ 'విడిపించుకు పోవడం' జరగడం. ఇంఫాల్‌లోని బీజేపీ ఎమ్మెల్యేలు... హోమ్ మంత్రి చెప్పారంటున్న దానికి పూర్తి భిన్నంగా వ్యవహరించారు. ఇంకొక సంగతి. శ్యామ్ కుమార్ సింగ్ వార్తను మిగతా పత్రికలు ఎందుకు వేయలేదు? ఇంఫాల్‌లో గానీ, ఢిల్లీలో గానీ ఎవరూ ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు?

నా మూడో ఆందోళన... బాధను కలిగించేది మాత్రమే కాదు, భ్రాంతులను పోగొట్టేది కూడా! రెండు నెలలుగా మణిపూర్ అతలాకుతలం అవుతోంది. గృహ దహనాలు, మూకుమ్మడి హింస, ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకుని హత్యలు, ఇప్పుడిక భయానకమైన శిరచ్ఛేదనం! అయినప్పటికీ మన ప్రధాని ఒక్క మాటా మాట్లాడటం లేదు. ఆయన తాజా 'మన్ కీ బాత్'లో గుజరాత్‌లో తుపాను గురించి మాట్లాడారు కానీ, అంతకన్నా ప్రధానమైనదైన మణిపూర్ గాయాన్ని వదిలేశారు. టర్కీలో భయంకర భూకంపం సంభవించినప్పుడు మొదట సానుభూతి తెలిపిన వారిలో ఆయనా ఒకరు. మణిపూర్ విషయం వచ్చేటప్పటికి... తన సొంత ప్రజలు, ఇంకా చెప్పాలంటే తన ఓటర్లకు జరుగుతున్న దానిపై మొండిగా మౌనాన్ని ఆశ్రయించారు. ఈ విషయమై నేను ఇంటర్వ్యూ చేసిన ప్రతి మెయితీ, ప్రతి కుకీ, ప్రతి నాగా... నిరాశలో ఉన్నారు. మొదట వారు కలత చెందారు. తర్వాత ఆగ్రహించారు. ఆ తర్వాత తమకు నమ్మకద్రోహం జరిగినట్లుగా భావించారు. ఇప్పుడు తాము ఎవరికీ అక్కర్లేదని నమ్ముతున్నారు.

మణిపూర్ సంక్షోభం గురించి తాను ప్రతి ఒక్క రోజూ ప్రధానికి వివరిస్తూనే ఉన్నానని హోమ్ మంత్రి చెబుతున్నారు. అందులో సందేహించడానికేం లేదు. కానీ మణిపూర్‌పై మాట్లాడేందుకు మోదీ ఉద్దేశపూర్వకంగా నిరాకరించడాన్ని అంగీకరించడమే మరింత కష్టతరంగా ఉంది. విధులు, రాజ్యాంగ అవసరాలను మించి దేశంలోని ఆందోళనకర పరిస్థితులపైన మాట్లాడవలసిన నైతిక ఒత్తిడి ప్రభుత్వాధినేతపై ఉంటుంది. ఆయన మాట్లాడారూ అంటే మనందరి తరఫున మాట్లాడినట్లు. మన ప్రధానమంత్రిగా మాట్లాడినట్లు. కానీ ఆయనకు మాట్లాడేందుకు ఏమీ లేదంటే ఆయన మౌనం ఆయన ఒక్కరితోనే ఉంటుంది. ఆ మౌనం మనందరికి ప్రాతినిధ్యం వహించదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



ఓన్లీ ఇంజిన్



21వ సెర్చ్ ఇంజిన్‌గా గూగుల్ 1998లో మార్కెట్లోకి ప్రవేశించింది. ఇప్పుడు అదే ప్రబలమైన శక్తిగా మారిపోయింది. వ్యాపార పాఠం: పోటీలో ఉన్నవాళ్లను గురించి తెలుసుకోవడం ముఖ్యం. కానీ వారిని కాపీ కొట్టకూడదు. – వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

అవి పోవు



మనుషుల్లో దురాశ, అసూయలను తగ్గించగలిగే సాఫ్ట్‌వేర్ గానీ, యాప్ గానీ, కృత్రిమ మేధ(ఏఐ) గానీ ఏ ఒక్క 'మహా మేధావి' బిలియనీర్ (కోటాను కోటీశ్వరుడు) ఇంజినీర్ కూడా సృష్టించలేడు. అంటే, ఈ సాంకేతిక పరిజ్ఞానాలు ప్రపంచాన్ని 'కాపాడలేవు'. – దేవ్‌దత్ పట్నాయక్, మైథాలజిస్ట్

ఎంత టాలెంటో!



అలవోకగా కొంతమంది ట్విట్టర్ థ్రెడ్స్‌లో చాలా చక్కటి, యుక్తమైన, పదునైన కామెంట్లు చేస్తుంటారు. కానీ వాటికి లైక్స్ రావు. ఎవరూ పట్టించుకోరు. అయితే అంతర్దృష్టి, చమత్కారం, విశ్లేషణా శక్తి కలిగిన ప్రతిభావంతులు బయట విస్తారంగా ఉన్నారని మాత్రం నాకు అర్థమవుతోంది. ప్రోత్సాహకర విషయం. – వాల్టెర్ కిమ్, హోస్ట్

శ్రద్ధ



అంతర్జాతీయ సమావేశాల్లో అమెరికన్లు అత్యుత్తమ ప్రెజెంటర్లు. ఆంగ్లం వారి భాష కావడం కచ్చితంగా ఒక సానుకూలాంశమే. దానికంటే మించిన అంశాలూ ఉన్నాయనిపిస్తుంది. – ఇయాన్ జూ, ఫోనోలాజికల్ టైపాలజిస్ట్

వద్దంటే వద్దు



ఐదేళ్ల నుంచి ఒంటరి ప్రయాణాలు చేస్తున్నాను. నా అనుభవంలో ఒంటరి మహిళలు ప్రయాణం చేయకూడని దేశాలు మూడు. ఇక్కడ వీధుల్లో లైంగిక హింస అనేది సాధారణం అని అంగీకరించినట్టుగా ఉంటుంది. అవి: మొరాకో, ఈజిప్ట్, పాకిస్తాన్. – పర్వానే, పాక్ ట్రావెలర్

వీళ్లు రచయితలేనా?



పుస్తకాలకు సంబంధించిన ప్రపోజల్స్ సంపాదకులకు ఫోన్లో వివరించేవి కావని కొత్త రచయితలకు ఎలా అర్థం చేయించాలి? ఒక తగిన ప్రతిపాదన రాసి పంపడానికి ఇంత వైముఖ్యం ఎందుకు? – వైశాలీ మాథుర్, ప్రచురణకర్త

అదీ లెక్క!



పీహెచ్‌డీ కోసం దేశాన్ని వదులుతున్న రోజు, ఢిల్లీలోని ఇమ్మిగ్రేషన్ అధికారి నా కాగితాలను చూసి, "అమ్మాయిలు లెక్కలంటే భయపడరా?" అన్నారు. "ఆ భయాన్ని అధిగమించడానికి పీహెచ్‌డీ అత్యుత్తమ మార్గం" అన్నాను. ఆయన కళ్లు వెలిగాయి. శుభాకాంక్షలతో వీడ్కోలిచ్చారు. – కనీనికా సిన్హా, విద్యార్థిని

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

నాణ్యమైన ఉపాధ్యాయుడు

విలువలతో కూడిన విద్యను అందించడానికి అధ్యాపకునికి కొన్ని అర్హతలు ఉండాలి. అందుకు కొన్ని సూత్రాలను అలవరచుకోవలసి ఉంటుంది. అవి: ఔచిత్యం, సహజసిద్ధ హేతుకత, సంపూర్ణత, సమతౌల్యతా దోహదం. పై అంశాలను పరిశీలిస్తే జాతి, కుల, మత, వర్ణ, వర్గ, సంబంధాలకు అతీతంగా అందరు విద్యార్థులకూ ఒకే రకమైన విద్యను అందించగలిగే సౌహార్దంతో ఉపాధ్యాయుడు ఉండగలగాలి. అలా చెప్పగలగాలంటే ఉపాధ్యాయుడు ముందు అలా ఉండగలగాలి.

బోధన జరుగుతున్న సందర్భంలో సమాజంలోని మంచి చెడుల ప్రస్తావన వచ్చినపుడు తరగతి గదిలోనున్న విద్యార్థుల దృష్టి బోధిస్తున్న ఉపాధ్యాయునిపై కూడా పడుతుంది. ఉపాధ్యాయుని నడవడిక విద్యార్థులను ప్రభావితం చేస్తుంది. తరగతి గదిలో చెప్పేదొకటి, బయట చేసేదొకటిగా ఉపాధ్యాయుడు ఉండకూడదు. కచ్చితమైన మనఃచేతన కలిగి ఉండాలి. అప్పుడే బోధన సహజసిద్ధంగా, సహేతుకంగా ఉంటుంది. ఆలోచన, ప్రవర్తన, కార్యా చరణ, జ్ఞాన సముపార్జనలను దృష్టిలో పెట్టుకొని వర్తమాన మానవ జీవితంలో ఉండే సంక్లిష్టతలను విద్యార్థులకు ఉపాధ్యాయుడు తెలియజేయాలి. అందుకు అనుగుణంగా నేటి విద్యావిధానంలో చాలా ప్రయోజనకరమైన అంశాలున్నాయి. వాటిని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతూ కెరీర్‌లోకి వెళ్ళాలని బోధించాలి.

ప్రతి వ్యక్తిలోనూ అంతర్బాహ్య సౌందర్యాలు రెండుంటాయి. విద్యార్థులు కూడా దీనికి భిన్నం కాదు. వారు తమ వయసు రీత్యా దుడుకుతనంతో వాటిని త్వరగా బయటకు వ్యక్తీకరిస్తారు. అటువంటప్పుడు ప్రసక్తానుప్రసక్తంగా ఏది ఎక్కడ ఎలా ప్రదర్శించాలో విద్యార్థులకు సూచిస్తూ ఉపాధ్యాయుడు వారిలోని సమతౌల్యతకు దోహదపడాలి. తద్వారా విద్యార్థులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దవచ్చు.

నాణ్యమైన విద్యను అందించే క్రమంలో ఉపాధ్యాయుడు తనలోని నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలి. 'ఉపాధ్యాయునిలోని చైతన్యశీలత అతని నైపుణ్యాలకు దోహదం చేస్తుంది. తద్వారా సమాజం అతనిని ఉత్తమ గురువుగా గుర్తిస్తుంది' అంటారు మహాత్మాగాంధీ. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బోధన సాగాలి. అంతేకాకుండా విద్యలో విలువలు కూడా అవసరమే. 'సత్యమును పలుకుము, పెద్దలను గౌరవించుము' వంటివి ఏ కాలంలోనైనా ఉన్నతాంశాలే. వీటిని బోధించే ముందర ఒక క్రమశిక్షణాయుతమైన బాధ్యత ఉపాధ్యాయునికి ఉండాలి. సమయపాలన, పఠనం, నిరంతరం రాయటం వంటివి ఉపాధ్యాయునిలో నాణ్య మైన గుణాలు పెంపొందింపజేసే అంశాలే. ఇవి నిత్యకృత్యం కావాలి. ఉపాధ్యాయునిలో ఇటువంటి సుగుణా లన్నింటినీ విద్యార్థులు గమనిస్తూనే ఉంటారు. 'నా జీవితంలో నిపుణత, విలువలకు మార్గదర్శి నా గురువు. నా ఈ స్థానం ఆయనదే, తర్వాత నా తల్లిదండ్రులది' అన్న నెహ్రూ మాటలు ఎన్నదగినవి.

మరికొన్ని విషయాలు కాలానుగుణంగా అవసరమౌతాయి. కొత్త కొత్త ఆలోచనలు కల్పించే విధంగా బోధన చేస్తూ విద్యార్థులలోని సృజనను వెలికితీయవచ్చు. విద్యార్థులు వివిధ సదస్సులలో పాల్గొనడం, అతిథి ఉపన్యాసాలు వినటం, వివిధ పోటీలలో పాల్గొనటం వంటివి కొత్త భావనాశక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయి. ఏది ఏమైనా ఉపాధ్యాయుడు ఎప్పుడూ క్రియాశీలకంగా ఉండాలి. తన వృత్తి పట్ల, వ్యవస్థ పట్ల, వ్యక్తిత్వం పట్ల విలువలతో కూడి ఉండాలి. సమయపాలన, బోధనా పద్ధతులు, సమస్యా పరిష్కారం, సంబంధాల విషయంలో జాగురూకతతో ఉండగలిగినప్పుడు నిబద్ధత కలిగిన ఉపాధ్యాయునిగా రాణించగలుగుతాడు.

– భమిడిపాటి గౌరీశంకర్,
తెలుగు ఉపన్యాసకులు । 94928 58395

తల్లీ పిల్లల స్థితి మెరుగుపడితేనే భవిష్యత్తు!

అభిప్రాయం



డాక్టర్ కత్తి పద్మారావు

భారతదేశం ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విద్యా సంక్షోభాల్లో ఉంది. దీనికి కారణం రాజ్యాంగ సూత్రాలను అమలు జరపకపోవటమే. సామాజిక పరిణామానికి విద్యే ప్రధానమైన వాహిక అని డా॥ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. కాని ఈనాడు దేశ వ్యాప్తంగా చిన్న పిల్లలు బడికి వెళ్ళడానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక నేపథ్యం తగ్గుతూ వస్తోంది. కారణం వ్యవసాయ కూలీలుగా ఉన్న దళితులు, బహుజనులు వలస వెళ్ళటం వల్ల పిల్లలకు ఇళ్ళలో ఆలనాపాలనా తగ్గింది. స్థిరమైన జీవితానికి ఇంక మనకు పాదులు పడలేదు. ఆ దిశలో ప్రభుత్వాలు కృషి చేయవలసి ఉంది.

విద్య సామాజిక పరిణామాలకు మూలం. నూతన సమాజాన్ని సృష్టిస్తుంది. వ్యక్తిత్వ నైపుణ్యాన్ని తీర్చిదిద్దుతుంది. ఒక్క భారతదేశంలో తప్ప పెక్కు దేశాల్లో ఇప్పుడు నిరక్షరాస్యులు లేరు. అక్షరం అనేది ఆహారంతో, ఆహార్యంతో, నివాసంతో సమానంగా అభ్యసించబడుతుంది. అందుకనే భర్తృహరి విద్యాధనాన్ని దొంగలు దోచుకోలేరనీ, ఆ ధనం మనల్ని ఉన్నతుల్ని చేస్తుందనీ, ఆ ధనం ఎంత ఇచ్చినా తరగనిదనీ అన్నారు. విద్య విద్యార్థులకు సరిగా రావాలంటే టీచర్స్‌కు మాతృ హృదయం ఉండాలి.

అనేక రాష్ట్రాలలో విద్యాభ్యసనానికి సంబంధించి ఇళ్ళలో సరియైన వసతులు లేవు. హైస్కూల్‌లో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఎక్కువ మంది ఇంటర్మీడియట్‌లో చేరలేకపోతున్నారు. అందువల్ల ఆడపిల్లలకు బాల్య వివాహాలు జరుగుతున్నాయి. దీనికి కారణం వారి ఆర్థిక సామాజిక పరిస్థితులే. ఇకపోతే మధ్యాహ్న భోజనం ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో తప్ప మిగిలిన రాష్ట్రాలలో మెరుగుపడలేదు. నిజానికి మధ్యాహ్న భోజనం విద్యార్థులకు చాలా విలువైనది. ఈ భోజనం నాణ్యత పెంచడం వల్ల పిల్లల్లో మేధా శక్తి పెరుగుతుంది. నిజానికి ఇంటి దగ్గర తల్లిదండ్రులు 60 శాతం మంది పిల్లలకు సరైన ఆహారం పెట్టలేకపోతున్నారు. భారతదేశ వ్యాప్తంగా అసలు గర్భస్థ శిశువుకే సరైన పోషణ లేదు. దళిత బహుజన స్త్రీలలో రక్తహీనత ఎక్కువగా ఉంది. ప్రస్తుత లెక్కల ప్రకారం ప్రతి దినం 800 మంది మహిళలు పిల్లలను కనేటప్పుడు దేశ వ్యాప్తంగా చనిపోతున్నారు. మొత్తం భారతదేశంలో ఉన్న స్త్రీలకు ఒక గ్లాసుడు పాలు ఇవ్వలేని అభాగ్యతలో ఉన్నాం. భారతదేశానికి తల్లి పునాది. ఆ తల్లి నిర్భాగ్యతలో, నిరక్షరాస్యతలో ఉండడం దేశ దారిద్ర్యానికి నిలువుటద్దం. ఇప్పటికీ బహుజన కుటుంబాల్లోని తల్లిదండ్రులు అత్యధికులు నిరక్షరాస్యులుగానే ఉన్నారు. మరి వారి పిల్లలు ఎలా చదువుతారు? మరోపక్క ఈనాడు తల్లి శారీరకంగా బలహీనంగా వుంది. ఆమెకు పిండిపదార్థాలు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు వంటివి తక్కువగా అందుతున్నాయి. దీనికి కారణం సరైన ఉపాధి, సంపాదన, అన్నీ తినే తాహతు లేకపోవడం. అందుకే ఈ దిశలోనూ తల్లుల



బాగోగులను ప్రభుత్వాలు పట్టించుకోవాలి. విద్య పురుషులకంటే స్త్రీలకు బాగా వస్తుందని అంబేడ్కర్ అన్నారు. అందుకే భారతీయ సమాజాన్ని అంబేడ్కర్ ఆలోచనలతో మనం పునర్నిర్మించుకోవాలి. తల్లీ బిడ్డ విద్యలను సుసంపన్నం చేసినప్పుడే భారత దేశానికి పునరుజ్జీవనం వస్తుంది.

పిల్లలు, తల్లులూ... టీవీలు, సెల్ ఫోన్‌లు, సీరియల్స్‌కు అలవాటు పడటం కూడా ప్రాథమిక, ఉన్నత విద్యకు చాలా అవరోధంగా ఉంది. నిరక్షరాస్యతలో ఉన్న ఒక తల్లికి తన బిడ్డల్ని అత్యున్నత విద్యావంతులుగా చేసే మానసిక, సామాజిక శక్తి తక్కువ అవుతుంది. ఇక ఇటీవల విద్యార్థులకు క్లాసుల్లో పాఠం వినడం మీద శ్రద్ధ తగ్గింది. అపహాస్యానికీ, హాస్యానికీ, అల్లరికీ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనీ, టీచర్లను గౌరవించటం తగ్గిందనీ, పిల్లలకు పాఠం చెప్పటం ఒక సవాలుగా మారిందనీ ఉపాధ్యాయులు అంటున్నారు. అయితే ఈ అవలక్షణాలకు పిల్లలు అలవాటు కావడానికి సినిమాలు, సెల్‌ఫోన్‌లు, బార్లు, నెట్ సెంటర్లు, పబ్బులు, క్లబ్బులు, రిసార్ట్‌లు కారణం అని మానసిక నిపుణులు అంటున్నారు.

విద్య మానవ సామాజిక వ్యవస్థలను సుసంపన్నం చేస్తుంది. విద్య ద్వారా శాస్త్రజ్ఞులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పరిపాలనా దక్షులు, రాజనీతిజ్ఞులు, సామాజిక శాస్త్ర దార్శనికులు రూపొందుతారు. వారు ప్రపంచ మానవులుగా అభివృద్ధి చెందుతారు. మానవ సమాజ అభివృద్ధికి వారు దోహదకారులు అవుతారు. ఆ విద్య గుండెల మీద దెబ్బతగిలితే మెదడుకు రక్తప్రసరణ ఆగిపోతుంది. ఆర్థిక దోపిడీ, అవినీతి పెరిగిపోతాయి. విద్య తగ్గితే దేశానికి నైతిక శక్తి తగ్గుతుంది. విశ్వవిద్యాలయ స్థాయిలో ఆయా సబ్జెక్టులకు తగిన ఉపాధ్యాయ, ఆచార్య నియామకాలు లేక పోవడం వల్ల విద్య నాణ్యత తగ్గుతోంది.

మరో పక్క కార్పొరేట్ విద్యా సంస్థలు విస్తరిస్తూ విద్యను వ్యాపారమయం చేసి జ్ఞానశూన్యమైన బట్టీ విద్యను అభ్యసింపజేసి, ధారణ చేయించి విద్యా వాణిజ్యాన్ని కొనసాగిస్తున్నాయి. చివరికి వాళ్ళు ప్రశ్న పత్రాలు ప్రింటయ్యే ముద్రణాలయాల వారితో కూడా సంబంధాలు పెట్టుకొని ర్యాంకులు సంపాదించే స్థితికి చేరారు. దొంగ సర్టిఫికేట్లతో వైద్యులూ, ఇంజినీర్లూ అయినవాళ్ళు దేశానికి ఇప్పటికే ఎంతో నష్టాన్ని తెచ్చారు. నిజానికి విద్యా పునాదులు కదులుతున్న చప్పుడు భారతదేశంలో బలంగా వినిపిస్తోంది. సామాజిక రుగ్మతల విజృంభణ పెరిగింది. సాంస్కృతిక విధ్వంస భేరి మోగుతోంది. అక్షర దాతలు తగ్గి, దేవతార్పణల దాతలు పెరిగారు. పిల్లలకు నోటు పుస్తకాలు ఇచ్చే దాతలు తగ్గారు. విద్య అనేది దాతల దానం మీద కూడా ఆధారపడి ఉంటుంది. విద్యకు విద్యార్థులకు, విద్యార్థుల పౌష్టిక ఆహారానికి ఖర్చు పెట్టాలనే భావన పాలకులలోనే కాకుండా ప్రజలలో కూడా రావాలి. అప్పుడే మన సామాజిక, సాంస్కృతిక వాతావరణం వెల్లివిరుస్తుంది.

వ్యాసకర్త దళిత బహుజన ఉద్యమ నేత
మొబైల్: 98497 41695

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.అష్టమి రా. 9.33 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** రేవతి రా. 12.12 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ప. 12.43 నుండి 2.15 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.52 నుండి 11.15 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.35.

క్లుప్తంగా...

శ్రీవారి సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం అర్ధరాత్రి వరకు 86,781 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.47 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనమవుతోంది.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం వెలుపల జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి మేరుగు నాగార్జున, తెలంగాణ మంత్రి సత్యవతి రాథోడ్ ఉన్నారు.

కులవాదమే చంద్రబాబు అజెండా

- బహుజన పరిరక్షణ సమితి

తాడికొండ: పేదలను అణగదొక్కడమే అజెండాగా రాష్ట్రంలో బాబు అండ్ కో ఆగడాలు సాగిస్తోందని బహుజన పరిరక్షణ సమితి మండిపడింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,015వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు ఆదివారం పలువురు మద్దతు తెలిపారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదవాడికి 35 లక్షల ఇళ్ల స్థలాలు, అందులో పక్కా ఇళ్లు నిర్మిస్తూ సీఎం వైఎస్ జగన్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సమితి నేతలు ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

కంటైనర్ల హ్యాండ్లింగ్‌లో ‘వీపీఏ’ మరో రికార్డు

సాక్షి, విశాఖపట్నం: వరుస రికార్డులతో దూసుకుపోతోన్న విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) మరో అత్యుత్తమ ప్రదర్శనను తన ఖాతాలో జమ చేసుకుంది. కంటైనర్ల హ్యాండ్లింగ్‌లో తన రికార్డుని తానే తిరగరాసింది. ఒక షిప్ ద్వారా ఒక్క రోజులో అత్యధిక కంటైనర్లని హ్యాండ్లింగ్ చేసింది. 8న ఉదయం నుంచి 9న ఉదయం వరకూ 4,035 టీఈయూ (20–ఫూట్ ఈక్వివాలెంట్ యూనిట్) కంటైనర్లని ఒకే నౌక నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేసింది. ఎంవీ ఎంఎస్‌సీ గైడా–111 అనే కార్గో షిప్‌ని కంటైనర్ టర్మినల్‌లో హ్యాండ్లింగ్ చేశారు. 2021 డిసెంబర్‌లో ఎంఎస్‌సీ అల్దీ–111 అనే నౌక నుంచి 3,921 టీఈయూ కంటైనర్లని హ్యాండ్లింగ్ చేసిన రికార్డుని అధిగమించింది. ఈ ఘనత సాధించిన టర్మినల్ ఆపరేటర్, సిబ్బందిని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు అభినందించారు. 2017 అక్టోబర్ 29న ఎంవీ మోరియా అనే కార్గో షిప్ నుంచి 27,050 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ని ఒకే రోజులో దిగుమతి చేసుకుంది. ఈ రికార్డుని సైతం పోర్టు అధిగమించింది. వేదాంత బెర్త్ వద్ద ఎంవీ ట్రాన్స్‌వరల్డ్ నేవిగేటర్ కార్గో షిప్ నుంచి 28,287 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ని పోర్టులో దిగుమతిని ఒక్క రోజులో నిర్వహించిన సిబ్బందిని చైర్మన్ అభినందించారు.

పాండిచ్చేరిలో వృద్ధునికి పునర్జన్మ



పాండిచ్చేరి జిప్‌మెర్ హాస్పిటల్‌లో అనిరుధ్ దాస్‌ను పరామర్శిస్తున్న డాక్టర్ యనమదల

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పాండిచ్చేరిలో గుండెపోటుతో కుప్పకూలిన పర్యాటకుడికి వెంటనే సీపీఆర్ చేసి పునర్జన్మనిచ్చారు కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యుడు యనమదల మురళీకృష్ణ. వివరాల్లోకి వెళితే... మురళీకృష్ణ కుటుంబ సమేతంగా పాండిచ్చేరి సందర్శనకు వెళ్లారు. ఆరోవిల్‌లో పర్యాటక ప్రాంతంలో సెంట్రల్ కోల్‌కతా భవానీపూర్‌కు చెందిన 70 ఏళ్ల విశ్రాంత ఉద్యోగి అనిరుధ్‌దాస్ ఆదివారం హఠాత్తుగా కుప్పకూలిపోయారు. గమనించిన మురళీకృష్ణ అనిరుధ్‌దాస్‌ను పరీక్షించి, అప్పటికే ఆయన గుండె ఆగిపోయినట్టు (కార్డియాక్ అరెస్ట్) గుర్తించారు. వెంటనే కార్డియో పల్మనరీ రిసిసిటేషన్ (సీపీఆర్) చేశారు. దీంతో దాస్ గుండె తిరిగి కొట్టుకోవడంతో ఆయన స్పృహలోకి వచ్చారు. వెంటనే ఆయనను పాండిచ్చేరిలోని జిప్‌మెర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. అనిరుధ్‌దాస్ కుటుంబ సభ్యులు మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. మురళీకృష్ణ వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల వైద్య విభాగం సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు.

‘ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించిన ఘనత సీఎం జగన్‌దే’

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యకు పరిష్కారం చూపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపాల్ ప్రశంసించారు. గుంటూరు పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందిస్తున్న తీరును కొనియాడారు.

‘భూ మండలంలో యాడా పెరగని చెట్టు మన శేషాచలం అడవుల్లో పెరుగుతుందాది. ఈడ నుంచి వేల కోట్ల సరుకు విదేశాలకు ఎళ్తుండాది. గోల్డ్ రా ఇది. భూమిపై పెరిగే బంగారం పేరు ఎర్ర చందనం’ పుష్ప సినిమాలోని ఈ డైలాగ్ ప్రపంచమంతా ట్రెండింగ్ అయ్యింది. నిజంగా ఎర్ర చందనానికి ఉండే క్రేజ్ అలాంటిది మరి. చైనాలో అయితే.. ఎర్ర చందనంతో చేసిన కుర్చీ రూ.2 కోట్ల ధర పలుకుతోందట. ఈ మధ్య చైనా వెళ్లిన ఏపీ అటవీ శాఖ అధికారులకు అక్కడ ఎర్ర చందనం ధరలు తెలిసి మతిపోయినంత పనైందట.



గోల్డ్ రా ఇది.. భూమిపై పెరిగే బంగారం!

టేబుల్ రేటు రూ.7 కోట్లు.. కుర్చీ రూ.2 కోట్లు

- ఎర్ర చందనానికి చైనాలో యమా క్రేజ్
- టన్ను ఎర్ర చందనం ధర రూ.75 లక్షల పైమాటే
- అటవీ శాఖ ఆధీనంలో సీజ్ చేసిన 5 వేల టన్నుల కలప
- వేలం వేసి మంచి రేటు రాబట్టేందుకు ప్రయత్నాలు



ఎర్ర చందనానికి చైనాలో ఉన్న మోజు అంతా ఇంతా కాదు. తమ ఇళ్లలో ఆ కలపతో చేసిన ఫర్నిచర్, గృహాలంకరణ వస్తువులు ఉండటం చాలా గొప్పగా భావిస్తారు. అందుకే ధర ఎంతైనా ఎర్ర చందనంతో తయారు చేసిన వస్తువుల్ని కొనుగోలు చేస్తారు. బీజింగ్‌లోని ఓ ఫర్నిచర్ షాపులో ఎర్ర చందనంతో చేసిన డైనింగ్ టేబుల్ ధర రూ.7 కోట్లు. ఒక సోఫా సెట్ రేటు రూ.5 కోట్లు. కుర్చీ ధర రూ.2 కోట్లు. ఎర్ర చందనం మార్కెట్‌పై అధ్యయనం చేసేందుకు ఇటీవల చైనా వెళ్లిన మన రాష్ట్ర అటవీ శాఖాధికారులు అక్కడి రేట్లు చూసి నివ్వెరపోయారు. మన రాష్ట్రంలో ఎర్ర చందనం అక్రమ రవాణా ఎందుకు జరుగుతుందో, దాని కోసం స్మగ్లర్లు ప్రాణాలకు తెగించి మరీ ఎందుకు రిస్కు తీసుకుంటారో చైనాలోని ఫర్నిచర్ షాపుల్లోని వస్తువుల ధర చూసి అధికారులకు అవగతమైంది.

– సాక్షి, అమరావతి

గ్రేడ్‌లను బట్టి రేటు

అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్ర చెక్క సి గ్రేడ్ అయితే టన్ను రూ.30 లక్షలు ఉంటుంది. మధ్యస్థంగా ఉంటే రూ.45 లక్షలు పలుకుతుంది. నాణ్యమైన ఏ గ్రేడ్ చెక్క అయితే రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతుంది. చైనా వ్యాపారులు, అంతర్జాతీయ స్మగ్లర్లు ఈ ధరకు ఎర్ర చందనాన్ని కొనుగోలు చేస్తారు. జపాన్, మయన్మార్ వంటి తూర్పు ఆసియా దేశాల్లో దీనికి డిమాండ్ ఉంది. అందుకే ప్రాణాలకు తెగించి శేషాచలం అడవుల్లో స్మగ్లర్లు ఆ చెట్లు నరకడానికి ప్రయత్నాలు చేస్తారు. గత కొన్నేళ్లుగా అక్రమ రవాణాను అడ్డుకుని సీజ్ చేసిన 8 వేల టన్నుల ఎర్ర చందనం దుంగల్ని గతంలో అటవీ శాఖ వేలం వేసింది. ఇంకా 5,400 టన్నుల కలప ఉండగా రెండు నెలల క్రితం వేలం వేసి 320 టన్నుల్ని వేలం ద్వారా విక్రయించగా రూ.170 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇంకా 5,100 టన్నుల కలపను త్వరలో వేలం వేయనున్నారు.



త్వరలో గ్లోబల్ టెండర్లు పిలుస్తాం

చైనాలో ఎర్ర చందనం వస్తువులకు మహా మోజు ఉంది. అక్కడి మార్కెట్ గురించి అధ్యయనం చేశాం. అందుకు అనుగుణంగా అటవీ శాఖ వద్ద ఉన్న కలపను వేలం వేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. తొలిసారి వేలంలో మంచి రేటు వచ్చింది. వచ్చే నెలలో మిగిలిన 5 వేల టన్నులకుపైగా దుంగల్ని వేలం వేసేందుకు మరోసారి గ్లోబల్ టెండర్లు పిలుస్తాం. ఎంఎస్‌టీసీ ద్వారా ఇంటర్నేషనల్ కాంపిటీటివ్ బిడ్డింగ్ నిర్వహిస్తాం. మంచి రేటు వచ్చే అవకాశం ఉంది.

– మధుసూదన్‌రెడ్డి, అటవీ దళాల అధిపతి, పీసీసీఎఫ్

బీజింగ్ మ్యూజియంలో రూ.లక్షల కోట్ల సంపద

1999లో తొలిసారి బీజింగ్‌లోని చైనా రెడ్ శాండల్‌వుడ్ మ్యూజియాన్ని ప్రజల సందర్శనం కోసం తెరిచారు. అందులో కళ్లు తిప్పుకోనివ్వని అద్భుతమైన కళాకృతులు దర్శనమిచ్చాయి. అన్నీ ఎర్ర చందనంతో చేసినవే. హన్, మింగ్, క్వింగ్ వంశాలకు చెందిన రాజ ప్రసాదాల నుంచి సేకరించిన రూ.లక్షల కోట్ల సంపద అది. చైనా రాజులు, చక్రవర్తులకు ఎర్ర చందనంతో చేసిన కళాకృతులు, ఫర్నిచర్ అంటే ఎంతో మక్కువ. రూయీ కళాకృతిలో చేసిన వాటిని తమ వద్ద ఉంచుకుంటే అదృష్టం తెచ్చిపెడుతుందని భావిస్తారు. కూర్చునే సింహాసనం, పడుకునే మంచం ఏదైనా ఎర్ర చందనంతో తయారైనదే కావాలనుకునేవారు. తమ దేశంలో పెరిగే ఎర్ర చందనం చెట్లన్నీ అంతరించిపోవడంతో అవి దొరికే మన దేశంలోని శేషాచలం అడవులపై వారి దృష్టి పడింది. కొన్ని వేల సంవత్సరాల నుంచే ఎంత ఖర్చుకైనా, కష్ట నష్టాలకైనా వెనుకాడకుండా ఆ కలపను సేకరించేవారు. అప్పటి నుంచి మన ఎర్ర చందనం చైనా చేరుకుని అక్కడి కోటల్లో అందంగా కొలువు తీరింది. దృఢంగా, మృదువుగా ఉండే ఈ కలప కళారూపాలు చెక్కడానికి, ఫర్నిచర్ చేయడానికి అనువుగా ఉంటుంది. రాజులు తమ కోటల్లో పెట్టుకోవడానికి ఈ చెక్కను అనుమతించేవారు. ప్రజలు దీన్ని వినియోగించడంపై నిషేధం విధించారు. రాజుల కాలం పోయిన తర్వాత ఆంక్షలు తొలగి బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం మొదలు పెట్టారు. అప్పటి నుంచి రాజుల మోజు అక్కడి ప్రజలకు వచ్చింది. అందుకే ఎంత ధర వెచ్చించైనా ఎర్ర చందనంతో తయారు చేసిన ఫర్నిచర్, గృహాలంకరణ వస్తువులను కొనుగోలు చేయడానికి అలవాటు పడ్డారు.



ఎంత ఎర్రగా ఉంటే అంత నాణ్యం



ఈ డిమాండ్‌కు అనుగుణంగా ఆ చెట్లను ఇష్టానుసారం నరికి అక్రమంగా రవాణా చేస్తుండటంతో ఎర్ర చందనం వృక్షాలు అంతరిస్తున్న జాబితాలోకి చేరాయి. అందుకే మన ప్రభుత్వం అడవుల్లో చెట్లను నరకడం చట్ట విరుద్ధంగా పేర్కొంది. అయినా అది సరిహద్దులు దాటిపోతూనే ఉంది. శేషాచలం అడవుల్లో సుమారు 5 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో ఎర్ర చందనం చెట్లు ఉన్నాయని అంచనా. అవి ఎక్కడపడితే అక్కడ పెరగవు. వాటికి అంతా అనుకూలంగా ఉన్నచోట తొలి మూడేళ్లు వేగంగా పెరుగుతాయి. ఆ తర్వాత నెమ్మదిగా పెరుగుతుంటాయి. కనీసం 30 సంవత్సరాలకు గానీ మధ్యలోని చెక్క రంగు ఎరుపు రంగులోకి మారదు. అదే వంద నుంచి రెండు వందల సంవత్సరాలపాటు పెరిగితే లోపలి భాగం మరింత ఎర్రగా, వెడల్పుగా ఉంటుంది. కాబట్టి చెట్టుకు ఎన్నేళ్లుంటే అది అంత ఖరీదు. శేషాచలం అడవుల నేలలో ఆమ్ల శాతం, పోషకాలు, నీరు ఈ చెట్లు పెరగడానికి సరిపోతాయి. ఆ నేలలో ఉండే క్వార్ట్జ్ రాయి కూడా ఈ చెట్లు పెరగడానికి దోహదపడుతుంది. ఇక్కడ నేలలో ఉన్న సమ్మేళనం మరెక్కడా ఉండదని, నేలతోపాటు వాతావరణం అవి పెరగడానికి దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు.

అమర్‌నాథ్ వరదల్లో చిక్కుకున్న ఏపీ వాసులు

- సైనిక కేంద్రాల్లో విడిది



సైనిక స్థావరంలో తలదాచుకున్న హిందూపురం, సోమందేపల్లి వాసులు

హిందూపురం అర్బన్: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లిన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం, సోమందేపల్లి వాసులు 40 మంది వరకు వరదల్లో చిక్కుకున్నారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌లో వరదలు ముంచెత్తుతుండటంతో శ్రీనగర్–పఠాన్‌చౌక్ మధ్య బ్రిడ్జి కూలిపోయింది. దీంతో శుక్రవారం రాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయని, తాము సైనిక స్థావరాల్లో తలదాచుకుంటున్నామని తమ బంధువులకు ఫోన్ ద్వారా తెలిపారు. ఆహారం, నీరు అరకొరగా అందుతున్నాయని, ఆదివారం సాయంత్రానికి మరో మార్గం ద్వారా పంపే ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపినప్పటికీ వర్షం కారణంగా ఆలస్యం అవుతున్నట్లు హిందూపురం నుంచి వెళ్లిన విశ్రాంత ఉద్యోగులు ఆదెప్ప, రామచంద్ర, సరస్వతమ్మ తెలిపారు. తాను అక్కడ క్షేమంగా ఉన్నట్టు ముద్దిరెడ్డిపల్లికి చెందిన నారాయణస్వామి తన కుమారుడు నరేష్‌కు సమాచారం ఇచ్చారు. హిందూపురం పట్టణంలోని టీచర్స్ కాలనీ, ముద్దిరెడ్డిపల్లి, నానెప్ప నగర్, సోమందేపల్లికి చెందిన వారు అనంతపురానికి చెందిన వెంకటకృష్ణా ట్రావెల్స్ ద్వారా అమర్‌నాథ్ యాత్రకు వెళ్లారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ తమకు సౌకర్యాలు కల్పించిందని, రెండు రోజుల్లో అక్కడి నుంచి బయలుదేరనున్నట్లు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

వీఆర్‌వోల అసోసియేషన్ అధ్యక్షునిగా రవీంద్రరాజు



సాక్షి, అమరావతి: ఏపీ వీఆర్‌వోల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా భూపతిరాజు రవీంద్రరాజు రెండవసారి ఎన్నికయ్యారు. విజయవాడలోని ఫిల్మ్ చాంబర్‌లో ఆదివారం అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శితోపాటు 33 మంది ఆఫీస్ బేరర్స్, 52 మంది కార్యవర్గ సభ్యులను ఇందులో ఎన్నుకున్నారు. ఏపీ సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు చిరంజీవిరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. రవీంద్రరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుపుకుంటున్న సంఘం తమదేనని చెప్పారు. తమ ద్వారానే వీఆర్‌వోల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు.

దళిత కార్పొరేటర్‌పై టీడీపీ నేతల కుల దూషణ

- టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సమక్షంలోనే ఆ పార్టీ శ్రేణుల బరితెగింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ అంబేడ్కర్
- విజయవాడలో దళితుల నిరసన

గుణదల (విజయవాడ తూర్పు): టీడీపీ నేతలు మరోమారు బరి తెగించారు. విజయవాడలో నడిరోడ్డుపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అంబేడ్కర్‌ను కులం పేరుతో దూషించడమే కాకుండా ఆయనపై దాడికి యత్నించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలో క్రీస్తురాజపురం మెయిన్ రోడ్డు వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నారు. అదే సమయంలో చైతన్య రథయాత్ర చేస్తూ టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తోపాటు ఆ పార్టీ నేతలు ఆ మార్గంలోకి వచ్చారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు రాగానే కొంతమంది టీడీపీ నేతలు అసభ్య వ్యాఖ్యలు చేశారు. వీటికి స్పందించి బయటకు వచ్చిన కార్పొరేటర్ అంబేడ్కర్‌ను చులకన చేస్తూ మాట్లాడారు. అక్కడి పరిస్థితిని తమ నియోజకవర్గం ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌కు ఫోన్‌లో తెలియజేస్తుండగా టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అనుచరులు నర్రా సుబ్బారావు, గద్దె రమేష్, సుబ్రహ్మణ్యం, గోగుల రమేష్ కులం పేరుతో అంబేడ్కర్‌ను దూషించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ దాడికి యత్నించారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. జరిగిన ఘటనపై కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నడిరోడ్డుపై తనను కించపరిచి.. దాడి చేసేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌ను కులం పేరుతో దూషించడంపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుణదల బెత్లెహేం నగర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి గద్దె రామ్మోహన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చిత్రం లోకేష్, సొంగా రాజ్‌కమల్, పచ్చిగోళ్ల రమేష్, మట్టా ప్రసాద్, ఒగ్గు విశాల్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగిన దళిత నాయకులు

వివాహేతర సంబంధం కారణంగా మహిళపై యాసిడ్ దాడి

- ముగ్గురికి గాయాలు
- ప్రాణాపాయం లేదన్న వైద్యులు
- గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్ట్

సాక్షి ప్రతినిధి, విజయవాడ/భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామంలో వితంతు మహిళపై ఓ ఆటోడ్రైవర్ యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాలుడు, యువతి సహా ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకోగా.. కొద్దిగంటల్లోనే నిందితుణ్ని అరెస్ట్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా తెలిపిన వివరాల ప్రకారం.. ఐతవరం గ్రామానికి చెందిన 28 ఏళ్ల మహిళకు 8 ఏళ్ల క్రితం వివాహం కాగా.. ఆమెకు ఓ కుమారుడున్నాడు. భర్త మరణించడంతో ఆ మహిళ ఐతవరం వచ్చేసి తల్లిదండ్రుల వద్ద ఆశ్రయం పొందుతోంది. సుమారు 8 నెలల క్రితం నెల్లూరుకు చెందిన రాణింగారం మణిసింగ్ (32)తో ఆ మహిళకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. నెల్లూరులోనే ఆటో నడుపుతూ జీవనం సాగించే మణిసింగ్‌కు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీయడంతో ఆ మహిళ ఐతవరంలోనే వేరే ఇంటికి మారింది. ఆమె వద్దకు మణిసింగ్ తరుచూ వస్తుండేవాడు. ఇద్దరు పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకోగా.. మణిసింగ్‌కు క్షయ వ్యాధి సోకినట్టు తెలుసుకున్న సదరు మహిళ అతన్ని దూరం పెట్టింది. ఈ నేపథ్యంలో కక్ష పెంచుకున్న మణిసింగ్ ఆమెను హతమార్చాలని నిశ్చయించుకున్నాడు.



యాసిడ్ దాడిలో గాయపడ్డ మహిళ, చిన్నారి

నెల్లూరు నుంచే యాసిడ్ తెచ్చుకుని..

ఈ నెల 8వ తేదీ శనివారం నెల్లూరులో 100 మిల్లీలీటర్ల యాసిడ్ బాటిల్ కొనుగోలు చేసిన మణిసింగ్ మహిళ ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఆ ఇంట్లో ఆమె కుమారుడితో పాటు ఆమె సోదరి కుమార్తె ఉన్నారు. వారితో కలిసి మణిసింగ్ భోజనం చేసి అక్కడే నిద్రించాడు. ఆదివారం వేకువజామున 4 గంటలకు అందరూ నిద్రమత్తులో ఉండగా మణిసింగ్ తన వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను మహిళ ముఖంపై పోసి పరారయ్యాడు. ఈ ఘటనతో మహిళ శరీరం 20 శాతం గాయపడగా, ఆమె కుమారుడికి, ఆమె సోదరి కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఆర్తనాదాలతో చుట్టుపక్కల వారు లేచి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నందిగామ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నందిగామ శివారు ప్రాంతాల్లో సంచరిస్తున్న మణిసింగ్‌ను ఉదయం 10 గంటలకు అరెస్ట్ చేశారు. అతడిపై నాన్‌బెయిలబుల్ కేసులు కట్టారు.

బాధితులకు అండగా ప్రభుత్వం



యాసిడ్ దాడిలో గాయపడ్డ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. గొల్లపూడి ఆంధ్రా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ఎమ్మెల్యే జగన్ మోహనరావు బాధితుల్ని పరామర్శించారు.

విద్యుత్ వాహనాలదే భవిష్యత్!

- రాష్ట్ర విద్యుత్ ప్రణాళికలో వెల్లడించిన ఏపీఈఆర్‌సీ
- 2034 నాటికి రాష్ట్రంలో 10,56,617 విద్యుత్ వాహనాలు
- పదేళ్లలో 677 మిలియన్ యూనిట్లకు చేరనున్న ఈవీల విద్యుత్ వినియోగం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ వాహనాల(ఈవీ) వినియోగం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఏపీలో 22 వేల విద్యుత్ వాహనాలుండగా.. 2034 నాటికి ఆ సంఖ్య 10.56 లక్షలకు చేరుకోనుందని రాష్ట్ర విద్యుత్ ప్రణాళికలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) వెల్లడించింది. 2024–25లో 52,334 టూ వీలర్, 6,951 త్రీ వీలర్, 9,318 ఫోర్ వీలర్, 239 గూడ్స్, 133 విద్యుత్ బస్సులు రోడ్లెక్కుతాయని పేర్కొంది. అంటే మొత్తం వాహనాల సంఖ్య 68,975కు పెరుగుతుంది. 2034 నాటికి 10,56,617 విద్యుత్ వాహనాలను ప్రజలు వినియోగిస్తారని వెల్లడించింది. ఈవీల సంఖ్యతో పాటు వాటి చార్జింగ్‌కు వాడే విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరగనుంది. 2022లో 16 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం.. 2034 నాటికి 677 మిలియన్ యూనిట్లకు చేరుతుందని ఏపీఈఆర్‌సీ పేర్కొంది.

‘ఈవీలకు’ ప్రభుత్వ ప్రోత్సాహం..

జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తోంది. డౌన్ పేమెంట్ లేకుండా నేరుగా వాయిదా పద్ధతుల్లో ఉద్యోగులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈవీలు కొనుగోలుచేసిన వారికి రాయితీలు కూడా వస్తాయని స్పష్టం చేసింది. ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 9 శాతం వడ్డీ రేటుతో బ్యాంకులు రుణాలిచ్చేలా చర్యలు తీసుకుంది. రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర చోట్ల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు 4 వేల ప్రాంతాలను ఇప్పటికే గుర్తించింది. తక్కువ సమయంలో ఎక్కువ చార్జింగ్ అయ్యేలా వీటిని అందుబాటులోకి తెస్తోంది.

కొనుగోలులో టూ వీలర్లదే అగ్రస్థానం

విద్యుత్ స్కూటర్లు, మోటార్ సైకిళ్లనే ఎక్కువగా ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఆటోలు, కార్లు, గూడ్స్ వాహనాలు, బస్సులు ఉన్నాయి. 2034 నాటికి విద్యుత్ వినియోగంలో గూడ్స్ వాహనాలు అత్యధికంగా 428 మిలియన్ యూనిట్లను ఉపయోగించనున్నాయి. టూవీలర్లు 124 మిలియన్ యూనిట్లు, బస్సులు 61 మి.యూ, కార్లు 48 మి.యూ, త్రీ వీలర్లు 15 మి.యూనిట్లను వినియోగించనున్నాయి. కాగా, నేషనల్ ఎనర్జీ సెక్యూరిటీ, దేశీయ తయారీ సామర్థ్యాల పెంపు, వాహన కాలుష్యం తగ్గింపు తదితర లక్ష్యాలతో 2013లో ‘నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ ప్లాన్’కు మన దేశం రూపకల్పన చేసింది. 2030 నాటికి 30 శాతం ఈవీ కార్లు, 80 శాతం ఈవీ టూవీలర్లు, 70 శాతం ఈవీ వాణిజ్య వాహనాలు ప్రవేశపెట్టాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా భారీగా కర్బన ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేసింది.

అక్షర, ఆకర్ష్‌కు ‘నాసా’ అభినందనలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) నిర్వహించిన హ్యూమన్ ఎక్స్‌ప్లొరేషన్ రోవర్ చాలెంజ్ (హెచ్‌ఈఆర్‌సీ–2023)లో విజయవాడ నగరానికి చెందిన వేమూరి సాయి అక్షర, చిట్టినేని ఆకర్ష్ ప్రతిభ చూపి నాసా ప్రతినిధుల నుంచి శెభాష్ అనిపించుకున్నారు. గతేడాది ఏప్రిల్‌లో నాసా హెచ్‌ఈఆర్‌సీ–2023 నోటిఫికేషన్ ప్రకటించింది. దరఖాస్తు చేసుకున్న వారితో ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలు చేశారు. అండర్–19 విభాగంలో భారత్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ బృందంలో విజయవాడకు చెందిన అక్షర, ఆకర్ష్ ఉన్నారు. గ్రహాలపై ఇద్దరు వ్యోమగాములు పరిశోధనలు చేయడానికి ఉపయోగపడేలా రోవర్ ప్రాజెక్ట్‌ను తయారు చేశారు.



తయారు చేసిన రోవర్ ప్రాజెక్ట్‌తో బృందం

క్లుప్తంగా...

బీచ్‌లో బైడెన్ సందడి



డెలావర్: ఊపిరిసలపని పనుల్లో సతమత మయ్యే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ డెలావర్ బీచ్‌లో సందడి చేశారు. 80 ఏళ్ల వయసున్న బైడెన్ భార్య జిల్ బైడెన్, మనవరాలు ఫిన్నెగన్‌తో కలిసి బీచ్‌లో కాసేపు సన్ బాత్ తీసుకున్నారు. కుటుంబంతో కలిసి బీచ్‌లో ఎంజాయ్ చేస్తూ పని ఒత్తిళ్ల నుంచి రిలాక్సయ్యారు. బీచ్‌కి వెళ్లే వారికి అధ్యక్షుడు వస్తున్నారని సమాచారం కాస్త ముందుగా ఇచ్చారు. దీంతో బీచ్‌లో అక్కడక్కడా జనం కనిపిస్తూనే ఉన్నారు. అయిదు రోజుల యూరప్ పర్యటనకి వెళ్లడానికి ముందు శనివారం డెలావర్‌లోని రెహోబాత్ బీచ్‌కు బైడెన్ వచ్చారు. ఆ రోజు కాస్త సూర్యుడు రావడంతో సన్ బాత్ తీసుకున్న ఫొటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి.

సిగరెట్‌తో సల్మాన్...



ముంబై: బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ మరో వివాదంలో చిక్కుకున్నారు. హిందీ బిగ్ బాస్ షోకి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న సల్మాన్ చేతిలో సిగరెట్‌తో కనిపించడం సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. బిగ్‌బాస్ ఓటీటీ సీజన్ 2 ఇటీవల మొదలైంది. అందులో వీకెండ్ షోకి హోస్ట్‌గా వచ్చే సల్మాన్ కంటెస్టెంట్‌ల తప్పొప్పుల్ని ఎత్తి చూపిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. ఆ ఎపిసోడ్ తీసిన సమయంలో బయటకు వచ్చిన ఒక ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఆ ఫొటోలో సల్మాన్ చేతిలో సిగరెట్‌తో కనిపించడంతో నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలు, కుటుంబ విలువల గురించి లెక్చర్లు ఇచ్చే సల్మాన్ షోకి వచ్చే సమయంలో సిగరెట్ ఎలా కాలుస్తారని ప్రశ్నిస్తున్నారు.

దయా హృదయం.. మహా ఖరీదు

- అస్థికలను భద్రపర్చడానికి హాంకాంగ్‌లో భారీ భవనం
- ఒక కలశానికి పదేళ్లకు రూ.63 లక్షల ఖర్చు
- మహిళా పారిశ్రామికవేత్త మార్గరెట్ జీ సంకల్పం సాకారం

ప్రపంచ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతం ఏదంటే హాంకాంగ్ అని ఠక్కున చెప్పేయొచ్చు. ఒక జత చెప్పుల డబ్బా అంతటి విస్తీర్ణం ఉన్న స్థలం కూడా వేల డాలర్లు పలుకుతుంది. అలాంటి ప్రాంతంలో చూపరుల్ని ఆకట్టుకునే 12 అంతస్తుల అందమైన భవనాన్ని ఈ మధ్య నిర్మించారు. పాలరాతితో, వంపులు తిరిగిన డిజైన్, రూఫ్ గార్డెన్‌తో చూడముచ్చటగా కనిపిస్తున్న ఈ భవనాన్ని చూస్తే ఎవరైనా ఫిదా(వశం) అయిపోతారు. అయితే అది నిర్మించింది ధనవంతులు నివసించడం కోసం కాదు. మరణించిన వారి అస్థికలను భద్రపరచడం కోసం ప్రత్యేకంగా నిర్మించారు. ఒక లగ్జరీ అపార్ట్‌మెంట్ ఎలా ఉంటుందో అదే స్థాయిలో అందులో సకల సదుపాయాలు ఏర్పాటు చేశారు. షాన్ సమ్ టవర్ పేరుతో నిర్మించిన ఈ భవనంలో అస్థికల కలశాన్ని భద్రపరచాలంటే 76,000 డాలర్లు (రూ.63 లక్షలు) చెల్లించాలి. అది కూడా 10 సంవత్సరాలు మాత్రమే తీసుకోవచ్చు. ఆ తర్వాత లీజ్ రద్దయిపోతుంది. ఎందుకంటే ఆ భవనంలో 22,000 మంది అస్థికలను మాత్రమే భద్రపరచవచ్చు. ఒక కుటుంబంలో ఎనిమిది మంది అస్తికలను భద్రపరచడానికి ఫ్యామిలీ ప్యాకేజీ సదుపాయం ఉంది. అందుకయ్యే ఖర్చు 4,40,000 డాలర్లు (రూ.3.64 కోట్లు). షాన్ సమ్ అంటే చైనా భాషలో దయా హృదయం అని అర్థం. ఈ భవనం సంపన్నులకే అందుబాటులో ఉండడం గమనార్హం.

అంతా అత్యాధునికం

కేవలం అస్థికల కోసం ఇంత ఖరీదా? అని ఎవరైనా నోరెళ్లబెట్టొచ్చు. కానీ, అక్కడున్న హంగులు, ఆర్భాటాలు చూస్తే మతి పోవాల్సిందే. తమకెంతో ఇష్టమైన వారిని స్మరించుకోవడానికి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆ భవనాన్ని నిర్మించారు. పైన అంతా రూఫ్‌గార్డెన్ ఉంటుంది. ప్రతి అంతస్తులోనూ పెద్ద పెద్ద బాల్కనీలు ఉంటాయి. చైనా సంస్కృతి సంప్రదాయాల్లో శ్మశాన వాటికలు ఎలా ఉంటాయో అలా వంపుల తిరిగిన డిజైన్‌తో భవనం ఉంటుంది. ఇక లోపల పాలరాతి ఫ్లోరింగ్, ఏసీలు, గాలిలో తేమని తొలగించే వ్యవస్థ కూడా ఉన్నాయి. అస్థికలను భద్రపర్చే చిన్నచిన్న గదుల తలుపులను బంగారు నాణేలతో సౌందర్యభరితం చేశారు. భిన్న సంప్రదాయాలు, ఆచారాలను పాటించే వారి అభిరుచులకు అనుగుణంగా ఈ భవన నిర్మాణం జరిగింది. పెద్దలకి నివాళులర్పించుకోవడానికి ముందస్తుగా యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. వారికిష్టమైన ఆహారాన్ని వండి తీసుకువెళ్లి, సంప్రదాయబద్ధంగా నివేదించవచ్చు.

పెద్దలను గౌరవించుకోవడానికి

మనుషుల అస్థికల కోసం ప్రత్యేకంగా అందమైన భవనం కట్టాలన్న ఆలోచన ఏడు పదుల వయసున్న మార్గరెట్ జీ అనే ఒక మహిళా పారిశ్రామికవేత్తకు వచ్చింది. జ్యువెలరీ, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్న ఆమె వయసు మీదపడ్డాక సేవా కార్యక్రమాల బాట పట్టారు. తన పేరు మీదే ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి సమాజానికి సేవలందిస్తున్నారు. ''మరణించిన పెద్దలకి నివాళులర్పించడానికి చైనా సంప్రదాయంలో చాలా ప్రాధాన్యతనిస్తారు. దివికేగిన పెద్దల స్మృతుల్లో గడిపి, వారిని గౌరవిస్తే అంతా మంచే జరుగుతుందని విశ్వసిస్తారు. అలాంటి వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఈ భవనం నిర్మించాం'' అని మార్గరెట్ చెప్పారు. - సాక్షి, నేషనల్ డెస్క్



హాంకాంగ్‌లో అస్థికలను భద్రపరిచే భవనం

హాంకాంగ్‌లో నిండిపోయిన శ్మశానం

భర్త మరణంతో..

హాంకాంగ్ నగర జనాభా 70 లక్షలపైమాటే. చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ జనాభా కిటకిటలాడిపోతూ ఉంటుంది. వాస్తవానికి విస్తీర్ణంలో హాంకాంగ్ పెద్దదే. కానీ కొండలు, గుట్టలు ఎక్కువగా ఉండడం వల్ల నివాసయోగ్యమైన ప్రాంతం తక్కువే. అందుకే ఇక్కడ ఆకాశహర్మ్యాల నిర్మాణం ఎక్కువగా ఉంది. ఈ నగరంలో ఒక ఇంటి సగటు విస్తీర్ణం 430 చదరపు అడుగులు మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. అస్థికల భవన నిర్మాణాన్ని తలపెట్టిన మార్గరెట్ భర్త 2007లో మరణించారు. ఆయన స్మృతి చిహ్నం ఏర్పాటు చేయడానికి ఆమెకి స్థలం దొరకలేదు. ఆ సమయంలోనే మరణించిన వారి కోసం ప్రత్యేకంగా ఒక అపార్ట్‌మెంట్ నిర్మించాలన్న ఆలోచన ఆమెకు వచ్చింది. అది ఇన్నేళ్లకి సాధ్యమైందని చెబుతున్నారు. ఇక హాంకాంగ్‌లో వృద్ధుల జనాభా పెరిగిపోతోంది. ప్రతి అయిదుగురిలో ఒకరు 65 ఏళ్లకు పైబడిన వారే. ఇక నగరంలో ప్రతి ఏటా దాదాపు 46,000 మంది మరణిస్తున్నారు. వారి అవశేషాలను భద్రపరచడానికి ప్రభుత్వం పలు సదుపాయాలు ఏర్పాటు చేసింది. అయితే అవి సరిపోకపోవడం వల్ల ప్రైవేట్ భవనం నిర్మించాల్సి వచ్చింది. హాంకాంగ్‌లో సంపన్నులు కూడా ఎక్కువే. అలాంటి వారి సౌకర్యార్థం షాన్ సమ్ అందుబాటులోకి వచ్చింది.

విశాఖ నుంచి కేరళకు గంజాయి

నలుగురిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ అధికారులు



తిరువనంతపురం: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం నుంచి కేరళకు తీసుకువచ్చిన 155 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. విశాఖ నుంచి తీసుకువచ్చిన గంజాయిని తిరువనంతపురంలోని పల్లితురలోని ఓ గోదాములోకి మార్చుతుండగా అధికారులు నలుగురిని అరెస్ట్ చేశారు. గంజాయితోపాటు 61 గ్రాముల ఎండీఎంఏ అనే సింథటిక్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరువనంతపురం నుంచి విశాఖకు వెళ్లిన నలుగురిలో ఇద్దరు విమానంలో తిరిగి రాగా మిగిలిన ఇద్దరు వాహనంలో డ్రగ్స్‌ను తీసుకువచ్చారని అధికారులు తెలిపారు.

ఎన్డీయేలోకి ఎల్జేపీ (రామ్‌విలాస్)!

పాట్నా: బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే)లో బిహార్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) భాగస్వామిగా చేరేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీ నేత, ఎంపీ చిరాగ్ పాశ్వాన్‌తో కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు నిత్యానంద రాయ్ తాజాగా చర్చలు జరిపారు. బీజేపీ, దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ ఒకే విలువలను పంచుకొనేవారని గుర్తుచేశారు. ప్రజా సాధికారతతోపాటు అభివృద్ధి కోసం పాశ్వాన్ ఎంతగానో తపించేవారని కొనియాడారు. అయితే, ఎన్డీయేలో లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) చేరికపై నిత్యానంద రాయ్ నేరుగా స్పందించలేదు. చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. బీజేపీతో మరో దఫా చర్చలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఎన్డీయేలో చేరికపై ఇప్పుడే స్పందించడం సరైంది కాదన్నారు. బీజేపీపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తన అభిమానాన్ని ఆయన గతంలో పలుమార్లు చాటుకున్నారు.

ఖలిస్తానీ, భారత అనుకూలుర పోటాపోటీ ప్రదర్శనలు

టొరంటో: కెనడాలో ఖలిస్తానీ అనుకూలురు మరోసారి నిరసనకు దిగారు. అయితే, జాతీయ జెండాలతో భారతీయులు చేపట్టిన ర్యాలీ ముందు ఆ నిరసన వెలవెలబోయింది. టొరంటోలోని భారత కాన్సులేట్ కార్యాలయం ఎదుట ఆదివారం కొందరు ఖలిస్తానీ మద్దతుదారులు గుమికూడారు. జూన్ 18వ తేదీన కెనడాలో హత్యకు గురైన హర్దీప్ సింగ్ నిజ్జర్ చిత్రపటాన్ని వారు ప్రదర్శించారు. అదే సమయంలో, భారత సంతతికి చెందిన కొందరు త్రివర్ణ పతాకం చేబూని 'వందేమాతరం, భారత్ మాతా కీ జై, లాంగ్ లివ్ ఇండియా'అంటూ నినాదాలతో హోరెత్తించారు. ముందు జాగ్రత్తగా ఆ ప్రాంతంలో పోలీసులను పెద్ద సంఖ్యలో మోహరించారు. ఇటీవల ఖలిస్తానీవాదులు నిర్వహించిన ర్యాలీలో అట్టావాలోని భారత హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ, టొరంటోలోని కాన్సుల్ జనరల్ అపూర్వ శ్రీవాస్తవలను హర్దీప్ సింగ్ నిజ్జర్ హంతకులుగా పేర్కొంటూ పోస్టర్లు ప్రదర్శించడంపై భారత ప్రభుత్వం ఢిల్లీలోని కెనడా రాయబారికి సమన్లు జారీ చేసింది.

15కు బెంగాల్ హింస మృతులు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో మృతుల సంఖ్య 15కు చేరింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఒక మృతదేహం లభ్యం కాగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో మరణించారని అధికారులు ఆదివారం తెలిపారు., కుల్టాలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ బూత్ వద్ద అబు సలేం ఖాన్ అనే వ్యక్తి మృతదేహం పడి ఉందన్నారు. అతడు టీఎంసీ కార్యకర్త అని చెప్పారు. ఆప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంతో భారీగా పోలీసులను తరలించారు. ఇదే జిల్లా బసంతిలో శనివారం రాత్రి జరిగిన హింసాత్మక ఘటనల్లో గాయపడిన అజార్ లష్కర్ అనే టీఎంసీ కార్యకర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడని అధికారులు వివరించారు. అదేవిధంగా, మాల్దా జిల్లా బైషన్‌నగర్‌కు చెందిన టీఎంసీ కార్యకర్త మొతియర్ రహ్మాన్ కత్తిపోట్లతో ఆస్పత్రిలో చనిపోయాడు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో 12 మంది చనిపోగా అందులో అధికార టీఎంసీకి చెందిన 8 మంది ఉన్నారు. అయితే, మరణాల సంఖ్య వాస్తవానికి 18 వరకు ఉంటుందని రాజకీయ పార్టీలు అంటున్నాయి. ఈ మరణాలపై 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని ఎన్నికల సంఘం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది.

12న కాంగ్రెస్ మౌన సత్యాగ్రహం

న్యూఢిల్లీ: అధికార బీజేపీ నీచ రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ పాఠర్ట ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఆరోపించారు. తమ పార్టీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పూర్తిస్థాయిలో విజయవంతమైందని, ప్రజల నుంచి అపూర్వమైన ఆదరణ లభించిందని చెప్పారు. ఈ యాత్ర తర్వాత రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రసంగిస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం, అదానీ గ్రూప్ మధ్యనున్న బంధాన్ని బయటపెట్టారని తెలిపారు. దాంతో కక్షగట్టిన మోదీ ప్రభుత్వం రాహుల్‌పై అనర్హత వేటు వేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ చర్యకు నిరసనగా ఈ నెల 12న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో గాంధీజీ విగ్రహాల వద్ద మౌన సత్యాగ్రహం చేపట్టనున్నట్లు కె.సి.వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఉత్తరాదిన భారీ వర్షాలు

- ఢిల్లీలో 40 ఏళ్ల, హిమాచల్‌లో 50 ఏళ్ల రికార్డులు బద్దలు
- పలు ఘటనల్లో 19 మంది మృతి
- పొంగిపొర్లుతున్న పలు నదులు

న్యూఢిల్లీ: ఉత్తరభారతాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో 19 మంది చనిపోయారు. ఢిల్లీలోని యమున సహా పలు నదులు పొంగిపొర్లుతున్నాయి. ఆకస్మిక వరదలతో రహదారులపై రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దేశ రాజధానిలో రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. 24 గంటల వ్యవధిలో ఏకంగా 153 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 1982 జూలై తర్వాత, ఈ స్థాయిలో వాన దంచికొట్టడం ఇదే ప్రథమం. ఢిల్లీతోపాటు జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరించింది. ఢిల్లీతోపాటు గురుగ్రామ్ సహా పలు నగరాలు పట్టణాల్లో రహదారులపై నీరు నిలవడంతో జనం ట్రాఫిక్ కష్టాలపై వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా ఉత్తర రైల్వే 17 రైళ్లను రద్దు చేసింది. మరో 12 రైళ్లను దారి మళ్లించింది.

హిమాచల్ అస్తవ్యస్తం

హిమాచల్ ప్రదేశ్‌లోని 7 జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. సిమ్లా జిల్లాలో ఇల్లు కూలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, కులు, చంబా జిల్లాల్లో ఒక్కరు చొప్పున చనిపోయారు. గత 36 గంటల్లో 14 కొండ చరియలు విరిగి పడిన ఘటనలు, 13 ఆకస్మిక వరదల ఘటనలు నమోదయ్యాయి. వరదలతో కొట్టుకుపోయిన 700 రోడ్లను మూసివేశారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం లాహోల్ స్పిటిలోని చంద్రతాల్‌లో 200 మంది వరద నీటిలో చిక్కుకుపోయారు. బియాస్ వరదల్లో చండీగఢ్-మనాలి హైవేలోని కొంతభాగం కొట్టుకుపోయింది. మనాలి, కిన్నౌర్, చంబాల్లో వరదల్లో దుకాణాలు, వాహనాలు కొట్టుకుపోయాయి.



గుర్గావ్‌లో రోడ్డుపై పోటెత్తుతున్న వరద

ఉత్తరాఖండ్‌లో ముగ్గురు గల్లంతు

ఉత్తరాఖండ్‌లో భక్తులతో వెళ్తున్న జీపు రిషికేశ్-బద్రీనాథ్ నేషనల్ హైవేపై గంగా నదిలో పడిపోయి ముగ్గురు మృతి చెందారు. జీపులో 11 మంది ఉండగా, ఐదుగురిని కాపాడామని, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని యంత్రాంగం తెలిపింది.

కశ్మీర్‌లో ఇద్దరు జవాన్ల దుర్మరణం

జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఆకస్మిక వరదలకు బస్సుపై కొండచరియలు విరిగిపడి ఇద్దరు జవాన్లు కొట్టుకుపోయి దుర్మరణం పాలయ్యారు. పంజాబ్, హరియాణాల్లో భారీ వర్షాలు కురిశాయి.

అమర్‌నాథ్ యాత్ర పునఃప్రారంభం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్ర మూడు రోజుల విరామం తర్వాత పునఃప్రారంభమైంది. ప్రతికూల వాతావరణం వల్ల పంజ్‌తరణి, శేష్‌నాగ్ బేస్‌క్యాంపుల్లో చిక్కుకుపోయిన యాత్రికులు ఆదివారం మంచు శివలింగ దర్శనానికి తరలివెళ్లారు. భారీ వర్షాలకుతోడు కొండ చరియలు విరిగిపడుతుండడంతో అమర్‌నాథ్ యాత్రను అధికారులు మూడు రోజుల క్రితం నిలిపివేసిన సంగతి తెలిసిందే. పవిత్ర గుహ చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షాలు కొంత తగ్గుముఖం పట్టడంతో యాత్రికులను అనుమతించాలని నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. ఈ రోడ్డుపై పెద్ద సంఖ్యలో వాహనాలు చిక్కుకుపోయాయి. వాటిని తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జమ్మూ నుంచి కొత్తగా యాత్రికులను అనుమతించడం లేదు. జమ్మూకశ్మీర్‌లో గురువారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. అమర్‌నాథ్‌లో మంచు సైతం కురిసింది. సోమవారం నుంచి వర్షాలు పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది.

ఏపీ వాసి దుర్మరణం

రాజాం సిటీ(ఆంధ్రప్రదేశ్): ఉత్తరాఖండ్‌లో జరిగిన ప్రమాదంలో విజయనగరం జిల్లా రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన జరజాన రవి రావు మృతి చెందారు. బొద్దాం గ్రామానికి చెందిన రవి రావు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగి. ఐదు నెలల క్రితమే వివాహమైంది. భార్య కల్యాణితో కలిసి వారం క్రితం కేదార్‌నాథ్ యాత్రకు బయలుదేరారు. శనివారం రాత్రి ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడింది. ఈ ఘటనలో రవి రావు ప్రాణాలు కోల్పోయారు. కల్యాణితో పాటు మరికొందరిని సహాయక సిబ్బంది రక్షించారు.

మెకానిక్‌లు సాధికారత సాధించాలి

కార్మికుల అభివృద్ధిపై దేశాభివృద్ధి ఆధారపడి ఉంది: రాహుల్



న్యూఢిల్లీ: మన దేశ ఆటోమొబైల్ రంగాన్ని బలోపేతం చేయడానికి మెకానిక్‌లు మరింత కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పరిశ్రమ అభివృద్ధి కోసం వారు సాధికారత సాధించాలని సూచించారు. ఆయన ఇటీవల ఢిల్లీ కరోల్ బాగ్‌లోని బైకర్స్ మార్కెట్‌లో మోటార్‌సైకిల్ మెకానిక్‌లతో సమావేశమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్న విషయం విదితమే. మెకానిక్‌లతో కలిసి ఓ బైక్‌ను ఆయన సర్వీసు కూడా చేశారు. సంబంధిత వీడియోను రాహుల్ ఆదివారం ట్విట్టర్‌లో షేర్ చేశారు. తనకు కేటీఎం 390 మోటార్ సైకిల్ ఉందని, దాన్ని ఉపయోగించడం లేదని, ఇంట్లోనే పార్క్ చేసి ఉంచానని ఈ వీడియోలో రాహుల్ చెప్పారు. మోటార్‌సైకిల్‌పై బయటకు వెళ్లేందుకు తన భద్రతా సిబ్బంది అనుమతించడం లేదని, అందుకే కేటీఎం 390ని ఇంటికే పరిమితం చేశానని వివరించారు. మీరు పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు? అని ఓ మెకానిక్ ప్రశ్నించగా.. చూద్దాం అంటూ రాహుల్ బదులిచ్చారు. ఆటోమొబైల్ పురోగతి కోసం మెకానిక్‌లు వారి ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కష్టపడుతున్నారని, మెరుగైన వసతులు, ఉత్తమ అవకాశాలు పొందడానికి వారు అన్ని విధాలా అర్హులని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. భారతదేశ అసలైన అభివృద్ధి కార్మికుల అభివృద్ధిపై ఆధారపడి ఉందని తెలిపారు.

ఇక కాషాయ వందేభారత్



చెన్నై: వందేభారత్ రైళ్లు ఇకపై రంగు మార్చుకోనున్నాయి. ఇన్నాళ్లూ నీలం రంగులో ఉండే రైలు బోగీలు ఇకపై కాషాయం రంగులో కనిపిస్తాయి. కొత్తగా తయారు చేసే రైళ్లకు కాషాయం రంగు వేస్తున్నారు. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో వందేభారత్ రైలు కోచ్‌లు తయారవుతున్నాయి. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ ఫ్యాక్టరీని సందర్శించారు. రైలు బోగీలోకి వెళ్లి సీట్లను పరిశీలించారు. లోకో పైలెట్ జోన్‌లోకి కూడా వెళ్లి అన్నీ సరిగ్గా అమర్చారా లేదా అని పరీక్షించి చూశారు. ఈ కొత్త రైళ్లు బూడిద, కాషాయం రంగు కలయికతో ఉన్నాయి. మన దేశ జెండా త్రివర్ణ పతాకం స్ఫూర్తితో ఈ రంగుల్ని ఎంపిక చేసినట్టుగా అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. ''వందేభారత్ రైళ్లు మేకిన్ ఇండియాలో భాగంగా రూపొందిస్తున్నాం. ప్రస్తుతమున్న రైళ్లలో లోటు పాట్లు గురించి సమాచారాన్ని సేకరించి కొత్తగా నిర్మించే కోచ్‌ల్ని మరింతగా మెరుగుపరుస్తున్నాం'' అని వైష్ణవ్ వివరించారు.

చంద్రయాన్-3.. త్రీ ఇన్ వన్

ఒకేసారి ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను పంపించనున్న ఇస్రో

రూ.1,600 కోట్ల వ్యయం

- చంద్రయాన్ ప్రాజెక్టులో భాగంగా మూడు ప్రయోగాలకు సుమారు రూ.1,600 కోట్లు వ్యయం చేస్తున్నారు.
- చంద్రయాన్-3 ద్వారా చంద్రుడి రహస్యాలు తెలుసుకోవడమే కాకుండా వ్యోమగాములను పంపించే ప్రయత్నాలు సైతం ప్రారంభమయ్యే అవకాశం వుంది.
- చంద్రయాన్-1 ప్రయోగానికి రూ.380 కోట్లు ఖర్చు చేశారు.
- చంద్రయాన్-2 ప్రాజెక్టును రూ.425 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ప్రయోగాన్ని నిర్వహించేందుకు పదేళ్ల సమయం పట్టడంతో ఖర్చు అదనంగా రూ.173 కోట్లు పెరిగింది. అంటే చంద్రయాన్-2కు రూ.598 కోట్లు వ్యయం చేశారు.
- చంద్రయాన్-3 ప్రయోగానికి దాదాపు రూ.615 కోట్లు వెచ్చిస్తున్నారు.

సూళ్లూరుపేట: చందమామ గురించి తెలుసుకోవడానికి గత 60 ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయి. అమెరికా 1958 నుంచి చంద్రుడిపై పరిశోధనలు సాగిస్తోంది. 1969లో అపోలో రాకెట్ ద్వారా ముగ్గురు వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించింది. రష్యా, జపాన్, చైనా, ఇజ్రాయెల్, జర్మనీ, భారత్ తదితర దేశాలు చంద్రుడి రహస్యాలను ఛేదించేందుకు కృషి చేస్తున్నాయి. భారత్ 2008లో చంద్రుడి మీదికి చంద్రయాన్-1 పేరుతో ఆర్బిటార్‌ను ప్రయోగించింది. అక్కడ నీటి జాడలున్నాయని గుర్తించింది. చంద్రుడిపై రెండు ప్రయోగాలు చేసిన భారత్ మూడో ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. సైంటిస్టులు ఏర్పాట్లను దాదాపు పూర్తిచేశారు. చంద్రయాన్-1, చంద్రయాన్-2 ప్రయోగాల వల్ల ఆర్బిటార్ ద్వారా ల్యాండర్‌ను, ల్యాండర్ ద్వారా రోవర్‌ను పంపించిన నాలుగో దేశంగా భారత్ గుర్తింపు పొందింది.



చంద్రయాన్-3లో మూడింటినీ ఒకేసారి పంపిస్తున్నారు కనుక దీన్ని త్రీ ఇన్ వన్ ప్రయోగంగా ఇస్రో శాస్త్రవేత్తలు పరిగణిస్తున్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2008 అక్టోబర్ 22న చేపట్టిన చంద్రయాన్-1 ప్రయోగం విజయవంతమైంది. 2019 జూలై 15న చంద్రయాన్-2కు శ్రీకారం చుట్టింది. ఆర్బిటార్ ద్వారా ల్యాండర్, ల్యాండర్ ద్వారా రోవర్‌ను పంపించడమే కాకుండా 14 రకాల పేలోడ్స్‌ను పంపించారు. ప్రయోగమంతా సక్సెస్ అయిందనుకున్న తరుణంలో ఆఖరు రెండు నిమిషాల్లో ల్యాండర్ చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టడంతో సంకేతాలు ఆగిపోయాయి. దాంతో ఆ ప్రయోగం పాక్షిక విజయం మాత్రమే సాధించింది. దాదాపు నాలుగు సంవత్సరాలు తరువాత చంద్రయాన్-3 పేరుతో మూడోసారి ప్రయోగానికి ఇస్రో ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 14వ తేదీన ఈ ప్రయోగం చేపట్టనుంది. చంద్రయాన్-3లో ప్రపొల్షన్ మాడ్యూల్‌లో రెండు పేలోడ్స్, ల్యాండర్‌లో 4 పేలోడ్స్, రోవర్‌లో రెండు పేలోడ్స్, అమెరికాకు చెందిన ఒక పేలోడ్‌ను అమర్చి పంపించనున్నారు.

టమాటాకు రక్షణగా బౌన్సర్లు



వారణాసి: దేశంలో టమాటా ధరలు అంతకంతకూ పెరిగిపోతూ కొన్ని ప్రాంతాల్లో కేజీ 200 కూడా దాటడంతో వ్యాపారులకు వింత వింత ఆలోచనలు వస్తున్నాయి. మార్కెట్‌లో తమ దుకాణాల్లో టమాటాలకి రక్షణగా బౌన్సర్లను నియమిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి కూరగాయల మార్కెట్‌లో టమాటాలకు ఇరు వైపులా ఇద్దరు బౌన్సర్లు నిల్చొని ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మధ్యప్రదేశ్‌లో స్మార్ట్ ఫోన్ల వ్యాపారి అభిషేక్ అగర్వాల్ ఒక స్మార్ట్ ఫోన్ కొంటే రెండు కిలోల టమాటాలు ఉచితమని ప్రకటించాడు.

స్కూటర్‌పై వెళ్తూ తుపాకీతో కాల్పులు..

ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

న్యూయార్క్: ఓ సాయుధుడు స్కూటర్‌పై వెళుతూ జరిపిన కాల్పుల్లో ఒక వృద్ధుడు చనిపోగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన న్యూయార్క్‌లో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి హ్యాండ్‌గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

సోమవారం। 10। జూలై। 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ పటమటకు చెందిన పి. లీలాకృష్ణ ప్రసాద్ రూ. 1.00,116 విరాళాన్ని అందజేశారు. దాతకు అమ్మవారి దర్శనం కల్పించారు.



బగళాముఖి సేవలో..

పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి అమ్మవారిని ఏపీ స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి ఎల్.వి.రమణ మూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

ఆషాఢ సారె సమర్పణ



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ వారికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆషాఢ సారెను సమర్పించారు. ఆదివారం అమ్మవారికి సంప్రదాయ పద్ధతిలో సారెను అందించారు. అమ్మవారికి కొడాలి కుటుంబం పేరిట వేద పండితులు ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం వారిని ఆలయ మర్యాదలతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ సురేష్, ధర్మకర్తలు పాల్గొన్నారు. కాగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

షూటింగ్‌లో ఓవరాల్ చాంప్ కృష్ణా



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షూటింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఆర్ఏఏపీ) ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లోని షాట్స్ షూటింగ్‌లో రేంజ్‌లో ఈ పోటీలు జరిగాయి. 10 మీటర్ల రైఫిల్, పిస్తోల్, 25 మీటర్ల పిస్తోల్, 50 మీటర్ల రైఫిల్, పిస్తోల్, షాట్‌గన్ విభాగాల్లో సబ్‌జూనియర్, జూనియర్, యూత్, సీనియర్, మాస్టర్స్, సీనియర్ మాస్టర్స్ స్త్రీ, పురుషుల కేటగిరీల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో అత్యధికంగా 60 పతకాలతో కృష్ణా జిల్లా ముందంజలో ఉండగా 40 పతకాలతో గుంటూరు, 28 పతకాలతో విశాఖపట్నం వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు విజయవాడలోని లెమన్‌ట్రీ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆదివారం పతకాలు అందజేశారు. ఆర్ఏఏపీ అధ్యక్ష, కార్యదర్శులు టి.సలలిత్, డి.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణారెడ్డి, ఖాదర్‌బాబు విజేతలకు మెడల్స్ అందజేశారు.

దుర్గమ్మ భక్తులకు ఉచిత బస్సులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. దుర్గగుడి చైనా వాల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉచిత బస్సు సర్వీసులకు తొలుత ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్ నుంచి కొండపైన ఓం టర్నింగ్ వరకు ఈ బస్సులు నడుస్తాయని చైర్మన్ రాంబాబు పేర్కొన్నారు. ఉచిత సర్వీసుల కింద రెండు బస్సులను కేటాయించామని, ప్రతి రోజు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయపాలక మండలి సభ్యులు, అధికారులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 519.30 అడుగుల వద్ద ఉంది. ఇది 148.0031 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 808.90 అడుగుల వద్ద ఉంది. ఇది 32.6709 టీఎంసీలకు సమానం.

విషాద యాత్ర

- శ్రీకాళహస్తిలో ఘోర రోడ్డు ప్రమాదం
- అతివేగం తెచ్చిన అనర్థం
- ఆరుగురిని బలిగొన్న రోడ్డు రక్కసి
- దైవదర్శనానికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు..
- మృతులంతా విజయవాడ వాసులే

ఒక్క రోడ్డు ప్రమాదం.. మూడు కుటుంబాలకు చెందిన ఆరుగురిని మృత్యుఒడికి చేర్చింది. దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తిరుపతి–శ్రీకాళహస్తి మార్గంలోని శ్రీకాళహస్తి పట్టణానికి కూతవేటు దూరంలో జరిగిన ఘోరప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు దుర్మరణం పాలవగా, అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు స్వల్పగాయాలతో బయటపడి మృత్యుంజయుడుగా మిగిలాడు.



లారీని ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

రేణిగుంట/శ్రీకాళహస్తి/కృష్ణలంక(విజయవాడ ఈస్ట్): విజయవాడ కృష్ణలంక బాలాజీ టవర్స్‌లో రమేష్‌బాబు(45), ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), కుమారులు రేవంత్, భరత్ నివసిస్తున్నారు. రమేష్ బాబు భవన నిర్మాణ రంగంలో కూలీలను అందించే లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరి స్వగ్రామం కృష్ణా జిల్లా, మోపిదేవి సమీపంలోని అర్జావారిపాలెం. వీరి పెద్ద కుమారుడు రేవంత్ బీటెక్ చదువుతుండగా, చిన్నకుమారుడు భరత్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. రాజ్యలక్ష్మి సోదరి శ్రీలత(42) ఉయ్యూరులోని అక్కబజారులో నివాసముంటూ అక్కడ క్యాటరింగ్ చేసుకుంటూ ఒక్కగానొక్క కొడుకుని ఇంజినీరింగ్ చదివిస్తోంది. అలాగే రాజ్యలక్ష్మి స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త నరసింహమూర్తి(47), కుమార్తె అక్షయ(17) కూడా కోటినగర్ ప్రాంతంలోనే నివసిస్తున్నారు. రమేష్‌బాబు, నరసింహమూర్తి ఇద్దరుమంచి స్నేహితులు. కాగా రమేష్‌బాబు, అతని భార్య రాజ్యలక్ష్మి, చిన్నకుమారుడు భరత్(17), రాజ్యలక్ష్మి సోదరి శ్రీలత, స్నేహితురాలు రమణి, ఆమె భర్త మూర్తి, కుమార్తె అక్షయ కలసి మొత్తం ఏడుగురు ఒకే కారులో శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి తిరుమల దర్శనార్థం బయల్దేరారు. తిరుమలకు చేరుకుని ఆదివారం ఉదయం తిరుమలేశుని దర్శంచుకున్నారు. అక్కడి నుంచి కారులో తిరుగుపయనమై, మార్గమధ్యలోని శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొని, విజయవాడకు వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. తర్వాత తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకొని అక్కడి నుంచి శ్రీకాళహస్తికి బయలుదేరారు.



మృతదేహాలను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

శ్రీకాళహస్తి సన్నిధికి మరికొద్ది దూరంలో..

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి మరికొద్ది నిమిషాల వ్యవధిలో చేరుకునేలోపే శ్రీకాళహస్తి పట్టణం, మిట్టకండ్రిగ సమీపంలో ఎదురుగా విజయవాడ నుంచి హోసూరు వెళ్తున్న మొక్కజొన్న లోడ్‌తో కూడిన లారీని కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం లారీ ముందు చక్రాల కిందకు ఇరుక్కుపోయి నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న రమేష్‌బాబు, పక్కసీటులో కూర్చున్న మూర్తి సీటులోనే ఇరుక్కుని మృతి చెందారు. వెనుక సీటులో కూర్చున్న రాజ్యలక్ష్మి, శ్రీలత, రమణి, అక్షయ అక్కడికక్కడే మృతి చెందారు. భరత్ ఒక్కడే స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

అతివేగం, సీటు బెల్ట్ లేకపోవడమే..

అతివేగంగా రావడంతో పాటు కారులో ప్రయాణిస్తున్న ఏ ఒక్కరూ సీటుబెల్ట్ పెట్టుకోలేదు. అప్పటి వరకు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ రోడ్డు పక్కల ఉన్న పచ్చని వరిపొలాలను చూస్తూ.. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగుతున్న వారి ప్రయాణం రెప్పపాటులో జరిగిన రోడ్డుప్రమాదం తీరని విషాదంలోకి నెట్టింది.

మృత్యుంజయుడు భరత్

రాజ్యలక్ష్మి, రమేష్‌బాబు కుమారుడు భరత్ వెనుక సీటులో అలసిపోయి నిద్రిస్తున్నాడు. అయితే తాను ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై పెద్ద శబ్దం వచ్చింది. నిద్రలో నుంచి తేరుకుని చూసేలోపే చిన్నపాటి గాయాలున్నాయి. అతని కళ్లెదుట తల్లి దండ్రులిద్దరూ విగతజీవులుగా పడి ఉండడం, పెద్దమ్మ శ్రీలత, తోడుగా వచ్చిన కుటుంబానికి చెందిన ముగ్గురు కారులో మృతి చెంది పడి ఉండడంతో భరత్ బోరున విలపిస్తూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కళ్లెదుటే ఘోర ప్రమాదం జరగడంతో అక్కడున్న వారు పరుగుపరుగున ప్రమాద స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కున్న వారిని బయటకు లాగి రక్షించే ప్రయత్నం చేశారు. సీఐ అంజూ యాదవ్, సిబ్బంది చేరుకుని గాయాలైన భరత్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుల బంధువులకు సమాచారం అందించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భరత్

పరామర్శ

మిట్టకండ్రిగ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలతో బయటపట్ట భరత్‌ను శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పరామర్శించారు. భరత్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం అతన్ని స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. భరత్ త్వరగా కోలుకోవాలని తల్లి జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను ప్రార్థించినట్టు తెలిపారు. పరామర్శించిన వారిలో పసల కుమారస్వామి, బాలశెట్టి నరసింహులు, మునిరెడ్డి, షఫీ ఉన్నారు.

మృత్యు'మార్గం'

శ్రీకాళహస్తి–తిరుపతి మార్గంలో ఇటీవల కాలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పూతలపట్టు–నాయుడుపేట 6లేన్ల రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించడం కష్టంగా ఉంది. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కృష్ణలంకలో విషాదఛాయలు..

ప్రమాద విషయం తెలుసుకున్న మృతుల బంధువులు, చుట్టు ప్రక్కల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణలంకలోని వారి ఇళ్ల వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. రమేష్ కుమారుడు రేవంత్‌కు విషయం తెలియడంతో అతనిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. మృతుల కుటుంబాలు ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావడంతో చుట్టుపక్కల వారు హుటాహుటిన తిరుపతికి బయలుదేరారు. మృతదేహాలను వారి సొంత గ్రామాలకు తరలించే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

ఈడుపుగల్లు స్విమ్మర్ల సత్తా



కంకిపాడు(పెనమలూరు): అంతర్‌జిల్లాల స్విమ్మింగ్ పోటీల్లో ఈడుపుగల్లు గ్రామానికి చెందిన స్విమ్మర్లు సత్తా చాటారు. ఈనెల 8, 9 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో 8వ సబ్‌జూనియర్స్, జూనియర్స్ అంతర్‌జిల్లాల స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గ్రూప్–1లో బిళ్లా హర్షిత 200 మీటర్ల బటర్‌ఫ్లైలో రజతం, 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో కాంస్యం, 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్యం, 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్యం సాధించింది. గ్రూప్–2లో బిళ్లా హర్షశ్రీ 50 మీటర్లు, 100 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో బంగారు పతకాలు, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య పతకం సాధించింది.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వ జూనియర్ కళాశాల రాధానగర్, పాయకాపురం నందు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి సి.శ్రీసత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. వించిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉర్దూ)లో ఎకనామిక్స్, కామర్స్, సివిక్స్, ఇంగ్లిష్, వృక్షశాస్త్రం, ఉర్దూ సబ్జెక్టులలో బోధనకు గాను గెస్ట్ లెక్చరర్స్‌గా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టులలో 50శాతం తక్కువ కాకుండా ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు సదరు నకలు కాపీలతో నేరుగా ఈ నెల 12వ తేదీన ఉదయం 11 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీగా ఎంపికైన వారికి గంటకు రూ. 150 చొప్పున గరిష్టంగా నెలకు రూ. 10వేల వరకూ చెల్లిస్తామన్నారు. ఇతర వివరాలకు 9849614915లో సంప్రదించాలన్నారు.

డిగ్రీకి డిగ్నిటీ

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ

- విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు అధిక ప్రాధాన్యం
- రాష్ట్రంలో 190కు పైగా సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌లు, 80కు పైగా మైనర్ సబ్జెక్ట్‌లు
- ఉమ్మడి జిల్లాలో డిగ్రీని అందిస్తున్న 90 కళాశాలలు
- రెండు జిల్లాల్లో ఎనిమిది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు
- 12వ తేదీ వరకూ ప్రవేశాలకు గడువు పెంపు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఎదురవుతున్న పోటీని తట్టుకొని అత్యున్నతంగా ఎదిగే విధంగా నూతన డిగ్రీ కోర్సును రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దింది. ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టిన ఆనర్స్ డిగ్రీ కోర్సు విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దటానికి అండగా ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను ఆయా విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్నాయి. తద్వారా డిగ్రీ అభ్యాసంలోనే ఆయా రంగాలకు చెందిన సంపూర్ణ జ్ఞానాన్ని పొందేందుకు అక్కడ అవకాశముంటుంది. అదే కోవలో ఏపీలోనూ నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను తీసుకొస్తున్నారు. ఇప్పటికే నాలుగేళ్ల డిగ్రీ కోర్సుకు సంబంధించి అన్ని విశ్వవిద్యాలయాలు, వాటి పరిధుల్లో ఉన్న కళాశాలలు విస్తృతంగా ప్రచారం చేశాయి. డిగ్రీ కోర్సుల ప్రవేశానికి ప్రభుత్వం ఈ నెల 12వ తేదీ వరకూ గడువును పొడిగించింది.

సబ్జెక్టులు ఇలా..

నూతన డిగ్రీ విధానంలో ఒక సింగిల్ మేజర్ సబ్జెక్ట్, మరో మైనర్ సబ్జెక్టును విద్యార్థి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో వివిధ కళాశాలల్లోని కోర్సుల్లో సుమారు 190కు పైగా సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌లు.. మరో 80 వరకూ మైనర్ సబ్జెక్ట్‌లను అందిస్తున్నారు. అందులో కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో సుమారు 150కు పైగా సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మైనర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి విద్యార్థికి దేనినైనా ఎంపిక చేసుకునే అవకాశముండటంతో ఉన్నత విద్యామండలి నిర్ధారించిన మైనర్ సబ్జెక్ట్‌లే కాకుండా ఇంకా అధికంగా సబ్జెక్ట్‌లను ఎంచుకునే అవకాశముందని సీనియర్ అధ్యాపకులు చెబుతున్నారు. డ్యాన్స్, చిత్రలేఖనం, సంగీతం వంటి సబ్జెక్ట్‌లను సైతం మైనర్ సబ్జెక్ట్‌లుగా ఎంచుకోవచ్చని వివరిస్తున్నారు.

ఇంటర్ డిసిప్లినరీ, మల్టీ డిసిప్లినరీ కోర్సులు

- విద్యార్థులు సమగ్ర విషయ పరిజ్ఞానం కోసం ఇంటర్ డిసిప్లినరీ కోర్సు, మల్టీ డిసిప్లినరీ కోర్సులు కూడా ఉంటాయి.
- ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థి డిగ్రీ బీఎస్సీ ఆనర్స్‌లో జువాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఫిషరీస్ సబ్జెక్టుల్లో ఒక దానిని మేజర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకొని పాలిటిక్స్, హిస్టరీ, ఎకనామిక్స్, వంటి ఆర్ట్స్ గ్రూపుల్లోని సబ్జెక్ట్‌లను మైనర్ సబ్జెక్ట్‌లుగా ఎంపిక చేసుకోవచ్చు.
- అలాగే ఇంటర్‌లో ఎంపీసీ చదివిన విద్యార్థి డిగ్రీ ఆనర్స్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్, స్టాటిస్టిక్స్, జియాలజీల్లో ఒక దానిని మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుని మైనర్ సబ్జెక్టుగా డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యానిమేషన్స్ తదితర సబ్జెక్టుల్లో ఒక దానిని అభ్యసించవచ్చు.
- బీకాం ఆనర్స్‌లోనూ ఇదే రీతిలో సబ్జెక్ట్‌లను ఎంపిక చేసుకునే వెసులుబాటు నూతన విధానంలో డిగ్రీ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

నూతన విధానంతో ప్రయోజనాలు



డిగ్రీ నూతన ఆనర్స్ విధానంలో చదివే విద్యార్థులకు విస్తృతమైన ప్రయోజనాలున్నాయి. ఆనర్స్ విత్ రీసెర్చ్ చేస్తే పోస్టు గ్రాడ్యుయేషన్ చేయకుండా నేరుగా పీహెచ్‌డీ చేసే అవకాశముంది. అలాగే నాలుగేళ్ల ఆనర్స్ కోర్సు చేసిన విద్యార్థి పీజీ ఏడాదిలోనే పూర్తి చేయవచ్చు. డిగ్రీ చదివే విద్యార్థులు మేజర్ సబ్జెక్ట్‌కు సంబంధించి మొత్తం 21 పేపర్లు, మైనర్ సబ్జెక్ట్‌కు సంబంధించి ఆరు పేపర్లు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. విద్యార్థి మొదటి ఏడాది తరువాత కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్, ద్వితీయ సంవత్సరం తర్వాత షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ అనంతరం సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది.

– డాక్టర్ వీ నారాయణరావు, విద్యావేత్త

ప్రవేశాల షెడ్యూల్ ఇలా..

- డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 12వ తేదీ వరకూ గడువును పెంచారు.
- విద్యార్థులు ఏపీఎస్‌సీహెచ్‌ఈ.జీఓవీ.ఇఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. లేదా దగ్గరలోని డిగ్రీ కళాశాలలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- జూలై 15 నుంచి 19వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు.
- జూలై 24వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. అదే రోజు తరగతులు ప్రారంభం


ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..

కృష్ణావిశ్వవిద్యాలయం పరిధిలో సుమారు 120 వరకూ వివిధ కోర్సులను అందించే కళాశాలలు కొనసాగుతున్నాయి. అందులో 90 వరకూ కళాశాలలు సాధారణ డిగ్రీ కోర్సులను విద్యార్థులకు అందిస్తున్నాయి. అలాగే ఉమ్మడి జిల్లాలో సుమారు ఎనిమిది వరకూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా మిగిలినవి ప్రైవేట్, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో కొనసాగుతున్నాయి. ఈ కళాశాలల్లో సుమారుగా 20 వేల వరకూ మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు అవకాశముంది.

దారులన్నీ ఇంద్రగిరికే..



అమ్మవారి ఉత్సవ మూర్తికి సారె సమర్పిస్తున్న భక్త బృందాలు



ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి

- భక్తులతో కిక్కిరిసిన దుర్గమ్మ సన్నిధి
- రికార్డు స్థాయిలో అమ్మవారికి సారె

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు రికార్డు స్థాయిలో సారెను సమర్పించారు. నగరవాసులతో పాటు పలు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి సారెను సమర్పించాయి. నగరంలోని ఏ ఇంట చూసినా, ఏ వీధిలో చూసినా అమ్మవారి సన్నిధికి బయలుదేరిన భక్త బృందాలే దర్శనమిచ్చారు. ఆదివారం ఒక్క రోజే సుమారు 150కి పైగా భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించగా, సుమారు 80 నుంచి 90 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

దర్శనానికి నాలుగు గంటలు

ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. భక్తుల రద్దీతో మహా మండపం లిఫ్టులను సైతం దేవస్థాన అధికారులు నిలిపివేశారు. దీంతో మహా మండపం మెట్లు, పాత మెట్లు, ఘాట్‌రోడ్డు మీదగా భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. సర్వ దర్శనం, రూ. 500, రూ. 300, రూ. 100 టికెట్లు క్యూలైన్లు ఏ మార్గంలోనైనా అమ్మవారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టిందంటే రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. క్యూలైన్లు త్వరత్వరగా ముందుకు నడిచేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ అమ్మవారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది.

సారె సంబరం..

ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమైన అమ్మవారి సారె సంబరం రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. ఆలయానికి చేరుకున్న భక్తులు క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకుని మహా మండపం 6వ అంతస్తులో సారె సమర్పించే కార్యక్రమాన్ని ముగించడానికి గంటల తరబడి సమయం పట్టింది. దర్శనం పూర్తయిన భక్తులతో పాటు అమ్మవారికి సారె సమర్పించి తిరుగు ప్రయాణం అయ్యే భక్తులను మల్లికార్జున స్వామి వారి ఆలయం మెట్ల మార్గం ద్వారా కిందకు పంపారు.

ఆలయం చుట్టూ భక్త బృందాలు

అమ్మవారికి సారెను తీసుకువచ్చిన భక్తులను ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించారు. అయితే ఆదివారం ఒక్కసారిగా సాధారణ భక్తులు, భక్త బృందాలు కొండకి చేరుకోవడంతో ఆలయ పరిసరాలన్నీ కిటకిటలాడాయి. భక్త బృందాలను ప్రత్యేక మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించడం, అదే సమయంలో సాధారణ భక్తుల క్యూలైన్ నిలిచిపోయింది. దీంతో అంతరాలయం దర్శనం నిలిపివేయాలని ఈవో భ్రమరాంబ ఆదేశాలు జారీ చేశారు. అయితే అప్పటికే రూ. 500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు మహా మండపం మెట్లు, ఘాట్‌రోడ్డులోని క్యూలైన్‌లో చిక్కుకుపోయారు. మరో వైపున భక్తుల రద్దీ సమయంలోనూ దేవస్థానం అంతరాలయం పేరిట రూ. 500 టికెట్లను విక్రయించడంతో పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నెహ్రూనగర్: రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీజీఈఎఫ్ (ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవపాల్ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం ఆదివారం అరండల్ పేటలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలను సాధించుకోవడానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రతి జిల్లా, మండలంలో సచివాలయ ఉద్యోగుల కార్యవర్గం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఐకమత్యంగానే ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ సంఘ నాయకులు భాస్కర్‌రెడ్డి, దేవపాల్, రామకృష్ణ, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు బత్తుల అంకమ్మరావు, బి.ఆర్.ఆర్.కిశోర్, విప్పర్తి అఖిల్, కృష్ణ, భార్గవ్, సుతేజ్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరవపాల్

ఆకట్టుకున్న పద్యనాటక ప్రదర్శనలు

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఏర్పాటు

విజయవాడ కల్చరల్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శ్రీ సాయిబాబా నాట్యమండలి, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం ప్రదర్శించిన శివలీలలు (మోహినీ భస్మాసుర) పద్యనాటకం నాటక వైభవాన్ని చాటింది. లక్ష్మీ కల్యాణి, మోహిని, శేషయ్య యాదవ్, సురేష్, విక్టర్ బాబు, అరుణ్ కుమార్, ఆంజనేయులు నటించారు. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. రంగస్థల ప్రముఖుడు దత్తు మాట్లాడుతూ నాడు వైఎస్సార్ అందించిన సంక్షేమ పథకాలు నేటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ కైకలూరు నియోజకవర్గ నాయకులు బి.బాబేలు రాజు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం వైఎస్సార్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు.



మోహినీ భస్మాసురనాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

క్లుప్తంగా

ఇంటెలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ అధ్యక్షుడిగా మట్టా



గన్నవరం: ఇంటెలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియోజకవర్గంలోని బాపులపాడు మండలం ఎస్ఎన్. పాలెంకు చెందిన న్యాయవాది మట్టా విద్యార్థి నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్నామ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు గద్దం బాపిరాజు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ ఇప్పటి వరకు సంఘ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తనకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. రానున్న రోజుల్లో రాష్ట్ర కార్యవర్గాన్ని, 26 జిల్లాల కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, మేధవులు, ఉద్యోగులు, మహిళలు అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు మృతి

కంచికచర్ల: తండ్రి మందలించాడని కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు... మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన శంకుల రాము (37) గ్రామంలో కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. ఇటీవల ఎద్దులను అమ్ముకొన్నాడు. ఎద్దులు ఎందుకు అమ్మావని తండ్రి ప్రశ్నించాడు. దీంతో రాము మనస్తాపం చెంది ఈ నెల 5వ తేదీన ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ప్రతినిధులు



అమ్మవారికి సారె సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన పాలక మండలి సభ్యురాలు మాధవీకృష్ణ తదితరులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు పుష్కలంగా పండాలని, చేతి వృత్తులు అభివృద్ధి చెందాలని కోరుతూ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించామని ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తోలేటి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తికి సారె సమర్పించారు. అనంతరం చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు. సంఘ నాయకులు జేసీ ప్రసాద్, ఖజానా వెంకట శేషయ్య, ప్రసాద్, సున్నం మల్లికార్జున్, జవ్వాది సుధీర్, బ్రహ్మం, సున్నపు భ్రమరాంబ, వేముల రేణుక తదితరులు పాల్గొన్నారు. దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ బృందం సభ్యులు అమ్మవారికి సారెను సమర్పించారు. పాయకాపురం కనక దుర్గ దేవస్థానానికి చెందిన 160 మంది, గుంటూరు జయలక్ష్మి బృందానికి చెందిన 100 మంది, కృష్ణలంకకు చెందిన సీతారామ సేవా సంఘానికి చెందిన వంద మంది, విజయవాడ కాత్యాయని బృందానికి చెందిన వంద మందితో పాటు విజయవాడ, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి సుమారు 3 వేల మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించాయి. బృందాలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు.

పది మంది గంజాయి విక్రయదారుల అరెస్టు

మైలవరం: గంజాయి విక్రయదారులపై పోలీసుల నిఘా ఎల్లవేళలా ఉంటుందని మైలవరం డివిజన్ ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి కలిగి ఉన్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 2.700 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి కేసులో పట్టుబడిన వారిపై కఠిన సెక్షన్లు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైలవరం సీఐ మోహన్ రెడ్డి, మైలవరం, జి.కొండూరు ఎస్ఐలు హరిప్రసాద్, ధర్మరాజుల పనితీరును ప్రశంసించారు. గంజాయి రవాణాదారులను పట్టుకోవడంలో చురుగ్గా పనిచేసిన పోలీస్ సిబ్బందికి ఏసీపీ రమేష్ అభినందనలు తెలిపారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నైనవరం ఫ్లై ఓవర్ వద్ద గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యంకు సమాచారం అందింది. దీంతో సీఐ నిఘా పెట్టగా, ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, పంజా సెంటర్‌కు చెందిన షేక్. నిజాముద్దీన్, భవానీపురానికి చెందిన బి.రవితేజగా గుర్తించారు. నిందితుల వద్ద ఉన్న సంచి తనిఖీ చేయగా గంజాయి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మైలవరంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్, చిత్రంలో సీఐ, ఎస్ఐలు

త్వరలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సింహాద్రి



కిడ్నీ డయాలసిస్ కేంద్రం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: త్వరలోనే అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలోని బ్లడ్‌బ్యాంక్ భవనంలో జరుగుతున్న డయాలసిస్ కేంద్రం పనులను ఎమ్మెల్యే సింహాద్రి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రకటించిన విధంగా డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నట్టు చెప్పారు. ఈ సెంటర్ ప్రారంభమైతే దివిసీమ ప్రాంత పేషెంట్స్ డయాలసిస్ కోసం విజయవాడ, గుంటూరు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవనిగడ్డ వచ్చినపుడు హామీ ఇచ్చారని, స్థల ఎంపిక వల్ల కొంత ఆలస్యం అయిందన్నారు. అవనిగడ్డ బహిరంగసభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పారు. కోవిడ్ సమయంలో అవనిగడ్డలో ఏర్పాటు చేసిన సెంటర్ ఎందరో ప్రాణాలను కాపాడిందని తెలిపారు. కిడ్నీ డయాలసిస్ సెంటర్ కూడా కిడ్నీ రోగులకు వరప్రసాదమని పేర్కొన్నారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, మండల ఆకోప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నియోజవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత దుకాణంపై దుండగుల దాడి



ధ్వంసమైన అద్దాలను చూపిస్తున్న పైడేశ్వరరావు, బసవరావు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నేత వ్యాపార దుకాణంపై కొంత మంది దుండగులు దాడిచేసి ధ్వంసం చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు లోయ పైడేశ్వరరావు పామర్తినగర్ సెంటర్‌లో కర్రీస్ పాయింట్, పాల డెయిరీ నడుపుతున్నాడు. ఇటీవల అదే కాలనీకి చెందిన ములుగోని సాగర్ వీరి దుకాణం వద్ద రోడ్డుపై మద్యం మత్తులో వీరంగం సృష్టించడంతో పైడేశ్వరరావు మందలించాడు. దీంతో పైడేశ్వరరావుతో పాటు ఆతని కుటుంబ సభ్యులపై సాగర్ కక్ష పెంచుకున్నారు. ఉద్యోగానికి వెళ్లి తెల్లవారుజామున వచ్చే పైడేశ్వరరావు పెద్ద కుమారుడు వంశీపై దాడికి ప్రణాళిక రూపొందించారు. అయితే వంశీ డ్యూటీకి వెళ్లకపోవడంతో ఆదివారం ఉదయం 4 గంటలకు మాస్కులు ధరించి వచ్చిన సాగర్, ఆతను స్నేహితుడు హేమంత్, మరో వ్యక్తితో కలిసి షాపుపై దాడికి దిగారు. ఐరన్ రాడ్లుతో కర్రీ పాయింట్ అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. షాపు షట్టర్ పగులకొట్టే ప్రయత్నం చేయగా శబ్దాలు విని చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో పరారయ్యారు. ఈ ఘటనపై పైడేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ధ్వంసం చేసిన దుకాణాన్ని ఉప సర్పంచ్ వేల్పూరి వెంకటబసవరావు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పరిశీలించారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు.

ఆధిక్యంలో ప్రకాశం జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్ కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–19 బాలుర టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధించింది. ప్రకాశం జట్టు తన ఓవర్‌నైట్ స్కోర్ 9 వికెట్ల నష్టానికి 437 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు రెండో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 302 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని కె.రేవంత్‌నాగ్ 103 పరుగులు చేయగా, హర్షవర్ధన్ 54, హర్షసాయితేజ 38 పరుగులు సాధించారు. ప్రకాశం బౌలర్లు జి.గురుపార్థసారధి, పి.దుర్గాబాలాజీ చేరో 3 వికెట్లు సాధించగా, ఎం.అభినవ్‌కు రెండు వికెట్లు లభించాయి.

ఇరువర్గాల దాడిలో ఐదుగురికి గాయాలు

- పాత గొడవలతో తుర్లపాడులో ఘర్షణ
- 15 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు

నందిగామ టౌన్(చందర్లపాడు): పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో ఐదుగురికి గాయాలైన ఘటన చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన సమాచారం మేరకు... గ్రామానికి చెందిన దాసరి జోసఫ్ (సురేష్), దాసరి రాంబాబు పాత గొడవలు మనసులో పెట్టుకుని శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన పోపూరి విజయ్ (బాబి)పై సుబాబుల్ కర్రలతో దాడి చేశారన్నారు. అంతే కాకుండా దాసరి మరియదాసు, అతని సోదరుడు కుమార్తె పవిత్ర తన భర్త గంటయ్యతో విభేదించి తండ్రితో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీటితో పాటు పాత గొడవల దృష్ట్యా దాసరి మరియదాసు తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి వద్ద ఉండగా పోపూరి గంటయ్య, ప్రభు, సురేష్, బాబురావు, బాబి మరి కొంత మందితో వచ్చి రెండు వర్గాలుగా విడిపోయి ఒకరినొకరు కర్రలతో దాడి చేసుకోవటంతో ఐదుగురికి గాయాలయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు గంటయ్య, ప్రభు, సురేష్, బాబురావు, బాబిలతో పాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో జాయింట్ కమిషనర్



మోపిదేవిలో స్వామివారి సేవలో జాయింట్ కమిషనర్ మూర్తి దంపతులు



ఆలయ ఏసీ చక్రధరావుకు వెండి వస్తువులు అందజేస్తున్న భక్తులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని ఎండోమెంట్ హెడ్ ఆఫీస్ జాయింట్ కమిషనర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఏసీ ఎస్ఎస్ చక్రధరావు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ ఏసీ చక్రధరావు స్వామివారి చిత్రపటం, లడ్డుప్రసాదాలు అందించి, శాలువా కప్పి సత్కరించారు.

స్వామివారికి వెండి వస్తువులు సమర్పణ...

మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి పల్నాడు జిల్లా, నరసరావుపేట వాస్తవ్యులు ఆతుకూరి అమర లింగేశ్వరావు రెండు కిలోల వెండితో తయారుచేసిన వస్తువులు సార్వాంగం–1, కిరీటాలు–3, హస్తాలు–4, పాదం –1, వేలాయుదం –1 సమర్పించుకున్నారు. ఈ వస్తువులు ఆలయ ప్రాంగనంలో ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరావుకు అందచేశారు. వెండి వస్తువులు అందచేసిన భక్తులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.


రెండో రోజూ కొనసాగిన ఏసీఏ సెంట్రల్ జోన్ మ్యాచ్‌లు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సెంట్రల్ జోన్ అంతర జిల్లా మల్టీడే (మూడు రోజుల) సీనియర్ పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం రెండోవ రోజు కొనసాగాయి. కృష్ణా, గుంటూరు జిల్లాలకు డీవీఆర్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కృష్ణా జట్టు 58.2 ఓవర్లకు 208 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మెన్‌లు చంటి 34, కౌశిక్ 34, సాయిఅఖిల్ 27 రన్స్ చేయగా, గుంటూరు బౌలర్లు శ్రీనివాస్ నాలుగు, సిద్ధార్థ రెండు వికెట్లు తీశారు. అనంతరం జరిగిన రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 55 ఓవర్లకు రెండు వికెట్లు నష్టపోయి 262 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు మహీప్‌కుమార్ 107 (నాటౌట్), సమన్విత్ 56, వంశీ 51, మనోహర్ 33 (నాటౌట్) రన్స్ చేశారు. సీపీ మైదానంలో ప్రకాశం, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. రెండో రోజు తొలుత బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 46.5 ఓవర్లకు 145 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మెన్ కిరణ్ 59 రన్స్ చేయగా పశ్చిమగోదారి జట్టు బౌలర్లు రాజు ఐదు, మునిష్‌వంశీ నాలుగు వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పశ్చిమ గోదావరి జట్టు 70 ఓవర్లకు ఎనిమిదివికెట్లు నష్టపోయి 224 రన్స్ చేసింది. బ్యాట్స్‌మెన్‌లు జగదీష్ 71, రక్షణ 43 రన్స్ చేయగా ప్రకాశం బౌలర్లు నవీన్ నాలుగు, వెంకట్ రెండు వికెట్లు తీశారు. నేటితో ఈ మ్యాచ్‌లు ముగియనున్నాయి.

వీఆర్వోల సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడరూరల్: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం విజయవాడలో జరిగింది. రాష్ట్ర సంఘం అధ్యక్షుడిగా కోన ఆంజనేయకుమార్ (చంటి), ఉపాధ్యక్షులుగా తొర్లికొండ శంకర్, పీఎస్ఎస్ఎస్ ప్రసాద్, బి.రాముడు, మద్దు హజరతయ్య, కొమ్మా వేదాంతరావు, ప్రధాన కార్యదర్శిగా జి.అనుపమ, ఉప ప్రధాన కార్యదర్శిగా కేఏ చారి, కోశాధికారిగా వీఎస్ జాన్సన్ ప్రదీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కె.చిన్నారావు, నవీన్‌కుమార్, సుదర్శి హరిబాబు, పి.శ్రీనివాసరావు, రాజబాబు, ప్రచార కార్యదర్శులుగా ఎం.కోటేశ్వరావు, షేక్ ఆయూబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాఘవరెడ్డి, వంశీకృష్ణా, షరీఫ్, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శులుగా రాజారెడ్డి, బి.శ్రీనివాసరావు, నలుగురు కార్యనిర్వాహక సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడి మృతి



తిరువూరు: జాతీయ రహదారిపై ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని భవన నిర్మాణ రంగ కార్మికుడు మృతి చెందాడు. సత్తుపల్లిలో భవన నిర్మాణ పనికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి తిరువూరు వస్తున్న గొల్లమందల మధు (26) ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద ఆగివుండగా, వెనుకగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. రోడ్డుపై పడిపోయిన మధుపైకి విజయవాడ నుంచి భద్రాచలం వైపు వెళుతున్న కారు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈవో హేమలతాదేవిపై విచారణ

సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించిన డీసీ



ఆలయ దుకాణదారులతో మాట్లాడుతున్న డీసీ విజయరాజు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) గత కార్యనిర్వహణాధికారి హేమలతాదేవిపై వచ్చిన ఆరోపణలపై దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం విచారణ చేపట్టారు. ఆ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో డెప్యూటీ కమిషనర్ విజయరాజు, ఎన్టీఆర్ జిల్లా సహాయ కమిషనర్ శాంతి తదితరులు విచారణ జరిపారు. పాతశివాలయం ఉపాలయంగా ఉన్న సిద్ధిగణపతి, సత్యనారాయణస్వామి ఆలయానికి చెందిన దుకాణ సముదాయంలోని అద్దెదారుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.44 లక్షల మేర అద్దెలు తీసుకున్నారని, వాటికి ఎటువంటి రశీదులివ్వలేదని పాత ఈవోపై డీసీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆలయంలో ఆంజనేయస్వామి ఉపాలయానికి రూ.25 లక్షలతో ధ్వజ స్తంభం వేయించానని దాత అధికారులకు ఫిర్యాదు చేశారు. దానికి సంబంధించి దేవదాయ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా అనుమతి లేకుండా కొంతమంది సిబ్బందిని చేర్చుకొని వారికి నిబంధనలకు విరుద్ధంగా జీతాలు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. ఆలయంలో కార్యక్రమాలు ఆగమోక్తంగా జరగటం లేదని వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. వాటిపై వివరణ ఇవ్వాలని విజయరాజు హేమలతాదేవిని ఆదేశించారు. బుధవారం మరోసారి విచారణ జరుపుతామని ఆయన మీడియాకు వివరించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న హేమలతాదేవి వివరణను, రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

వలంటీర్‌ను అభినందించిన ప్రవీణ్ ప్రకాష్



వలంటీర్ కల్పనను అభినందిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

గుడివాడ టౌన్:వంద శాతం అక్షరాస్యత సాధనకు కృషి చేసిన వలంటీర్‌ను రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అభినందించారు. నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో శనివారం పాల్గొన్న ఆయన రాత్రి 28వ వార్డు బేతవోలు–2 సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న యండ్రపు కల్పన ఇంటికి వెళ్లి అభినందించారు. విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా బడిఈడు పిల్లలను బడిలో చేర్పడం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ నేపథ్యంలో కల్పన తన సెక్టార్‌లో ఉన్న 5 నుంచి 18 ఏళ్ల వయస్సు గల పిల్లలు 21 మందిని గుర్తించి వారి వారి అర్హతల ప్రకారం పాఠశాలల్లో చేర్పేందుకు కృషి చేశారన్నారు. ఈ విషయాన్ని తాను ఆన్‌లైన్‌లో గుర్తించానని తెలిపారు. ప్రవీణ్ ప్రకాష్ ఆమె ఇంటికి వెళ్లి ఎన్‌రోల్ చేసిన విధానాన్ని అడిగి తెలుసుకుని ఎవరు ఎక్కడ చేరారు.. ఏమి చదువుతున్నారు.. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓ సుబ్బారావు, ఎంఈఓ శేఖర్‌సింగ్, ఎంఈఓ–2 బాలాజీ, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, మున్సిపల్ ఇంజనీర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే శ్రీచైతన్య లక్ష్యం

- శ్రీ చైతన్యవిద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు
- ఉత్సాహంగా నీట్–2023 విజయోత్సవం



నీట్ ఆలిండియా ర్యాంకర్ వరుణ్ చక్రవర్తిని సత్కరిస్తున్న ఝాన్సీలక్ష్మి, సుష్మా

కంకిపాడు(పెనమలూరు): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా శ్రీచైతన్య విద్యా సంస్థ కృషి చేస్తుందని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు అన్నారు. స్ప్లెండోరియా నీట్–2023 విజయోత్సవ వేడుక కంకిపాడులోని అయానా ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. నీట్–2023 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించి ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు మాట్లాడుతూ పోటీ పరీక్షలు ఏవైనా శ్రీచైతన్య విద్యార్థులే టాప్‌గా నిలుస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రుల కలలు సాకారం దిశగా విద్యాసంస్థ కృషి చేస్తుందని తెలిపారు. బట్టీ పట్టే విధానంతో విద్యార్థుల ఉన్నతి, ఉత్తమ ఫలితాలు సాధ్యం కావన్నారు. పాఠ్యాంశాలను అర్థం చేసుకుని చదివితేనే గుర్తుండిపోయి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలు పెరగటానికి సోషల్ మీడియాలో కొన్ని రకాల ప్రచారాలు కూడా కారణమని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు విద్యార్థులను చైతన్యం చేస్తూ ఏకాగ్రాత వైపు మళ్లించాలని సూచించారు. చైర్‌పర్సన్ బొప్పన ఝాన్సీలక్ష్మీబాయి మాట్లాడుతూ ఏటా నీట్ ఫలితాల్లో నంబర్–1గా నిలిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ 38 ఏళ్ల శ్రీచైతన్య ప్రస్థానంలో 2023 కొత్త అధ్యాయానికి, చరిత్రకు నాంది పలికిందన్నారు. ఉత్తమ ఫలితాల కోసం అధ్యాపకులు, టెక్నికల్ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. నీట్ ఆలిండియా మొదటి ర్యాంకర్ వరుణ్ చక్రవర్తిని సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎగ్జిక్యూటివ్ డీన్స్, డీన్స్, ఏజీఎంలు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14న కాళీమాత అమ్మవారికి శాకంబరీదేవి అలంకారం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఈ నెల 14వ తేదీ శుక్రవారం కాళీమాత అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి జగదీష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలంకారానికి అవసరమైన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లును భక్తులు గురువారం ఉదయం 10 గంటల లోపు సమర్పించాలని కోరారు. సేకరించిన కూరగాయలతో అమ్మవారికి అలంకరిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి దయకు పాత్రులు కాగలరని కోరారు.

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

గుణదల(విజయవాడతూర్పు): దేవునికి విధేయులుగా ఉండే భక్తులందరూ ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించడం ద్వారా జీవితాల్లో దీవెనలు కలుగుతాయని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రదానాలయంలో ఆదివారం ఉదయం సమిష్టి దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ఆయన శిలువ మరణం ద్వారానే మన పాపాలకు పరిహారం లభించిందని చెప్పారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించడం ద్వారా భక్తుల జీవితాల్లో శాంతి సమాధానాలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఆదివారం సెలవ దినం కావడంతో పెద్ద సంఖ్యలో యాత్రికులు పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. మరియమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శాస్త్రోక్తంగా అరుణ హోమం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట గణపతిరావురోడ్డులో వేం చేసి ఉన్న శ్రీ పండరీ సాయిమందిరంలో సాయినాథుని సన్నిధిలో ఆదివారం సూర్యునికి ప్రీతికరమైన అరుణ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ పండరీసాయి మందిరం 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులు పాటు నిర్వహించిన పలు ప్రత్యేక కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి కాకడహారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం నిత్యాభిషేకం, విఘ్నేశ్వరపూజ, మండపారాధనలు, అరుణ జపం, అరుణ హోమాన్ని వైభవంగా అర్చకులు నిర్వహించారు. అలాగే స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాన్ని నిర్వహించి పుష్పార్చనను చేపట్టారు. సాయంత్రం బాబాకు దశహారతులతో ప్రత్యేక అర్చనా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వాహకులు జరిపారు. స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సాయి సన్నిధిలో సాయి సంకీర్తన గానాన్ని కొనసాగించారు. సాయంత్రం పల్లకీ సేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ ధర్మకర్త నాగోతి వెంకటరామకృష్ణ పర్యవేక్షించారు.

మొక్కల పెంపకంతో మానవ మనుగడ

గన్నవరంరూరల్: మొక్కల పెంపకంతో మానవ మనుగడ ముడిపడి ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. విజయభూషణ్ కుమార్ మాట్లాడుతూ భూ తాపం నియంత్రణకు, పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. విద్యాలయాలు, ప్రజల ఆవాస ప్రాంతాలు మొక్కలతో నిండాలని ఆకాంక్షించారు. మొక్కలు పెంచడానికి కృషి చేసే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. సీనియర్ రొటేరియన్లు చింతపల్లి సీతారామయ్య, గన్నే వెంకట్రావు, సర్పంచ్ గణపవరపు కాంతి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గణపవరపు వెంకయ్య, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు ప్రసాద్, మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిమట రామారావు, గన్నవరం గ్రంథాలయం కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు మొక్కలు నాటారు. హెచ్ఎం కెఎస్ జగదీశ్వరరావు, టీఎస్ఆర్‌కే ప్రసాద్, హాస్టల్ వార్డెన్ డానియేల్, సీఆర్పీ కాండ్రు మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీల్లో సేవలు భేష్

- తూర్పులో 10 యూపీహెచ్‌సీలు
- అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- ప్రతి రోజూ 60 నుంచి 100 మందికి పరీక్షలు



భ్రమరాంబపురంలో నిర్మించిన ఆధునిక యూపీహెచ్‌సీ భవనం



లబ్బీపేట యూపీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పించింది. పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడంతో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లుగా ఉన్న యూహెచ్‌సీ(అర్బన్ హెల్త్ సెంటర్లు) ఇప్పుడు వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా రూపాంతరం చెంది పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నాయి. ప్రతి సెంటర్‌లో వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఫార్మశిస్టు, డేటాఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్‌గ్రేడ్ వర్కర్ సేవలు అందిస్తున్నారు. అంతేకాదు ప్రసవాలు సైతం చేసే స్థాయిగా చేరుకున్నారు. ఇటీవల సింగ్‌నగర్ యూపీహెచ్‌సీలో తొలిసారిగా ప్రసవం చేశారు.

మూడింటికి కొత్త భవనాలు

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 10 వైఎస్సార్ యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. భ్రమరాంబపురం, కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వరనగర్, లబ్బీపేట, పటమట అంబేడ్కర్‌కాలనీ, పటమటలంక, ఏపీఐఐసీ కాలనీ, క్రీస్తురాజుపురం, గుణదల గంగిరెద్దుల దిబ్బ, గులాంమొహిద్దీన్‌నగర్‌లలో సేవలు అందిస్తున్నాయి. వాటిలో భ్రమరాంబపురం, గుణదల గంగిరెద్దుల దిబ్బ, ఏపీఐఐసీ కాలనీల్లో ఒక్కో సెంటర్‌కు రూ.కోటిన్నర వ్యయంతో నూతన భవనాలు నిర్మాణం చేపట్టారు. వాటిలో డాక్టర్స్ రూమ్‌లు, 10 పడకలతో వార్డు, ల్యాబొరేటరీ వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

పెరిగిన ఓపీ రోగులు

ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉండటంతో అవుట్‌పేషెంట్స్ సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఒక్కో కేంద్రంలో ప్రతి రోజూ 60 నుంచి 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి రోగికి ఎలక్ట్రానిక్ రికార్డులు రూపొందిస్తూ ఐడీని క్రియేట్ చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ రికార్డులు రూపొందించడంలో యూపీహెచ్‌సీలు ముందున్నాయి.

అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు, 172 రకాల మందులు అందుబాటులో ఉంచారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం అత్యాధునిక పరికరాలను సమకూర్చడంతో పాటు, వాటిపై పరీక్షలు చేసేందుకు అనుభవజ్ఞులైన ప్రొఫెసర్‌లతో ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శిక్షణ ఇప్పించారు. దీంతో గర్భిణులు, బాలింతలు, రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నారు.

అన్ని సేవలు అందిస్తున్నాం



ప్రతి రోజూ 50 నుంచి 60 మంది వివిధ అనారోగ్య సమస్యలతో మా వద్దకు రోగులు వస్తుంటారు. వారికి పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తుంటాం. ప్రతి రోగికి ఎలక్ట్రానిక్ రికార్డులు క్రియేట్ చేస్తున్నాం. అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం.

– డాక్టర్ మెబిన్, వైద్యాధికారి, లబ్బీపేట యూపీహెచ్‌సీ

సేవలు బాగున్నాయి



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు జబ్బు చేస్తే పెద్దాస్పత్రికి పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటి సమీపంలోని ఆస్పత్రిలోనే మెరుగైన వైద్యం అందుతుంది. దీంతో ఎంతో మంది సేవలు పొందగలుగుతున్నారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని బాగుచేసింది.

– షేక్ సుభాని, స్థానికుడు, లబ్బీపేట

పేదలకు నాణ్యమైన వైద్యం



ఒకప్పుడు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళితే అక్కడ ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదు. పెద్దాస్పత్రికి వెళ్లమని చెప్పేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అన్ని రకాల జబ్బులకు ఇక్కడే వైద్యం చేస్తున్నారు. ఏదైనా పెద్ద సమస్య ఉండే ప్రభుత్వాస్పత్రికి వెళ్లమని సూచిస్తున్నారు. కాలనీలో నివశించే పేదలకు యూపీహెచ్‌సీల్లో మంచి వైద్యం అందుతుంది.

–సీహెచ్ విజయ్‌ఆనంద్‌కుమార్, స్థానికుడు, ఫకీరుగూడెం

విద్యతోనే సమాజంలో ఉన్నత స్థితి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు తదితరులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సమాజంలో ఉన్నత స్థితి పొందాలంటే అది విద్యతోనే సాధ్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో అమరావతి బ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆదివారం నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం సేవలను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద వాడు ఉన్నత చదువులు చదవాలనే ఆకాంక్షతో అమ్మ ఒడి, నాడు–నేడు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలకు కోట్లాది రూపాయాలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం నిర్వాహకులకు ఎమ్మెల్యే రూ.5 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి, సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, డాక్టర్ కుంద శ్రీధర్, డాక్టర్ గురునాథ శర్మ, ఊటుకూరి పార్థసారథి, పోపూరి సుబ్బారావు, అనుముల రాంబాబు, సూర్యనారాయణ శాస్త్రి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో జనరంజక పాలన

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



12వ డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న దేవినేని అవినాష్, నాయకులు

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా అమలు చేసి ప్రజలకు జనరంజక పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 12వ డివిజన్ 51వ సచివాలయం పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీర సావర్కర్ రోడ్డు, నేతాజీ రోడ్డు ప్రాంతాల్లో నాయకులతో కలిసి పర్యటించిన అవినాష్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాల కరపత్రాలు అందజేశారు.

అభివృద్ధిపై టీడీపీకి సవాల్..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో టీడీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. ఆ పార్టీ నాయకులు దోచుకువడం, దాచుకోవడం చందంగా పాలన సాగించారని ధ్వజమెత్తారు. నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏమి చేసిందో గర్వంగా చెబుతూ గడప గడపకు వెళుతున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏమి చేశారో చెప్పే దమ్ము మీకుందా అని టీడీపీ నాయకులకు అవినాష్ సవాల్ విసిరారు. ఈ నాలుగేళ్లలో తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి రూ.500 కోట్లకు పైగా వెచ్చించి నూతన రోడ్లు, కొండ ప్రాంత అభివృద్ధి, డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణాలు, ఇంటింటికీ మంచినీటి కుళాయిలు, ముఖ్యంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. నాడు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభివృద్ధి చేస్తే నేడు మేము అభివృద్ధి చేసే అవసరం ఉండేది కాదని పేర్కొన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయి కదా అని పగటి వేషగాళ్ల మాదిరి టీడీపీ నాయకులు నాటకాలు ఆడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి వచ్చారని దుయ్యబట్టారు.

టీడీపీ ఎన్ని డ్రామాలు వేసిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజల సంపూర్ణ మద్దతుతో రాష్ట్రంలో, తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురడం ఖాయమని అవినాష్ ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో 12వ డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్, నాయకులు ధనేకుల కాళీ, రఫీ, బాషా, రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



కేక్ కట్ చేస్తున్న దేవినేని అవినాష్, అడపా శేషు, బెల్లం దుర్గ

కృష్ణలంక(విజయవాడతూర్పు): టైలర్స్ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగరపాలకసంస్థ పాఠశాల వద్ద న్యూ విజయవాడ టైలర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కుట్టుమిషన్ సృష్టికర్త ఇలియమ్స్ హోవే 204వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న అవినాష్, అడపా శేషు, బెల్లం దుర్గ హోవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టైలర్ షాపు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.10వేలు ఇస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. టైలర్స్‌కు అసోసియేషన్ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు, టైలర్స్‌కు ట్రైనింగ్ కుట్టుశిక్షణా కేంద్రం ఏర్పాటు చేసేందుకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కాకర్లపూడి వెంకటేశ్వర రాజు(తేజస్వి రాజు)ను అభినందించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వీనస్ బాబు, కొండేటి వెంకట్రావు, తిరుమాని ఆనంద రావు, భాస్కరరావు, గణేష్, అప్రోజ్, మెట్రో బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో ప్రత్యేక పూజలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆషాఢ మాసం సందర్భంగా రాణిగారితోట, 18వ డివిజన్‌లోని త్రిశక్తి పీఠంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు సమర్పించి వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుహృదయ దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం



బిషప్ జోసఫ్ రాజారావును సత్కరిస్తున్న సంఘ పెద్దలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రసిద్ధి చెందిన లబ్బీపేటలోని యేసు తిరుహృదయ దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ మహోత్సవంలో విజయవాడ కథోలిక పీఠం బిషప్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు పాల్గొని దివ్యపూజాబలి సమర్పించారు. రెవరెండ్ ఫాదర్ చిన్నప్ప, రెవరెండ్ ఫాదర్ జాన్‌రాజ్, లబ్బీపేట విచారణ ఫాదర్ ఎం.గాబ్రియేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ మరియమ్మ, యేసుక్రీస్తు ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు కిరణ్‌రాజు, బుర్రి బాబూరావు, రాణి, ఉదయ్, బుర్రి జగజ్జీవన్‌రావు, దున్న నవీన్, మరియదల సభ్యులు, యూత్ సభ్యులు బిషప్ జోసఫ్ రాజారావును ఘనంగా సత్కరించారు.

దివ్య కారుణ్యమూర్తి స్వరూపం ఆవిష్కరణ

లబ్బీపేట క్యాథలిక్ సెంటర్ పరిధిలోని జార్జిపేటలో ఏర్పాటు చేసిన దివ్య కారుణ్యమూర్తి(యేసుక్రీస్తు) స్వరూపాన్ని బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లబ్బీపేట విచారణ గురువులు ఫాదర్ ఎం.గాబ్రియేలు, సంఘ పెద్దలు పరంగి ఇశ్రాయేలు, బుర్రి జగ్జీవన్‌రావు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాలపై కేసు

ఉంగుటూరు: గారపాడులో ఓ స్థలం విషయంలో ఇరువర్గాల ఫిర్యాదుపై ఉంగుటూరు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గారపాడులో 15సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని చౌటపల్లి రవికుమార్ తన స్థలమేనంటూ నిర్మాణపనులు చేపట్టాడు. దీనిపై గ్రామస్తులు ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేసేందుకు నిర్ణయిస్తే ఆ స్థలం చుట్టూ దడులు ఎందుకు కడుతున్నావని రవి కుమార్‌ను నిలదీశారు. దీంతో ఈ స్థలం తనదేననని అందుకే తాను నిర్మాణం పనులు చేసుకుంటున్నాని చెప్పాడు. దీనిపై ఇరువర్గాల మధ్య వివాదం తారాస్థాయికి చేరడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఘటనపై ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉంగుటూరు ఎస్ఐ జి.రాజు పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సీడీపీవో జి.మంగమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ 21వ డివిజన్ కరకట్ట -6 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు బీసీ-ఎ, 2వ డివిజన్ మాచవరంలో ఒక ఎస్సీ, 2వ డివిజన్ కార్మిక నగర్- ఓసీ, 7వ డివిజన్ ఉడ్ పేట ఎస్సీ, 9వ డివిజన్ కాకాని నగర్ బీసీ-బి, 14 డివిజన్ అంబేడ్కర్ నగర్‌కు ఓసీ, 16 డివిజన్ మధుసూదన నగర్ బీసీ-డి, 17 డివిజన్ ద్వారకానగర్-1 ఎస్టీ, 17వ డివిజన్ కరకట్ట-5 ఓసీ, 18 డివిజన్ తారకరామానగర్‌కు బీసీ-ఎ, 22వ డివిజన్ భ్రమరాంబపురం బీసీ-ఈ, 22 డివిజన్ భ్రమరాంబపురం-3కు ఓసీ కేటగిరిలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ పోస్టులకు జూలై 1వ తేదీ 2023 నాటికి 21 – 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణత పొంది, స్థానికంగా నివాసం కలిగి వివాహితురాలై ఉండాలన్నారు. నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డులను దరఖాస్తు ఫారంతో జత చేసి ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కానూరులోని సీడీపీవో, విజయవాడ రూరల్ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలన్నారు.

అత్తింటి వేధింపులపై పలు కేసుల నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అత్తింటి వేధింపులపై ఆదివారం మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వించిపేట కట్టా వారి వీధికి చెందిన చిట్టూరి యామినిని లోకేష్ కృష్ణప్రకాష్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అని చెప్పి కట్నంగా రూ.15 లక్షలు, బంగారం, ఇతర లాంఛనాలు తీసుకున్నారు. యామినిని మరిది అఖిల్, అత్త జయశ్రీ, మామ రంగారావులు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అత్త, భర్తలపై కేసు నమోదు

చిట్టినగర్ సొరంగం రోడ్డులోని మీనా స్టూడియో ప్రాంతానికి చెందిన మువ్వల మీనాని గుంటూరు జిల్లా కారంపూడి కాసారం గ్రామానికి చెందిన సాంబశివారెడ్డికి ఇచ్చి 2017లో పెద్దలు వివాహం జరిపించారు. ఇద్దరు ఆడపిల్లలు సంతానం కలిగిన తర్వాత సాంబశివరావు మద్యం తాగుతూ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. ఎవరితో మాట్లాడినా వివాహేతర సంబంధాలు అంటకడుతూ శారీరకంగా హింసించసాగాడు. భర్త వేధింపులతో పాటు అత్త అనువాయమ్మ వేధింపులకు గురి చేయడంతో కొద్ది రోజుల కిందట మీనా పుట్టింటికి వచ్చేసింది. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భర్తపై ఫిర్యాదు

గర్భవతి అని కూడా చూడకుండా భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్.గౌస్య సుల్తానాకు 2016లో ఒంగోలుకు చెందిన మలక్ హుస్సేన్‌తో వివాహం జరిగింది. వీరికి మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. 2021లో బంధువుల వివాహానికి హాజరైన గౌస్య సుల్తానాకు విజయవాడకు చెందిన నషీర్ బాషా పరిచయం అయ్యాడు. నషీర్ బాషాకు వివాహం కాగా భార్యతో గొడవలు కారణంగా వేరుగా ఉంటున్నానని చెప్పి గౌస్యకు దగ్గర అయ్యాడు. పెద్దల సమక్షంలో వివాహం కాగా వేరుగా కాపురం పెట్టారు. గౌస్య గర్భవతి కావడంతో నషీర్ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. గౌస్యతో వివాహం గురించి నషీర్ తల్లిదండ్రులకు చెప్పకుండా మోసం చేయడమే కాకుండా వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కళాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి



వైఎస్ రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ అన్నారు. స్వరలయ సంగీత సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం బాల సుబ్రహ్మణ్యం 77వ జయంతి సందర్భంగా సినీ సంగీత విభావరి సీనియర్ గాయనీ గాయకులు వైఎస్ రామకృష్ణ దంపతులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ.. వైఎస్ రామకృష్ణ దేశ విదేశాల్లో 4 వేలకు పైగా కచేరీలు నిర్వహించారని తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ వేదిక ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నూతన గాయనీ గాయకులకు వేదిక అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వై.సుబ్రహ్మణ్యం, మోహన్ రాంప్రసాద్, ఎస్ఆర్ ప్రభాకర్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు బాల సుబ్రహ్మణ్యం ఆలపించిన పలు గీతాలను మధురంగా ఆలపించారు.

260 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కోనా వీరబ్రహ్మం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చికిత్స కన్నా నివారణ మేలని, ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఆయుర్వేద, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఏఈఎస్‌కే ప్రసాద్, డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య అవగాహన, వైద్యశిబిరంలో 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం, హోమియోపతిలో ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా చికిత్స చేయవచ్చునన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్య విషయాలపై అవగాహన పెంచుకోవటంతో పాటు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు. వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ మాట్లాడుతూ.. ప్రజల్లో ఆరోగ్య విషయాల్లో అవగాహన కల్పించటంతో పాటు ఉచితంగా ఆయుర్వేదం, హోమియోపతి, అల్లోపతి వైద్యనిపుణులచే వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య చంద్రభొట్ల, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై శ్రీ దుర్గా భవానీ నృత్య కళాశాలకు చెందిన అక్షిత, రమ్యశ్రీ, నవ్య, తన్విలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మద్యం అమ్మకాల్లో పూర్తి పారదర్శకతకు రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వానికి సంబంధించిన అన్ని మద్యం దుకాణాల్లో నగదుతో పాటు డిజిటల్ చెల్లింపులను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తోంది. రాష్ట్రంలో మొత్తం 29 డిపోల పరిధిలో 2,934 మద్యం దుకాణాలున్నాయి. వాటిలో 2,744 దుకాణాల్లో డిజిటల్ చెల్లింపుల కోసం డివైజ్‌లను ఏర్పాటు చేశారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త సంస్థ ఏపీటీ ఆన్‌లైన్ ద్వారా 2,116 డివైజ్‌లు, ఎస్‌బీఐ ద్వారా 628 డివైజులను అందుబాటులోకి తెచ్చారు. దాదాపు 50 శాతం మంది డిజిటల్ విధానంలోనే చెల్లింపులు జరుపుతున్నారు. మిగిలిన 190 మద్యం దుకాణాల్లో కూడా వారం రోజుల్లో డిజిటల్ చెల్లింపులను అందుబాటులోకి తేవాలని బెవరేజస్ కార్పొరేషన్ భావిస్తోంది. అలాగే అమ్మకాలు, ఇతర లావాదేవీలపై పూర్తి పర్యవేక్షణతో పాటు నిర్ణీత వేళల ప్రకారం మద్యం అమ్మకాలు జరిగేలా చూసేందుకు దుకాణాల్లో సీసీటీవీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు.

అరుదైన పాము 'కామన్‌కుక్రి' పట్టివేత



జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆదివారం కామన్‌కుక్రి అనే అరుదైన పామును పట్టుకున్నారు. ఓ వ్యాపారి ఇంట్లోకి పాము చొరబడగా ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సర్ప రక్షకుడు డాక్టర్ సదాశివయ్యకు సమాచారం అందించారు. దీంతో ఆయన తన శిష్యుడు రాహుల్‌ను పంపించగా.. ఆయన పామును పట్టుకుని కళాశాలకు తీసుకెళ్లారు. కామన్‌కుక్రి పాము ప్రమాదకరం కాదని, అయితే అవి ఈ ప్రాంతంలో తక్కువ సంఖ్యలో సంచరిస్తాయని సదాశివయ్య చెప్పారు. కుక్రి పామును అంతరించిపోతున్న పాముల్లో ఒకటిగా ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్- అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సంస్థ) గుర్తించింది. ఈ పాము ఎక్కువగా చెత్తాచెదారంలో ఉండి సాయంత్రం సమయంలో బయటకు వస్తుందని, విషరహిత సర్పమని పేర్కొన్నారు.

ప్రజలే బుద్ధి చెప్పే రోజొస్తోంది

- తప్పుడు వార్తలపై నిప్పులు చెరిగిన ప్రముఖులు
- ఈ పరిణామానికి ఫుల్‌స్టాప్ పడాలని స్పష్టీకరణ
- ఓ వర్గం మీడియా వైఖరి మార్చుకోవాలని సూచన



నగరంపాలెం (గుంటూరు): రాష్ట్రంలో ఒక వర్గం మీడియా ప్రజా వ్యతిరేక ధోరణులు, తప్పుడు కథనాల (ఫేక్ న్యూస్)పై ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్, ఫోరం ఫర్ బెటర్ సొసైటీ, బెటర్ ఆంధ్రప్రదేశ్ (బాప్), నవ్యాంధ్ర ఇంటలెక్చ్యువల్స్ ఫోరం, ఎడిటర్స్ అసోసియేషన్, జనవిజ్ఞాన వేదిక తదితర సంఘాల నేతలు మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికై పాలించే ప్రభుత్వాలను కొన్ని పత్రికలు, చానళ్లు శాసించడం సరికాదని హితవు పలికారు. ఈ పరిస్థితి దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఎక్కువగా కనిపిస్తోందన్నారు. ఇలాంటి పత్రికా యాజమాన్యాలు, టీవీ ఛానెళ్ల కుట్రను ప్రజలు గమనిస్తున్నారని.. త్వరలో బుద్ధి చెప్పే రోజులొస్తాయని వ్యాఖ్యానించారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు అధ్యక్షతన ఆదివారం గుంటూరు నగరంలోని మహాత్మాగాంధీ కళాశాల ఆవరణలో 'ఆంధ్రప్రదేశ్ మీడియా–నిరాధార, పక్షపాత వార్తలు– పర్యావసానాలు' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు ప్రముఖులు పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

ఇది అత్యంత ప్రమాదకరం

ఏపీలో రాజకీయ కక్ష సాధింపు చర్యలలో భాగంగా అబద్ధపు వార్తలు ఎక్కువగా వస్తున్నాయి. తప్పుడు వార్తలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఆ పత్రికలు, ఆ చానళ్లు చెప్పినట్టు ప్రజలు నడుచుకోవాలని చెప్పడం దుర్మార్గం. ఫేక్ న్యూస్‌పై యుద్ధం అనివార్యం.

– దొక్కా మాణిక్య వరప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు

జర్నలిజం సిగ్గుపడుతోంది

ప్రస్తుతం జర్నలిజం సిగ్గుపడే పరిస్థితి వచ్చింది. ఫేక్‌న్యూస్ ప్రచారం చేయడం కోసం అనేక కుట్రలు చేస్తున్నారు. ఒక విషయం కరెక్టా కాదా అనేది నిర్ధారించుకోకుండానే ప్రసారం, ప్రచారం చేస్తున్నారు. పెత్తందారులకు, యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరించడం సరైన పద్ధతికాదు.

– చందన మధు, బెజవాడ మీడియా సెంటర్ అధ్యక్షుడు

తప్పుడు సమాచారమిస్తే శిక్షించాలి

ప్రస్తుతం మీడియా ప్రపంచంలో అసత్యమనేది ఎక్కువగా రాజ్యమేలుతోంది. నిజం తెలిసేలోగా ఫేక్ న్యూస్ ప్రజల్లోకి వెళ్తుంది. ఇది ప్రభుత్వాలకు ఛాలెంజ్‌గా మారుతోంది. సోషల్ మీడియాలోని ఫేక్‌న్యూస్‌ను ప్రజలు గమనించాలి. తప్పుడు సమాచారం అందించే వారిని శిక్షించే రోజులు రావాలి.

– చందు సాంబశివరావు, బీజేపీ నేత

మీడియా వ్యాపారమైంది

ప్రస్తుతం మీడియా రంగం వ్యాపార రంగంగా మారింది. దీని ద్వారా డబ్బు ఎలా సంపాదించాలి, ఎలా ఎదగాలి, ఎలా ప్రభుత్వాన్ని వాడుకోవాలి, చివరికి కోరుకున్న వ్యక్తి సీఎంగా ఉండాలనేదే ప్రధానంగా మారింది. దీంతో అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. చర్చా వేదికలో వారికి కావాల్సిన వాళ్లను తీసుకొచ్చి కావాల్సినట్టు మాట్లాడిస్తున్నారు. దీనివల్ల ప్రజలకు నిజాలు తెలియక గందరగోళానికి గురవుతున్నారు.

– రామరాజు శ్రీనివాస్, ఏపీ ఇన్‌కంట్యాక్స్ ప్రాక్టిషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు

హుందాతనమే లేదు

మా చిన్నతనంలో మద్రాసు నుంచి ఒకట్రెండు పత్రికలొచ్చేవి. అందులో సినిమా వాళ్లపై అప్పుడప్పుడు ఫేక్ న్యూస్‌లు వచ్చేవి. వాటిని సరదాగా తీసుకునేవాళ్లం. ఈనాడు వచ్చాక పరిస్థితి మారింది. అవసరమైనప్పుడల్లా అబద్ధపు వార్తలతో ప్రజలను మభ్యపెట్టింది. ఆంధ్రజ్యోతి ఆ పరిస్థితిని మరింత దిగజార్చింది. డిబేట్లు నిర్వహించే వారు కూడా హుందాతనాన్ని పక్కన పెట్టేశారు. అభ్యంతరకరంగా వ్యవహరిస్తున్నారు. సీఎం ఎప్పుడు ఏం చేయాలో వారే డిసైడ్ చేస్తారు.

– డీఏఆర్ సుబ్రమణ్యం, నవ్యాంధ్ర ఇంటలెక్చ్యువల్ ఫోరం ఛైర్మన్

విష ప్రచారాన్ని ఆపాలి

ఫేక్ న్యూస్‌ను అడ్డుకోలేకపోతే సమాజం కొట్టుకుపోతుంది. లక్షల కోట్లు తిన్నారంటూ సీఎం జగన్‌పై ఎన్నో ఆరోపణలు చేశారు. అవేవీ నిజం కాదని అందరికీ తెలుస్తోంది. ఈ సమయంలో పనిగట్టుకొని మళ్లీ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు ఆలోచించే అవకాశం లేకుండా గందరగోళపరుస్తున్నారు. ఇటీవల బాపట్ల జిల్లా కర్లపాలెం వద్ద ఓ వ్యక్తి ఉబ్బసంతో చనిపోతే, పనుల్లేక అంటూ ఓ పత్రిక విష ప్రచారం చేసింది.

– మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఫోరం ఫర్ బెటర్ సొసైటీ, గుంటూరు జిల్లా కన్వీనర్

ఫుల్‌స్టాప్ పడాల్సిందే

ఫేక్ న్యూస్‌ను నిషేధించాల్సిన బాధ్యత వార్తా సంస్థలపై ఉంది. దీనిపై ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాప్ పడాలి. వ్యక్తిగత దూషణలతో మీడియా ఎటువెళ్తుందనేది అర్థం కావడం లేదు.

– ఎం.కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

ఎన్టీఆర్‌ను దింపిన రోజులు కావివి

తెలుగు రాష్ట్రాల్లోని కొందరు మీడియా అధిపతులు అర్ధ సత్యాలు, అసత్యాలతో ప్రజల ఆలోచనలను కలుషితం చేస్తున్నారు. కొన్ని మీడియా సంస్థలు హైదరాబాద్‌లో ఉంటూ ఏపీ రాజకీయాలపై తప్పుడు డిబేట్లు నిర్వహిస్తున్నారు. తద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. తప్పుడు ప్రచారంతో గతంలో రామారావు ప్రభుత్వాన్ని గద్దెదింపిన రోజులు కావివి. డిబేట్ల తీరు మారాలని త్వరలో ఆయా యాజమాన్యాలకు లేఖలు రాస్తాం.

– వీవీఆర్ కృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

దేశంలో బీసీలను ఆదరిస్తున్న ఏకైక సీఎం జగనే..

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య
- బీసీ సీఎంలు కూడా చేయలేనివి బీసీల కోసం సీఎం జగన్ చేస్తున్నారు



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

నరసరావుపేట: దేశంలో బీసీలకు అధికారం కల్పించి వారిని ఆదరిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీతో పాటు ఎన్నో రాష్ట్రాలకు బీసీలు సీఎంలుగా ఉన్నా వారు బీసీలకు చేయలేని మేలు సీఎం జగన్ ఏపీలో చేశారని కొనియాడారు. నరసరావుపేట టౌన్‌హాల్లో ఆదివారం ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈఎం స్వామి, వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వేముల శివ అధ్యక్షతన నిర్వహించిన పల్నాడు బీసీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం జగన్ అడక్కుండానే బీసీలకు అన్నీ ఇస్తున్నారని ప్రశంసించారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్ లాంటి రాష్ట్రాల్లో పర్యటిస్తే సీఎం జగన్ విలువ తెలుస్తుందన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్ తిరిగానని, పశ్చిమబెంగాల్లో గురుకులాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి వంటి పథకాలు లేవని చెప్పారు. తెలుగుదేశం పార్టీ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని విమర్శించారు. కృష్ణయ్యను ఎమ్మెల్సీలు పోతుల సునీత, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, బీసీ నేతలు సన్మానించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

ఆర్థిక నేరస్తులకు ప్రత్యేక కోడ్

సాక్షి, హైదరాబాద్: ఖైదీలకు బిల్లా నంబర్లు ఉన్నట్లుగానే త్వరలోనే ఆర్థిక నేరస్తులకూ పోలీసులు ప్రత్యేక కోడ్‌ను కేటాయించనున్నారు. సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో (సీఈఐబీ) అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ (ఏపీఐ) సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది. మెట్రో నగరాల్లో రూ. 50 లక్షలు, మెట్రోయేతర నగరాల్లో రూ.25 లక్షలకు మించి ఆర్థిక నేరాలకు పాల్పడిన నిందితులు, సంస్థల డేటాను ఈ అప్లికేషన్‌లో పొందుపర్చనున్నారు. ఇప్పటికే గత ఐదేళ్ల ఆర్థిక నేరస్తుల డేటాను సమీకరించాలని సంబంధిత దర్యాప్తు సంస్థలను సీఈఐబీ ఆదేశించింది. ఆర్థిక నేరాల కేసుల్లో మనీలాండరింగ్, పన్ను ఎగవేతలు, మోసాలు, డిపాజిట్ల సేకరణ వంటి మోసాలు మిళితమై ఉంటాయి. ఒకే కేసును బహుళ ఏజెన్సీలు దర్యాప్తు చేయాల్సి ఉంటుంది. దీంతో కేసు దర్యాప్తు ఏళ్ల పాటు సాగుతుంటుంది. అందుకే ఈ తరహా కేసుల్లో దోషిత్వ నిరూపణ శాతం చాలా తక్కువగా ఉంటుంది. దర్యాప్తును వేగవంతం చేయడానికి సీఈఐబీ ఈ యూనిక్ కోడ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఆర్థిక నేరాల దర్యాప్తులో భౌతిక జోక్యాన్ని తగ్గించి, సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించింది.

'సమతామూర్తి' స్థపతికి యూపీ సీఎం అభినందన



సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో నిర్మించిన సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం ఆర్కిటెక్ట్ ప్రసాద్ స్థపతిని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అభినందించారు. హరియాణాలోని రోహతక్‌లో నిర్మిస్తున్న మహంత్ బాబా మస్తనాథ్ ఆలయ ప్రాంగణాన్ని ఆదివారం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. ఈ ఆలయ రూపకల్పనలో ప్రసాద్ స్థపతి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ విశేషాలు, ముచ్చింతల్‌లోని సమతా మూర్తి విశిష్టతలపై ఆయనను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

జూనియర్ న్యాయవాదులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

- ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి
- నెల్లూరు జిల్లా కోర్టు ఆవరణలో నూతన భవనాల ప్రారంభం



నూతన భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి

నెల్లూరు (లీగల్): వృత్తిపరమైన అనుభవం ఉన్న సీనియర్ న్యాయవాదులు వారికి తెలిసిన అంశాలను జూనియర్ న్యాయవాదులకు తెలియజేసి వారిని వృత్తిలో ఉన్నతులుగా తీర్చిదిద్దాలని ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాల సముదాయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో రాణించాలంటే బాగా వాదించగలగడంతోపాటు కొన్ని సమయాల్లో సందర్భానుసారంగా మౌనం పాటించడం అనేది చాలా ముఖ్యమని చెప్పారు.

జిల్లా వార్తలు

పవన్‌కల్యాణ్ ర్యాలీలో అపశృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి ఏలూరుకు రోడ్డు మార్గాన వెళ్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు కృష్ణా జిల్లా బాపులపాడు మండలం, హనుమాన్‌జంక్షన్ వద్ద ఆదివారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యువత బైక్‌లతో నిర్వహించిన ర్యాలీలో అపశృతి చోటు చేసుకుంది. హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డులో పెరికీడు వద్ద ర్యాలీలోని వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జనసేన వీర మహిళా విభాగం నాయకురాలు శిరీష, ఉమామహేశ్వరపురానికి చెందిన మరో ముగ్గురు యువకులు గాయాలపాలయ్యారు.

స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రం అన్నపూర్ణ ఫొటో స్టూడియో



విద్యార్థులతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న హీరో చైతన్యరావు, హీరోయిన్ లావణ్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రం అన్నపూర్ణ ఫొటో స్టూడియో అని ఆ సినిమా హీరో చైతన్యరావు అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ సభ్యులు ఆదివారం నగరానికి విచ్చేశారు. శ్రీ చైతన్య కళాశాలల క్యాంపస్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా హీరో చైతన్యరావు మాట్లాడుతూ అన్నపూర్ణ ఫొటో స్టూడియో, ఇచ్చట అందమైన ఫొటోలు తీస్తాం అనే ఉప శీర్షికతో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఇప్పుడున్న ఫాస్ట్ లైఫ్ నుంచి దూరంగా ప్రేక్షకులను 1980 నేపథ్యంలోకి తీసుకెళ్లే సినిమా ఇది అని తెలిపారు. దర్శకుడు చందు మాట్లాడుతూ కథలో ఉన్న ట్విస్టు, థ్రిల్లింగ్, క్రైమ్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ సినిమా ప్రేక్షకులకు తప్పక నచ్చుతుందన్నారు. హీరోయిన్ లావణ్య సాహుకార మాట్లాడుతూ తెలుగులో నటిస్తున్న తన తొలి చిత్రం ఇది అని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ప్రతి సన్నివేశం ఎంతో అద్భుతంగా తీశారని పేర్కొన్నారు. చిన్న సినిమాను ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.



తీరం ఒడ్డున అమ్మకాలు చేస్తున్న కానాగంతలు చేపలు



భారీగా వలకు చిక్కిన టైగర్ రొయ్యలు

వలచిన సిరి



మత్స్యకారుల వలలో పడిన సార చేపలు

గంగపుత్రులను మత్స్యసిరి వలచింది. వేట ఆశాజనకంగా సాగింది. శుక్ర, శనివారాల్లో సముద్రంలోకి వేటకు వెళ్లిన పల్లెకారులు ఆదివారం అధిక మత్స్య సంపదతో చీరాల వాడరేవు తీరానికి ఆనందంగా చేరుకున్నారు. ఫలితంగా రొయ్యలు, పార, సార, వంజరం, పండుగప్ప, గురక, తోక, కూన రకాల చేపల వేలం అమ్మకాలతో తీరం సందడిగా మారింది. ధర కూడా ఆశాజనకంగా లభించడంతో గంగపుత్రులు సంతోషంగా ఉన్నారు. కొన్న మత్స్య సంపదను వ్యాపారులు చెన్నై, కలకత్తా, మైసూరు, బెంగళూరు, హైదరాబాద్ వంటి ముఖ్య నగరాలకు ఎగుమతి చేస్తారు. రెండున్నర నెలల వేట నిషేధం అనంతరం జూన్ 15 నుంచి మత్స్యకారులు సముద్రంలోకి వెళ్తున్నారు. కొద్దిరోజులు అంతంత మాత్రం సరుకుతో వెలవెలబోయిన వలలు ఆదివారం అపార మత్స్య సంపదతో అలరారాయి. – చీరాల



వేటలో లభ్యమైన జల్ల చేపలు



వేటలో లభించిన సముద్రపు పీతలు

దాడి చేసి రూ.4 లక్షల దోపిడీ

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి రూ.4 లక్షలు దోచుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆదివారం రాత్రి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. చందర్లపాడు గ్రామానికి చెందిన బత్తుల వీరబాబు గొర్రెల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సమయంలో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మల్లెపల్లి గ్రామంలో గొర్రెలు కొనుగోలు చేసేందుకు తన స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పెనుగంచిప్రోలు మండలం కొణకంచి అడ్డరోడ్డు సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు తన వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. ఇంతలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వెనుకనుంచి వచ్చి వీరబాబుపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.4 లక్షలు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

సందేశాత్మకంగా సాగిన నాటికలు



రంగస్థల నటి కుసుమసాయిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: డాక్టర్ వైఎస్సార్ కళాపరిషత్, పొలపల మల్లికార్జునరావు మెమోరియల్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 43 జాతీయ సాంఘిక నాటిక పోటీల ప్రదర్శనలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. ఆదివారం కె.కాశీవిశ్వనాథ్ రచించి కె.బి. ఆనంద్ దర్శకత్వం వహించిన కబ్జా నాటికతో ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. సొంతింటి కల అయిన ఇల్లు కట్టుకోవడం కోసం మధ్యతరగతి వారు పడే ఇబ్బందులు, దళారులు మోసాలు అంశంగా నాటకం సాగుతుంది. అభ్యుదయ ఆర్ట్స్ విజయవాడ వారి ఆ విధంగా, నటనాలయ ఒంగోలు వారి మెర్సీ ప్లీజ్ నాటికలను ప్రదర్శించారు. ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్యా చేసిన కూచిపూడి నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. వర్ధమాన కళాకారిణి జి.నాగదుర్గా కుసుమ సాయిని నిర్వాహకులు సత్కరించారు. తెలుగు నాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, నంది నాటక పోటీలకు శ్రీకారం చుట్టిందని పీఎంకే ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పసుపులేటి వెంకటరమణ అన్నారు. పోటీలను జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. కళాకారుల కోసం ప్రభుత్వంచేస్తున్న కృషిని అభినందించారు. మల్లికార్జునరావు మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి అమృత వర్షిణి మాట్లాడుతూ తెలుగు నాటక రంగం వైభవానికి కృషి చేస్తున్న రంగస్థల నటులు, దర్శకులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో సంస్థ పీఆర్‌ఓ గుడిపాటి లహరి, వివిధ సంస్థల ప్రతినిధులు కత్తి శ్యాంప్రసాద్, రంగనాయకులు, డాక్టర్ పి.వి.ఎన్.కృష్ణ, పి.వి.భాస్కర శర్మ, ఆరాధ్యుల కన్నా, ద్వాదశి చంద్రశేఖర్ పాల్గొన్నారు. సోమవారంతో పోటీలు ముగుస్తాయి. వ్యవసాయం, సంకల్పం నాటికలను ప్రదర్శిస్తారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుంది.

వెల్లువిత్తిన స్ఫూర్తి

కోటి సంతోషాల దీప్తి

- నల్లమలలో కోటి విత్తన బంతులు చల్లే కార్యక్రమం ప్రారంభం
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్



నల్లమల అడవిలో విత్తన బంతులు చల్లుతున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్, విద్యార్థినులు

కారెంపూడి: మానవ తప్పిదాలు ప్రకృతికి చేటు చేస్తున్నాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. కారెంపూడికి చెందిన పర్యావరణ ప్రేమికుడు కొమెర అంకారావు (జాజి) ఆధ్వర్యంలో నల్లమలలో కోటి విత్తన బంతులు (సీడ్ బాల్స్) చల్లే కార్యక్రమాన్ని కలెక్టర్ శివశంకర్ ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులు, అధికారులతో కలిసి అడవిలోకి వెళ్లి కలెక్టర్ దాదాపు ఆరువేల విత్తన బంతులు చల్లారు. ఎరువు కలిపిన బంక మట్టిలో విత్తనం ఉంచి దానిని చిన్న బంతులు(ఉండలు)గా చేసి చల్లితే అవి వర్షాలు పడినప్పుడు మొలక వచ్చి మొక్కగా ఎదుగుతాయని జాజి, అటవీశాఖ అధికారులు వివరించారు. తొలుత జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం, అడవుల నరికివేత వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూ తాపం పెరగడం, వాతావరణ సమతుల్యత దెబ్బతినడం, దీనివల్ల తలెత్తే అనర్థాలతోపాటు మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను కలెక్టర్ వివరించారు. కొమెర జాజి సంకల్పాన్ని అభినందించారు. అడవుల్లో అంతరించిపోతున్న అరుదైన వనమూలికల పరిరక్షణకు కృషి చేస్తున్న జాజి అత్యున్నత పురస్కారం అందుకుంటారని కొనియాడారు. అనంతరం జాజిని కలెక్టర్ సన్మానించారు. తొలుత నాయకురాలు కసుమ వద్ద ఉన్న మంత్రాలమ్మ తల్లికి కలెక్టర్ పూజలు చేశారు. అనంతరం నల్లమలలో ఎర్రటి ఎండలో మధ్యాహ్నం వరకు తిరిగి విత్తన బంతులు చల్లే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ గబ్రూనాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ, తహసీల్దార్ జి. శ్రీనివాస్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, ఎస్‌ఐ జిలాని పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన

అనంతరం కారెంపూడి పీహెచ్‌సీని కలెక్టర్ పరిశీలించారు. రూ.50 లక్షలతో చేపట్టే అదనపు భవనాల నిర్మాణానికి స్థలాన్ని చూశారు. పీహెచ్‌సీ ఎదుట ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయం స్థలాన్ని కలెక్టర్ ఎంపిక చేశారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు ఆదినారాయణ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు వినతిపత్రం అందించారు. తల్లిదండ్రులు విడిపోయి డ్రాపవుట్స్‌గా మిగిలి చదువుకుంటామని తన వద్దకు వచ్చిన ఇద్దరు బాలికలను కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో చేర్చాలని ఎంఈఓను కలెక్టర్ ఆదేశించారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం ॥ 10-7-2023

సన్నిధి



మంచిమాట

ఏ దేశంలో అయినా, ఏ సమాజంలో అయినా, ఏ కాలంలో అయినా మానవుల్లో ఉండాల్సినవి ఏవి? సహృదయత, సామరస్యం, ద్వేషరాహిత్యం ఇవి ప్రపంచ మానవుల్లో ఉండాల్సినవి. మానవులు క్షేమంగా ఉండాలంటే ఉండి తీరాల్సినవి ఇవే. అదేంటో మానవ చరిత్ర మొదలు అయినప్పటి నుంచీ ఇవి ఉండాల్సినంతగా, ఉండాల్సినట్టుగా ఉండడం లేదు. అందువల్లే మానవులకు శాంతి, భద్రతలు కరువైపోయాయి. ఈ దుస్థితి ఇకనైనా మారాలి; ఇకపైనైనా మనిషి వల్ల మనిషికి కలుగుతున్న ముప్పుకు ముగింపు రావాలి; మనకు సుస్థితి సమకూడాలి.

సహృదయం.. సామరస్యం.. ద్వేష రాహిత్యం

అథర్వ వేదపాఠం అయిన సాంమనస్య సూక్తం ఎప్పటి నుంచో 'సహృదయం సాంమనస్యం అవిద్వేషం కృణోమి వః' అనీ, 'అన్యో అన్యమభి హర్యత వత్సం జాతమివాఘ్న్యా' అనీ ఘోషిస్తూనే లేదా చాటిస్తూనే ఉంది. అంటే సహృదయులుగానూ, సామరస్యంతోనూ లేదా ఏకమనస్కులుగానూ, ద్వేషరహితులుగానూ మిమ్మల్ని రూపొందిస్తాను అనీ, అపుడే పుట్టిన దూడను తల్లి ఆవు ప్రేమించేట్టుగా పరస్పరం ప్రేమించుకోవాలి అనీ అర్థం. ఈ మాటల్ని మనం అర్థం చేసుకోనేలేదు. అందుకే మనలో అపాయం అతిగా వ్యాపిస్తూనే ఉంది. ఈ పరిస్థితిని మనం వెనువెంటనే పరిష్కరించుకోవాలి.

ప్రపంచం, దేశం, సమాజం వీటికి తొలిదశ ఇల్లు. ఒక ఇంట్లోని వ్యక్తుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలో తెలియజేస్తూ సాంమనస్య సూక్తం 'అనువ్రతః పితుః పుత్రో మాత్రా భవతు సంమనాః' అనీ, 'జాయా పత్యే మధుమతీమ్ వాచమ్ వదతు శాన్తివామ్' అనీ చెబుతోంది. అంటే ఒక కొడుకు తన తండ్రిని అనుసరించే వాడుగానూ, తన తల్లితో సామరస్యంతోనూ ఉండాలి, భార్య భర్తతో మధురమైనదై ప్రశాంతతను ఇచ్చే మాటల్ని చెప్పనీ అని అర్థం. ఒకరిని ఒకరు వెన్నంటి ఉండడం, ప్రశాంతత, హితవచనం ఇవి ఇంటి నుంచే మొదలు అవ్వాలి.

ద్వేషరాహిత్యం అన్నది కూడా ఇంటి నుంచే రావాలి అని తెలియజేస్తూ సాంమనస్య సూక్తం 'మా భ్రాతా భ్రాతరం దద్విక్షన్మా స్వసారముత స్వసా' అనీ, సమ్యఞ్చః సవ్రతా భూత్వా వాచం వదత భద్రయా' అనీ చెబుతోంది. అంటే సోదరీ సోదరులు ద్వేషించుకోకూడదు, కలిసికట్టుగా పనిచెయ్యండి, అందరూ శుభం కలిగించే మాటల్ని పలకండి అని అర్థం.

అభిప్రాయ భేదాలతో ఒక ఇంట్లోని సభ్యులు పరస్పరం ద్వేషించుకుంటూ విడిపోవడం కాదు ఉమ్మడిగా ఉండడానికి వాళ్ల మధ్య అవగాహన ఉండాలి అని తెలియజేస్తూ సాంమనస్య సూక్తం 'యేన దేవా న వియన్తి నో చ విద్విషతే మిథః' అనీ,'తత్ కృణ్మో బ్రహ్మ వో గృహే సంజ్ఞానం పురుషేభ్యః' అనీ చెబుతోంది. అంటే దేనివల్ల దేవతలు విడిపోరో, ద్వేషించుకోరో అవగాహన అన్న ఆ ఉన్నతమైన భావన ఇంట్లోని సభ్యుల్లో ఉండాలి అని అర్థం. సంజ్ఞానం లేదా అవగాహన మనకు ఉండి తీరాలి.

> 'భారతీయ వైదిక సాహిత్యం సహృదయత, సామరస్యం, ద్వేషరాహిత్యం వీటితో మానవులు మెలగాలని ప్రగాఢంగా ప్రవచించింది. దాన్ని మనం అర్థం చేసుకుని ఆచరణలోకి తెచ్చుకోవాలి. అది జరగకపోతే మన జీవితాలు అనర్థదాయకమూ, అల్లకల్లోలమూ అయిపోతాయి'.

చిన్నవాళ్లు పెద్దలను వెన్నంటి వెళుతున్నట్టుగా ఒకరికి ఒకరై ఏకమనస్కులుగా, సామూహిక ఆరాధన చేసేవాళ్లగా, పరస్పరం ప్రీతితో మాట్లాడుకునే వాళ్లుగా కలిసి మెలిసి బతకండి అని సూచిస్తూ 'జాయస్వన్తశ్చిత్తినో మా వి యౌష్ట సమారాధయన్తః సధురాశ్చరన్తః' అని సాంమనస్య సూక్తం మనకు చెబుతోంది. అంతేకాదు ప్రేమ అనే తాడుతో అందరూ కట్టబడాలి అన్న సూచ్య అర్థం వచ్చేట్టుగా 'సమానే యోక్త్రే సహ వో యునజ్మి' అనీ, 'దేవా ఇవామృతమ్ రక్షమాణాః సాయం ప్రాతః సౌమనసో వో అస్తు' అంటూ దేవతలు అమృతాన్ని రక్షిస్తున్నట్టుగా ఉదయ, సాయం కాలాల్లో సద్భావనల్ని రక్షించండి అనీ చెబుతోంది సాంమనస్య సూక్తం. సాంమనస్య సూక్తం చేసిన ఈ సూచనను అందుకుని సద్భావనల్ని రక్షించుకుంటూ మనల్ని మనం రక్షించుకోవాలి; ఆపై మనం రాణించాలి.


– రోచిష్మాన్

గురువాణి

చిన్న మాటలే.. ఛిన్నాభిన్నం చేసేస్తాయి

శ్రీరామాయణంలో... దశరథ మహారాజు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురికీ వివాహాలు చేయాలని సంకల్పించాడు. సభతీర్చి వారికి తగిన వధువులను వెతకవలసిందిగా కోరుతూ మంత్రులతో, పురోహితులతో సమాలోచనలు జరుపుతున్నాడు. అదే సమయానికి విశ్వామిత్రుడు వచ్చాడు. సాక్షాత్ బ్రహ్మర్షి అయిన విశ్వామిత్రుడు వచ్చేసరికి మహారాజు కంగారు పడిపోయి గబాగబా వెళ్ళి స్వాగతం చెప్పి అర్ఘ్యపాద్యాదు లిచ్చి ఆహ్వానించాడు. బ్రహ్మర్షి కాకముందు విశ్వామిత్రుడు కోపధారి కనుక తొందరపాటులో ఏ శాపమిస్తాడో అని భయపడిపోయి... ఒకటికి పదిమార్లు ... ఆయన ఏమీ అడగకపోయినా... మీరు రావడం వల్ల మా వంశం తరించింది, నేను తరించాను, నా ఇల్లు పావనమయింది, మీకు ఏం కావాలో చెప్పండి, ఏవయినా చేసేస్తాను, ఏదయినా ఇచ్చేస్తాను.. అని అదేపనిగా చెప్పాడు.

అన్నీ విన్న మహర్షి చివరన మాట్లాడుతూ.. ''రాజా! నేనొక యజ్ఞాన్ని తలపెట్టాను. మారీచ సుబాహులనే రాక్షసులు వచ్చి నా యజ్ఞాన్ని ధ్వంసం చేస్తున్నారు. కాబట్టి ఆ యజ్ఞ సంరక్షణ కొరకు మీ కుమారులయిన రామలక్ష్మణులను ఇద్దరినీ నాతో పంపించండి'' అన్నాడు. అది విని దశరథుడు హతాశుడయ్యాడు. తన కుమారులకు



రాక్షసుల చేతిలో ఎక్కడ ఏ ఆపద కలుగుతుందో అని అనేక సాకులు చూపిస్తూ నేను పంపను... నేను పంపను... అనడం మొదలు పెట్టాడు. దానికి విశ్వామిత్రుడు ..''ఒకసారి మాటిచ్చి తప్పే లక్షణం ఉన్నవాడా! దీర్ఘకాలంలో శోకించెదవుగాక!'' అన్నాడు. విశ్వామిత్రుడు అడగకముందే తొందరపడిపోయి చేసేస్తాను అనడం వల్ల .. తీరా అడిగేసరికి చేయలేని పరిస్థితి కొనితెచ్చుకున్నందు వల్ల దశరథ మహారాజు అంతటివాడు సంకటపరిస్థితిలో పడ్డాడు.

ఏదయినా ఒకమాట ఇచ్చేముందు మనకున్న పరిమితుల విషయంలో ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. ఇది నేను చేయగలనా? నాకు ఆ సామర్థ్యం ఉందా? నాకు సాధ్యమవుతుందా? ఆలోచించి... చెయ్యగలిగితే చేయగలను.. అని చెప్పాలి. చేయలేనప్పుడు అదే చెప్పాలి. గణిత శాస్త్ర మేథావి, సంగీత శాస్త్రంలో, రాజకీయంలో, మతవిశ్వాసాలను సిద్ధాంతీకరించడంలో దిట్ట అయిన పైథాగరస్ ఒక మాట అంటాడు.. ''అత్యంత ప్రాచీనమైన మాటలు, చాలా చిన్న చిన్న మాటలు ఏవి! అంటే... ''యస్'', ''నో''. అని – వీటిని వాడేటప్పుడు ఎంతో విచక్షణతో, సంయమనంతో వాడాలనేది ఆయన ఉద్దేశం.

అలాగే గొప్ప అవకాశం వచ్చినప్పుడు... ముందూ వెనకలు ఆలోచించకుండా తిరస్కరించడం, తమను తాము నిరూపించుకునే అవకాశాన్ని, జీవితంలో వృద్ధిలోకి వచ్చే అవకాశాన్ని, అపరిపక్వ అపోహలతో, లేనిపోని భయాలతో చేజేతులా వదులుకోవడం తరువాత మెలికలు తిరిగిపోవడం కంటే.. అవును అని కానీ, కాదు అని కానీ చెప్పేముందు తొందరపడకుండా, ఆవేశాలకు లోను కాకుండా పదిసార్లు విజ్ఞతతో ఆలోచించి ఆ పదాలను వాడుతూ ఉండాలి.

ఒక వ్యక్తి గౌరవం, మర్యాద, అభ్యున్నతి, ప్రతిష్ఠ, విశ్వసనీయత... వంటివన్నీ దీనితో ముడిపడి ఉన్నాయి. యస్ లేదా నో... అవును లేదా కాదు... చిన్న పదాలే కానీ జీవితాలను మలుపు తిప్పేస్తాయి... జాగ్రత్తగా ఆచి తూచి వ్యవహరించడం ఉత్తమం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఉపేక్షిస్తే ఉనికికే ప్రమాదం!

బౌద్ధవాణి

అది మండు వేసవి. అప్పుడే సూర్యోదయం అయింది. లేత కిరణాలు సోకి సాలవృక్షం పచ్చదనాన్ని వెదజల్లుతూ పరవశించిపోతోంది. ఆ అడవిలో తానే ఎత్తైన వృక్షాన్ని అనే గర్వంతో కూడిన ఆనందం అది.

అంతలో... ఒక కాకి ఎగిరి వచ్చి ఆ వృక్షం కొమ్మల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో వాలింది. దాని ముక్కున పండిన మాలువా పండు ఉంది. ఆ పండును కాలివేళ్ళతో తొక్కి పట్టి, గుజ్జునంతా తినేసింది. ముక్కును అటూ ఇటూ రాచి, వాలుగా చూసి, 'కా... కా'' అంటూ ఎగిరి వెళ్ళిపోయింది.

అలా కాకి వెళ్ళిపోగానే, తన మీద వదిలి వెళ్ళిన మాలువా విత్తనాన్ని గమనించిన ఆ సాలవృక్షం ఆలోచనలో పడింది. భయం పుట్టి వణికింది. అయినా తనని తాను సమాధాన పరచుకుని శాంతించింది.



వేసవి ముగిసింది. మాలువా విత్తనం టెంకె పగిలింది. దానిలోంచి నిగనిగలాడే విత్తనం బయటకొచ్చి పడింది. ఆ విత్తనాన్ని చూడగానే సాల వృక్షానికి వేళ్ళు కుంగినట్లయింది. పెనుగాలికి కూలినట్లు భావించింది. కార్చిచ్చుకి తగలబడి బూడిద అయినట్లు అనిపించింది. నిలువెల్లా వణకసాగింది. మొత్తుకోసాగింది.

అప్పుడు ఆ వృక్షం చుట్టూ ఉండే ఇతర వృక్ష మిత్రులంతా ''దుఃఖ కారణం ఏమిటి?'' అని అడిగారు.

''సాలవక్షం విషయం చెప్పింది. అప్పుడు ''సాలవృక్షమా! చింతించకు. అనవసరంగా భయపడుతున్నావెందుకు? ఆ విత్తనాన్ని నెమలి తినవచ్చు. జింక నమిలి వేయవచ్చు. కార్చిచ్చు కాల్చవచ్చు. ఎవరైనా మనిషి చూసి తీసుకుపోవచ్చు. ఎండకు ఎండిపోవచ్చు. నీడలో నాని కుళ్ళిపోవచ్చు. చెద పురుగులు తినొచ్చు. చీమలు తీసుకుపోవచ్చు. ఇన్ని అవరోధాలు ఉన్నాయి. వీటన్నింటినీ దాటుకుని అది మొలకెత్తలేదు. ఒకవేళ మొలకెత్తినా వెంటనే వానలు ఆగిపోతే, మొలకలోనే మాడిపోవచ్చు. కాబట్టి లేనిపోని భయాన్ని ఊహించుకుని వణికిపోకు'' అంటూ ధైర్యం చెప్పాయి.

తోటి వృక్షాల ఓదార్పుకు ఆ సాల వృక్షం ధైర్యాన్ని తెచ్చుకుంది. కానీ ఆ విత్తనం మొలవడానికి ఏ అవరోధం కలగలేదు. ఆ ఏడాది సకాలంలో వర్షాలు పడడంతో చక్కగా మొలకెత్తింది. వేగంగా పెరిగింది. పెద్ద పెద్ద తమలపాకుల్లా లేత పచ్చని ఆకుల తీగపైకి లేచింది. దాన్ని చూసి సాలవృక్షం లబోదిబోమంది. మరలా వృక్షాలన్నీ– ''నీవు మహావృక్షానివి. అది చిన్న తీవె. అయినా ఆ బుజ్జి కాడ ఎంత ముచ్చటగా, అందంగా ఉందో, అది నీకు మంచి అలంకారంగా ఉంది. ఈ చిన్న తీవె నిన్నేమి చేయగలదు'' అని మరలా ధైర్యం చెప్పాయి. వాటి మాటలు విని సాలవృక్షం కొంత సాంత్వన పడింది.

కానీ... అతి తక్కువ కాలంలోనే ఆ తీగ బలపడింది. దాని బెరడును చీల్చుకుని వేళ్ళను లోనికి పంపింది. ఆ వృక్ష సారాన్నే పీల్చుకోసాగింది. చివరికి చెట్టంతా కమ్ముకుపోయింది. సారాన్ని కోల్పోయిన సాలవృక్షం ఎండి.. క్రమంగా జీవాన్నీ కోల్పోయింది.

ఒకప్పుడు అడవిలో తిరిగే మనుషులు ఏదైనా విషయం గురించి మాట్లాడుకుంటూ ''ఆ పెద్ద సాలవృక్షం దగ్గర ఆ మహా సాలవృక్షం పక్కన...'' అని ఆనవాళ్ళను చెప్పుకుంటూ ఉండేవారు. కానీ... ఇప్పుడు... ఆ మాలువా పొద పక్కన'' అంటూ చెప్పుకోసాగారు.

చెడ్డవారిని చేరదీయడం వల్ల, చెడ్డతనం పట్ల ఉపేక్ష భావంతో ఉండటం వల్ల అది మన ఉనికికే చేటు తెస్తుంది. మనిషి మనసులో చెడు కోరికలు రేగినప్పుడు... ''ఇది చిన్న కోరికే కదా! ఈ ఒక్కసారికీ ఈ పని చేసి ఇక ఆ తరువాత చేయకుండా ఉంటే మనకు వచ్చే నష్టం లేదు. కలిగే కష్టమూ లేదు'' అనుకుని ఆ చెడ్డ కర్మలకు పూనుకుంటారు. కానీ, ఆ తర్వాత వాటిని మానడం అటుంచి, మరింత లోతుకు కూరుకుపోతారు. కామ రాగాలన్నీ ఇలానే ప్రవేశించి, పెరిగి పెరిగి మన ఉనికికే ప్రమాదాన్ని తెస్తాయి. వాటిని మనస్సులో పుట్టకుండా చేసుకోవాలి. లేదా పుట్టిన వెంటనే నివారించుకోవాలి. ఉపేక్షతో ఉపేక్ష చూపితే మన ఉనికికే నిక్షిప్తం చేస్తాయి.

ఇది కామరాగాల పట్ల ఎంత అప్రమత్తతతో ఉండాలో బుద్ధుడు చెప్పిన కథ ఇది. ఆ రోజుల్లో 'మోక్షానికి కామం కూడా ఒక మార్గమే' అని చెప్పే సాధువులు కొందరు ఉండేవారు. వారికి కనువిప్పు కలిగించడం కోసం, బుద్ధుడే ఈ కథ చెప్పాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



జామ్ జామ్ జజ్జనక

'జామ్ జామ్ జామ్ జామ్ జజ్జనక.. తెల్లార్లు ఆడుదాం తైతక్క...' అంటూ చిందేశారు చిరంజీవి. మెహర్ రమేష్ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'భోళా శంకర్'. ఈ మూవీలో తమన్నా కథానాయికగా నటించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మహతి స్వరసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'జామ్ జామ్ జజ్జనక...' అంటూ సాగే రెండో పాట ప్రోమోని ఆదివారం విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో చిరంజీవి సంప్రదాయ దుస్తులు ధరించి సూపర్ కూల్‌గా కనిపిస్తున్నారు. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'భోళా శంకర్'. ఈ మూవీ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. 'భోళా మానియా...' అనే మొదటి పాట చార్ట్ బస్టర్‌గా నిలిచింది. 'జామ్ జామ్ జజ్జనక...' అంటూ సాగే పూర్తి పాటని ఈ నెల 11 విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కీర్తీ సురేష్, సుశాంత్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, కెమెరా: డడ్లీ, లైన్ ప్రొడక్షన్: మెహెర్ మూవీస్.

● చిరంజీవి

మహావీరుడు కోసం ఎదురుచూస్తున్నా

– శేఖర్ కమ్ముల

''మహావీరుడు' సినిమా ట్రైలర్, విజువల్స్ గొప్పగా ఉన్నాయి. ఈ మూవీలో గ్రేట్ వైబ్ కనిపిస్తోంది. సినిమా విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అని డైరెక్టర్ శేఖర్ కమ్ముల అన్నారు. శివ కార్తికేయన్ హీరోగా 'మండేలా' ఫేమ్ మడోన్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'మహావీరన్'. అదితీ శంకర్ హీరోయిన్. శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మించారు. ఈ సినిమాని ఏషియన్ సినిమాస్ ఈ నెల 14న తెలుగులో విడుదల చేస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరో అడివి శేష్, శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అడివి శేష్ మాట్లాడుతూ–''నా గురువు శేఖర్ కమ్ముల ముందు



● శేఖర్ కమ్ముల, మడోన్ అశ్విన్, అదితీ శంకర్, శివ కార్తికేయన్, అడివి శేష్, సునీల్ నారంగ్

మాట్లాడటం గౌరవంగా ఉంది. శివ కార్తికేయన్‌తో పని చేయాలని ఉంది'' అన్నారు. ''నా 'రెమో, వరుణ్ డాక్టర్, కాలేజ్ డాన్' సినిమాల్లా 'మహావీరుడు' ని తెలుగువారు ఇష్టపడతారు'' అన్నారు శివ కార్తికేయన్. ''మహావీరుడు' అందరికీ నచ్చుతుంది'' అన్నారు మడోన్ అశ్విన్. ''మా అమ్మగారి పేరుతో ఈ సంస్థ మొదలు పెట్టి, శివ కార్తికేయన్‌తో తొలి మూవీ చేయడం హ్యాపీ'' అన్నారు అరుణ్ విశ్వ.



● త్రిష

కాంబినేషన్ రిపీట్



● రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కొత్త సినిమా కోసం మరోసారి చేతులు కలిపారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'డాన్‌శీను' (2010), 'బలుపు'(2013), 'క్రాక్' (2021) చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా రవితేజ, గోపీచంద్ మలినేని కాంబో నాలుగోసారి రిపీట్ అవుతున్నట్లు ఆదివారం ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ''వాస్తవ సంఘటనలతో గోపీచంద్ మలినేని ఓ కథను తయారు చేశారు. ఈ సినిమాకి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: తమన్.

యాక్షన్ ఐడెంటిటీ

'ఫోరెన్సిక్' వంటి హిట్ మూవీ తర్వాత హీరో టోవినో థామస్, దర్శక ద్వయం అఖిల్ పాల్ – అనస్‌ఖాన్ కాంబినేషన్‌లో రూపొందనున్న మలయాళ చిత్రం 'ఐడెంటిటీ'. ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిషను ఎంపిక చేసింది యూనిట్. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'ఐడెంటిటీ'. ఎర్నాకులం, బెంగళూరు, మారిషష్, కోయంబత్తూరు లొకేషన్స్‌లో షూటింగ్‌కి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ''త్రిషతో స్క్రీన్ షేర్ చేసుకునేందుకు చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అన్నారు టోవినో థామస్. ''ఐడెంటిటీ'లో జాయిన్ అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు త్రిష. కాగా నివిన్ పౌలి 'హే జూడ్', మోహన్‌లాల్ 'రామ్' (చిత్రీకరణ జరుగుతోంది) తర్వాత మలయాళంలో త్రిష చేస్తున్న మూడో చిత్రం 'ఐడెంటిటీ'.

యాక్షన్ థ్రిల్లర్

ప్రముఖ కన్నడ హీరో శివరాజ్ కుమార్ నటించిన తాజా చిత్రం 'ఘోస్ట్'. శ్రీని(బీర్బల్) దర్శకత్వం వహించిన ఈ మూవీలో మలయాళ నటుడు జయరామ్ కీలక పాత్ర పోషించారు. సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సందేశ్ నాగరాజ్ నిర్మించారు. పాన్ ఇండియా మూవీగా రూపొందిన 'ఘోస్ట్' టీజర్‌ను బిగ్ డాడీ పేరుతో ఈ నెల 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ పోస్టర్‌ని విడుదల చేసింది యూనిట్. చేతిలో గన్‌తో సీరియస్ లుక్‌తో ఉన్న శివరాజ్ కుమార్ పోస్టర్ బాగుంది. ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఘోస్ట్'. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మహేంద్ర సింహ, సంగీతం: అర్జున్ జన్య.



● శివరాజ్ కుమార్

మిస్టర్ ఇడియట్ హిట్ కావాలి

– రవితేజ



● సిమ్రాన్ శర్మ, రవితేజ, మాధవ్

''నా కెరీర్‌లో 'ఇడియట్' సినిమాకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఇప్పుడు మా తమ్ముడు రఘు తనయుడు మాధవ్ 'మిస్టర్ ఇడియట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. నా 'ఇడియట్'లా 'మిస్టర్ ఇడియట్' కూడా పెద్ద హిట్ కావాలి'' అని హీరో రవితేజ అన్నారు. నటుడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటిస్తున్న సినిమాకు 'మిస్టర్ ఇడియట్' టైటిల్‌ను ఖరారు చేశారు. 'పెళ్లి సందడి' (2021) ఫేమ్ గౌరి రోణంకి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సిమ్రాన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ పోస్టర్, ఫ్రీ లుక్‌ను రవితేజ విడుదల చేశారు. జేజేఆర్ రవిచంద్ మాట్లాడుతూ– ''మిస్టర్ ఇడియట్' షూటింగ్ ఈ నెలాఖరుకు పూర్తవుతుంది. నవంబరులో సినిమా రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గౌరి. ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్.

ఎవరు?



● జేడీ చక్రవర్తి

నటుడు, దర్శక–నిర్మాత జేడీ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో తెలుగు, కన్నడ భాషల్లో తీసిన తాజా చిత్రం 'హూ'. ఇందులో శుభరక్ష, నిత్య హీరోయిన్స్‌గా నటించారు. రెడ్డెమ్మ బాలాజీ.కె నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని, విడుదలకు రెడీ అయ్యింది. ఈ సందర్భంగా రెడ్డెమ్మ బాలాజీ.కె మాట్లాడుతూ–''ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'హూ'. ఈ మూవీలో జేడీ చక్రవర్తి నటన చాలా వైవిధ్యంగా ఉంటుంది'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: ఈశ్వర్ చంద్.

రిస్క్ తీసుకొని హర్ చేశా

– రుహాని శర్మ



● రుహాని శర్మ, శ్రీధర్ స్వరాఘవ్

''హర్' సినిమా నా దగ్గరికి వచ్చినప్పుడు ఫీమేల్ ఓరియంటెడ్ మూవీ నేను చేయగలనా? అని ఒక అనుమానం ఉండేది. కానీ డైరెక్టర్ శ్రీధర్‌గారు నాకు నమ్మకం ఇచ్చారు. రిస్క్ తీసుకొని మరీ ఈ సినిమా చేశాను'' అని హీరోయిన్ రుహాని శర్మ అన్నారు. శ్రీధర్ స్వరాఘవ్ దర్శకత్వంలో రుహాని శర్మ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'హర్'. డబుల్ అప్ మీడియాస్‌పై రఘు సంకురాత్రి, దీపా సంకురాత్రి నిర్మించారు. సురేష్ మూవీస్ ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 21న ఈ మూవీ విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్‌ని హీరో వరుణ్ తేజ్ వర్చువల్‌గా లాంచ్ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌కి నిర్మాత రాజ్ కందుకూరి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ–''హర్' నేను ఇప్పటికే చూశాను.. సినిమా చాలా బాగుంది. తప్పకుండా మంచి హిట్ అవుతుంది'' అన్నారు. శ్రీధర్ స్వరాగవ్ మాట్లాడుతూ– ''మా సినిమా మొదటి సీన్ నుంచి చివరి వరకు ప్రేక్షకుల్ని అలరిస్తుంది'' అన్నారు.

ప్యారిస్‌లో ప్రేమ



● వరుణ్ ధావన్, జాన్వీ కపూర్

వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ జంటగా నటించిన హిందీ చిత్రం 'బవాల్'. 'దంగల్' ఫేమ్ నితేష్ తివారి దర్శకత్వంలో సాజిద్ నడియాద్‌వాలా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21 నుంచి అమేజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుక దుబాయ్‌లో జరిగింది. ఈ చిత్రంలో హిస్టరీ టీచర్ అజయ్‌గా వరుణ్ ధావన్, నిషాగా జాన్వీ నటించారు. అజయ్, నిషాలు వివాహం చేసుకుని హనీమూన్ కోసం ప్యారిస్ వెళతారు. అక్కడ వీరి మధ్య ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి? అనే కథాంశం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఈ సినిమా మేజర్ షూటింగ్ కూడా ప్యారిస్‌లోనే జరిగింది. అయితే ఈ మూవీలో రెండో ప్రపంచ యుద్ధానికి, వరుణ్–జాన్వీల ప్రేమకథకు ఉన్న సంబంధం ఏంటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంది'' చిత్ర యూనిట్ పేర్కొంది. 'ప్రతి ప్రేమ కథకు, ఆ ప్రేమ తాలూకు యుద్ధం ఉంటుంది' అన్న విజువల్స్ ట్రైలర్‌లో కనిపిస్తాయి.

తొలి అడుగు



● భద్ర, పద్మాకర్

భద్ర, పద్మాకర్ రావ్ హీరోలుగా, నేహా, అంజలి హీరోయిన్లుగా ఉప్పలపాటి శివ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. మిస్బా మూవీ మీడియాపై పద్మాకర్‌రావ్ చిన్నతోట, ఆర్.సువర్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం కడపలో ప్రారంభమైంది. పద్మాకర్‌రావ్ చిన్నతోట మాట్లాడుతూ–''పదహారేళ్లుగా మీడియా రంగంలో రాణిస్తున్న మా మిస్బా మూవీ మీడియా సంస్థ నిర్మాణ రంగంలో తొలి అడుగు వేసింది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు.



రెండో రౌండ్‌లో మానస్

వింబుల్డన్ జూనియర్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ బాలుర సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ మానస్ ధామ్నే శుభారంభం చేశాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన మానస్ ఆదివారం లండన్‌లో జరిగిన తొలి రౌండ్‌లో 6-2, 6-4తో ప్రపంచ జూనియర్ ర్యాంకింగ్స్‌లో 47వ స్థానంలో ఉన్న హేడెన్ జోన్స్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మానస్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు 14 విన్నర్స్ కొట్టి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

రన్నరప్ సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ25 మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి రన్నరప్‌గా నిలిచింది. థాయ్‌లాండ్‌లో జరిగిన సింగిల్స్ ఫైనల్లో సహజ 4-6, 0-6తో మనన్‌చాయ సావంగ్‌కెయి (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. 65 నిమిషాలు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఒక ఏస్ సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసి, తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయింది.



ఆసియా క్రీడలకు భారత చెస్ జట్టులో హంపి, హారిక



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల చెస్ ఈవెంట్‌లో పాల్గొనే భారత మహిళల, పురుషుల జట్లను ప్రకటించారు. మహిళల జట్టులో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలతోపాటు తమిళనాడుకు చెందిన ఆర్.వైశాలి, సవితాశ్రీ... ఢిల్లీ అమ్మాయి వంతిక అగర్వాల్ ఎంపికయ్యారు. పురుషుల జట్టులో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణలతోపాటు తమిళనాడు గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, మహారాష్ట్ర గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోషి గుజరాతి చోటు సంపాదించారు. 13 ఏళ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మళ్లీ చెస్ పునరాగమనం చేస్తోంది. 2006 దోహా ఆసియా క్రీడల్లో కోనేరు హంపి వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించింది. 2010 గ్వాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో హారిక వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

సింధు పరాజయం



కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 14-21, 15-21తో ప్రపంచ నంబర్‌వన్ అకానె యామగుచి (జపాన్) చేతిలో ఓడిపోయింది. 43 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు రెండో గేమ్‌లో ఒకదశలో 13-9తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైంది. అకానె చేతిలో సింధుకిది 11వ పరాజయం కావడం గమనార్హం. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్ లక్ష్య సేన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో ఉత్తరాఖండ్‌కు చెందిన లక్ష్య సేన్ 21-17, 21-14తో కెంటా నిషిమోటో (జపాన్)పై విజయం సాధించాడు. ఫైనల్లో లీ షి ఫెంగ్ (చైనా)తో లక్ష్య సేన్ ఆడతాడు.

భారత్ శుభారంభం

- తొలి టి20లో బంగ్లాదేశ్‌పై విజయం
- రాణించిన హర్మన్‌ప్రీత్
- రేపు రెండో టి20



అనూషకు క్యాప్ అందజేస్తున్న హర్మన్‌ప్రీత్

మిర్పూర్: భారత మహిళల జట్టు అలవోక విజయంతో బంగ్లాదేశ్ పర్యటనను మొదలు పెట్టింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో తొలి టి20లో భారత్ 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. షోర్నా అక్తర్ (28 బంతుల్లో 28 నాటౌట్, 2 సిక్సర్లు), శోభన మొస్తరి (33 బంతుల్లో 23; 2 ఫోర్లు), శతి రాణి (26 బంతుల్లో 22; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. భారత బౌలర్లలో పూజ వస్త్రకర్, మిన్ను మణి, షఫాలీ వర్మ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం ఏమంత కష్టం కానీ లక్ష్యాన్ని భారత అమ్మాయిల జట్టు 16.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది. టాపార్డర్‌లో ఓపెనర్ షఫాలీ వర్మ (0) డకౌటైంది. వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (11; 2 ఫోర్లు) నిరాశపరిచింది. 21 పరుగులకే 2 కీలక వికెట్లు కోల్పోయినప్పటికీ మరో ఓపెనర్ స్మృతి మంధాన (34 బంతుల్లో 38; 5 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మన్‌ప్రీత్ ఎలాంటి ఒత్తిడి లేకుండా యథేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఇద్దరు 9.1 ఓవర్ల పాటు క్రీజులో నిలిచి మూడో వికెట్‌కు 70 పరుగులు జోడించడంతో విజయం సులువైంది. జట్టు స్కోరు 91 పరుగుల వద్ద స్మృతి నిష్క్రమించింది. యస్తిక భాటియా (9 నాటౌట్; 1 ఫోర్) క్రీజులోకి రాగా... 15వ ఓవర్లో జట్టు స్కోరు వంద పరుగులను చేరుకుంది. 17వ ఓవర్ వేసిన సల్మా ఖాటున్ బౌలింగ్‌లో తొలి బంతిని సిక్సర్‌గా బాదిన హర్మన్‌ప్రీత్ 34 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకుంది. మరుసటి బంతిని బౌండరీ కొట్టి మ్యాచ్‌ను ముగించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి బారెడ్డి అనూష, కేరళ అమ్మాయి మిన్ను మణి ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన 20 ఏళ్ల అనూష పూర్తి కోటా (4-0-24-0) వేసినప్పటికీ వికెట్ దక్కలేదు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో హర్మన్ సేన 1-0తో ఆధిక్యంలో ఉండగా, మంగళవారం ఇదే వేదికపై రెండో టి20 జరుగుతుంది.

క్వార్టర్ ఫైనల్లో రుబ్లెవ్



రుబ్లెవ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో ఏడో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) తన కెరీర్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రుబ్లెవ్ 7-5, 6-3, 6-7 (6/8), 6-7 (5/7), 6-4తో అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. 3 గంటల 17 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రుబ్లెవ్ 21 ఏస్‌లు, బుబ్లిక్ 39 ఏస్‌లు సంధించడం విశేషం. మూడో సెట్ టైబ్రేక్‌లో మ్యాచ్ పాయింట్ చేజార్చుకున్న రుబ్లెవ్ చివరకు ఐదో సెట్‌లో విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో 26వ సీడ్ షపోవలోవ్ (కెనడా) 6-3, 3-6, 1-6, 3-6తో సఫీయులిన్ (రష్యా) చేతిలో ఓడిపోగా... ఎనిమిదో సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) 7-6 (7/4), 6-4, 6-3తో గలాన్ (కొలంబియా)పై గెలిచాడు. మూడో రౌండ్‌లో పదో సీడ్ టియాఫో (అమెరికా) 2-6, 3-6, 2-6తో దిమిత్రోవ్ (బల్గేరియా) చేతిలో ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో నాలుగో సీడ్ పెగూలా (అమెరికా) 6-1, 6-3తో సురెంకో (ఉక్రెయిన్)పై, వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 2-6, 6-4, 6-3తో బుజ్కోవా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. మూడో రౌండ్‌లో మిరా ఆంద్రీవా (రష్యా) 6-2, 7-5తో పొటపోవా (రష్యా)పై నెగ్గింది.

పోరాడి ఓడిన సాకేత్–యూకీ జోడీ

పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్), జీవన్ నెడుంజెళియన్–శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. సాకేత్–యూకీ ద్వయం 4-6, 6-4, 4-6తో ఫొకినా (స్పెయిన్)–మనారినో (ఫ్రాన్స్) జంట చేతిలో... బాలాజీ–జీవన్ జోడీ 6-7 (5/7), 4-6తో డోడిగ్ (క్రొయేషియా)–ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) ద్వయం చేతిలో పరాజయం పాలయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న (భారత్)–డబ్రౌస్కీ (కెనడా) జోడీ 7-6 (7/5), 3-6, 4-6తో డోడిగ్ (క్రొయేషియా)–లతీషా చాన్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడింది.

గెలిచి నిలిచిన ఇంగ్లండ్

- 'యాషెస్' మూడో టెస్టులో ఆస్ట్రేలియాపై 3 వికెట్లతో విజయం
- రాణించిన బ్రూక్, వోక్స్



హ్యారీ బ్రూక్

లీడ్స్: రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అద్వితీయ పోరాటం ఫలితమివ్వలేదు. కానీ హ్యారీ బ్రూక్ (93 బంతుల్లో 75; 9 ఫోర్లు) పట్టుదల, గెలవాలన్న క్రిస్ వోక్స్ (47 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు) కసి ఇంగ్లండ్ జట్టును మూడో టెస్టులో గెలిపించడమే కాదు... ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ కోల్పోకుండా నిలిపింది. నాలుగు రోజుల్లో ముగిసిన ఈ మూడో టెస్టులో ఇంగ్లండ్ 3 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై నెగ్గింది. ప్రస్తుతం 1-2తో వెనుకబడినప్పటికీ సొంతగడ్డపై సిరీస్‌ను గెలుచుకునేందుకు నాలుగు, ఐదో టెస్టుల రూపంలో ఆశలు సజీవంగా ఉన్నాయి. 251 పరుగుల లక్ష్యం ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 27/0తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసి గెలిచింది. ఆతిథ్య జట్టును ఓడించేందుకు ఆసీస్ సీమర్ మిచెల్ స్టార్క్ (5/78) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో హడలెత్తించాడు. ముందుగా డకెట్ (23; 3 ఫోర్లు)ను అవుట్ చేసి ఓపెనింగ్ జోడీని విడగొట్టాడు. తర్వాత వరుస విరామాల్లో మొయిన్ అలీ (5), కెప్టెన్ బెన్ స్టోక్స్ (13), బెయిర్‌స్టో (5)లను క్రీజులో కుదురుకోకుండా చేయడంతో ఇంగ్లండ్ ఒకదశలో 171 పరుగుల వద్ద 6 వికెట్లను కోల్పోయి పరాజయం అంచున నిలిచింది. ఈ దశలో మిడిలార్డర్ బ్యాటర్ బ్రూక్, టెయిలెండర్ వోక్స్‌తో కలిసి గెలిచేందుకు అవసరమైన పరుగుల్ని కూడగట్టారు. బ్రూక్ అర్ధసెంచరీ సాధించగా, విజయానికి 21 పరుగుల దూరంలో స్టార్క్ అతన్నీ అవుట్ చేయడంతో ఉత్కంఠ పెరిగింది. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన వోక్స్, మార్క్ వుడ్ (8 బంతుల్లో 16 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అండతో చేసిన అజేయపోరాటం ఇంగ్లండ్‌ను నిలబెట్టింది. నాలుగో టెస్టు ఈ నెల 19 నుంచి మాంచెస్టర్‌లో జరుగుతుంది.

వెర్‌స్టాపెన్ ఖాతాలో వరుసగా ఆరో విజయం

సిల్వర్‌స్టోన్: ఫార్ములావన్ తాజా సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన బ్రిటిష్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 52 ల్యాప్‌ల ఈ రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన ఈ నెదర్లాండ్స్ డ్రైవర్ అందరికంటే వేగంగా గంటా 25 నిమిషాల 16.938 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది వరుసగా ఆరో విజయం కావడం విశేషం. లాండో నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, హామిల్టన్ (మెర్సిడెస్) మూడో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం వెర్‌స్టాపెన్ 255 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. 22 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటివరకు 10 రేసులు ముగిశాయి. పదింటికి పది రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లే గెలుపొందడం విశేషం. వెర్‌స్టాపెన్ ఎనిమిది రేసుల్లో నెగ్గగా... మిగతా రెండింటిలో రెడ్‌బుల్‌కే చెందిన సెర్జియో పెరెజ్ విజయం సాధించాడు. సీజన్‌లోని తదుపరి రేసు హంగేరి గ్రాండ్‌ప్రి ఈనెల 23న జరుగుతుంది.



'క్వాలిఫయర్' విజేత శ్రీలంక

- ఫైనల్లో నెదర్లాండ్స్‌పై 128 పరుగులతో ఘనవిజయం
- అజేయంగా టోర్నీని ముగించిన షనక బృందం



హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఓటమి ఎరుగని శ్రీలంక జట్టే విజేతగా అవతరించింది. తద్వారా క్వాలిఫయర్-1 జట్టుగా భారత్ ఆతిథ్యమివ్వబోయే మెగా ఈవెంట్ బరిలో దిగనుంది. ఆదివారం జరిగిన 'క్వాలిఫయర్' ఫైనల్లో దాసున్ షనక సారథ్యంలోని శ్రీలంక జట్టు 128 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై భారీ విజయాన్ని సాధించింది. నెదర్లాండ్స్ టీమ్ క్వాలిఫయర్-2గా ఆడుతుంది. తుదిపోరులో మొదట బ్యాటింగ్ చేపట్టిన శ్రీలంక 47.5 ఓవర్లలో 233 పరుగుల వద్ద ఆలౌటైంది. సహన్ అరచిగే (57; 4 ఫోర్లు), కుశాల్ మెండిస్ (43; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అసలంక (36; 4 ఫోర్లు), హసరంగ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) పర్వాలేదనిపించారు. డచ్ బౌలర్లలో వాన్ బిక్, క్లెయిన్, విక్రమ్‌జీత్, జుల్ఫికర్ తలా 2 వికెట్లు తీశారు. తర్వాత నెదర్లాండ్స్ 23.3 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. మ్యాక్స్ ఓ డౌడ్ (33; 1 ఫోర్, 1 సిక్స్) టాప్ స్కోరర్! లంక బౌలర్లు తీక్షణ 4, మదుషంక 3, హసరంగ 2 వికెట్లు తీశారు. భారత్‌లో అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకు వన్డే ప్రపంచకప్ జరుగుతుంది. హైదరాబాద్‌లో అక్టోబర్ 6న నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌తోనే పాక్ పోరు మొదలవుతుంది. 12న శ్రీలంక, పాక్‌ల మ్యాచ్‌కూ హైదరాబాదే వేదిక.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **పోస్టుల వివరాలు:** చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్-01, చీఫ్ డేటా ఆఫీసర్-01, నాలెడ్జ్ కమ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్-06.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీసీఏ, ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 35 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.07.2023.
» **వెబ్‌సైట్:** https://ghmc.gov.in

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్‌లో 55 అప్రెంటిస్‌లు

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్‌లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 55
» **విభాగాలు:** కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్-కంట్రోల్ ఇంజనీరింగ్.

అర్హత

» **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.10,500 చెల్లిస్తారు.
» **టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.9400 చెల్లిస్తారు.
» **అప్రెంటిస్‌షిప్ వ్యవధి:** ఒక ఏడాది.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కుల ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.08.2023.
» **వెబ్‌సైట్:** www.ipr.res.in

ఎన్‌ఏఆర్‌ఎఫ్‌బీఆర్, హైదరాబాద్‌లో 46 ల్యాబ్ అటెండెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రీసెర్చ్(ఎన్‌ఏఆర్‌ఎఫ్‌బీఆర్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 46
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-03, టెక్నీషియన్1-08, ల్యాబ్ అటెండెంట్1-35.
» **అర్హత:** ఖాళీలని అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** టెక్నికల్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, టెక్నీషియన్‌కు 28 ఏళ్లు, ల్యాబ్ అటెండెంట్‌కు 25 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, ఎన్‌ఏఆర్‌ఎఫ్‌బీఆర్,జీనోమ్ వ్యాలీ, కొల్తూర్(పోస్టు),శామీర్‌పేట్(మ),హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.08.2023.
» **వెబ్‌సైట్:** www.narfbr.org

నార్త్ ఈస్టర్న్ రైల్వేలో 1104 యాక్ట్ అప్రెంటిస్‌లు

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్-నార్త్ ఈస్టర్న్ రైల్వే ఎన్‌ఈఆర్ పరిధిలోని వివిధ యూనిట్లలో అప్రెంటిస్‌షిప్ శిక్షణకు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1104
» **వర్క్‌షాప్/యూనిట్:** మెకానికల్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్),బ్రిడ్జ్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్ కంటోన్మెంట్),మెకానికల్ వర్క్‌షాప్(ఇజ్జత్ నగర్),డీజిల్ షెడ్(ఇజ్జత్ నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్(ఇజ్జత్ నగర్),క్యారేజ్ అండ్ వ్యాగన్(లక్నో జంక్షన్), డీజిల్ షెడ్(గోండా),క్యారేజ్ అండ్ వ్యాగన్(వారణాసి).
» **ట్రేడ్‌లు:**ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్. **అర్హత:** 50%మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 02.08.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.08.2023.
» **వెబ్‌సైట్:** https://rrcgorakhpur.net

ఎన్‌జేఐఎల్ అండ్ ఓఎండీ, ఆగ్రాలో 68 పోస్టులు

ఆగ్రాలోని ఐసీఎంఆర్-నేషనల్ జల్మా ఇన్‌స్టిట్యూట్ ఫర్ లెప్రసీ అండ్ అదర్ మైకోబాక్టీరియల్ డిసీజెస్.. రెగ్యులర్ టెక్నికల్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్1-35, ల్యాబొరేటరీ అటెండెంట్1-10, టెక్నికల్ అసిస్టెంట్-23.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, ఎన్‌జేఐఎన్ అండ్ ఓఎండీ, తాజ్‌గంజ్, ఆగ్రా చిరునామకు పంపించాలి. **దరఖాస్తులకు చివరితేది:** 28.07.2023.
» **వెబ్‌సైట్:** https://main.icmr.nic.in

పదితోనే కేంద్ర కొలువు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ).. మల్టీ టాస్కింగ్(నాన్-టెక్నికల్) స్టాఫ్, హవాల్దార్ (సీబీఐసీ అండ్ సీబీఎన్) ఎగ్జామ్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది! దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖలు, విభాగాలు, ట్రిబ్యునళ్లల్లో.. గ్రూప్-సి (నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. పదో తరగతితోనే కేంద్ర కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి అవకాశం ఇది. ఈ నేపథ్యంలో.. ఎస్‌ఎస్‌సీ ఎంటీఎస్(నాన్-టెక్నికల్), హవాల్దార్ పోస్టులు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» 1,558 ఎంటీఎస్, హవాల్దార్ పోస్టులకు ఎస్‌ఎస్‌సీ నోటిఫికేషన్
» టెన్త్‌తోనే కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-సి కొలువులు
» రాత పరీక్ష, ఫిజికల్ టెస్టులలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» రూ.18,000-రూ.56,900 వేతన శ్రేణి



ప్రభుత్వ ఉద్యోగం.. పదో తరగతి మొదలు ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణుల వరకు ప్రతి ఒక్కరి లక్ష్యం. పదో తరగతి అర్హతతోనే కేంద్ర కొలువు సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తోంది.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఎంటీఎస్(నాన్-టెక్నికల్), హవాల్దార్(సీబీఐసీ, సీబీఎన్) ఎగ్జామినేషన్.

మొత్తం 1,558 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ) తాజా నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో 1,558 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్) పోస్టులు 1,198; సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో 360 హవాల్దార్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

సదరన్ రీజియన్‌లో 207

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. రీజియన్ల వారీగా ఖాళీలను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన సదరన్ రీజియన్‌లో 207 పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమకు ఆసక్తి ఉన్న రీజియన్, పోస్టులను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. దాని ఆధారంగా పొందిన మార్కులు, ప్రతిభను పరిగణనలోకి తీసుకుని నియామకాలు ఖరారు చేస్తారు.

అర్హత

- పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ఆయా శాఖల నిబంధనలను అనుసరించి 01.08.2023 నాటికి 18-25 ఏళ్లు, 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో నిబంధనలకు అనుగుణంగా సడలింపు లభిస్తుంది.

మూడు దశల్లో ఎంపిక

ఎస్‌ఎస్‌సీ ఎంటీఎస్, హవాల్దార్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌ను హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకే నిర్వహిస్తారు.

రాత పరీక్ష.. 270 మార్కులు

ఎంటీఎస్, హవాల్దార్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష రెండు సెషన్లుగా 270 మార్కులకు ఉంటుంది. సెషన్ 1లో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ 20 ప్రశ్నలు-60 మార్కులకు; రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ 20 ప్రశ్నలు-60 మార్కులకు; అలాగే సెషన్ 2లో జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు-75 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-75 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఉంటుంది. ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సెషన్‌కు కేటాయించిన సమయం 45 నిమిషాలు. రెండో సెషన్‌లో మాత్రం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

13 భాషల్లో రాత పరీక్ష

ఎస్‌ఎస్‌సీ ఎంటీఎస్, హవాల్దార్ పరీక్షను 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. హిందీ, ఇంగ్లిష్‌తోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, కొంకణి, మళయాళం, మణిపురి, మరాఠీ, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో రాత పరీక్ష ఉంటుంది.

తదుపరి దశ పీఈటీ, పీఎస్‌టీ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, ఆయా విభాగాల్లో నిర్దేశించిన కటాఫ్ మార్కుల ఆధారంగా రాత పరీక్ష విజేతలను ప్రకటిస్తారు. వీరికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా నడక పరీక్ష ఉంటుంది. ఇందులో పురుష అభ్యర్థులు 1,600 మీటర్లను 15 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు ఒక కిలో మీటర్ దూరాన్ని 20 నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 157.5 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతీ విస్తీర్ణం 81 సెం.మీ ఉండాలి. శ్వాస తీసుకున్నప్పుడు అయిదు సెంటీ మీటర్లు విస్తరించాలి.
- మహిళా అభ్యర్థులు కనీసం 152 సెం.మీ ఎత్తు ఉండాలి.

కనీస అర్హత మార్కులు

రాత పరీక్ష నుంచి అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేసే క్రమంలో కనీస అర్హత మార్కుల నిబంధన విధించారు. ప్రతి సెషన్‌లో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 25 శాతం మార్కులు; ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. అదే విధంగా సెషన్-1లో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే.. సెషన్-2 పేపర్ల మూల్యాంకన చేస్తారు. సెషన్-2లో పొందిన ప్రతిభ ఆధారంగానే తుది జాబితా రూపొందిస్తారు.

కొలువు ఖాయమైతే

అన్ని దశల్లోనూ విజయం సాధించి కొలువు ఖరారు చేసుకుంటే.. ప్రారంభంలోనే పే లెవల్-1తో రూ.18,000-రూ.56,900 వేతన శ్రేణిలో నెల వేతనం అందుకోవచ్చు. బేసిక్ పేతోపాటు ఇతర అలవెన్సులు కూడా లభిస్తాయి. దీంతో పాటు అర్హతలు పెంచుకుంటూ ఆయా డిపార్ట్‌మెంట్‌లు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణతతో ఆయా శాఖల్లో సెక్షన్ ఆఫీసర్, సూపరింటెండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

విజయం సాధించాలంటే

సిలబస్‌పై అవగాహన

ప్రిపరేషన్ ప్రారంభించే ముందు.. అభ్యర్థులు సిలబస్‌ను సమగ్రంగా పరిశీలించాలి. పాత ప్రశ్న పత్రాలను విశ్లేషించాలి. దాని ఆధారంగా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. ఈ పరీక్షకు సంబంధించి పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. దీనివల్ల పరీక్షల్లో అడిగే ప్రశ్నల శైలిపై అవగాహన ఏర్పడుతుంది.

న్యూమరికల్, మ్యాథమెటికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం అర్థమెటిక్‌తోపాటు ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. నంబర్ సిస్టమ్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, పర్సంటేజెస్, రేషియోస్, ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, లీనియర్ ఈక్వేషన్స్, టాంజెంట్స్ వంటి ప్యూర్ మ్యాథ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.

రీజనింగ్ ఎబిలిటీ

గుర్తులు, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిలేషన్ షిప్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, సిమాటిక్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వెన్ డయాగ్రమ్స్, డ్రాయింగ్ ఇన్ఫరెన్సెస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

జాతీయ, అంతర్జాతీయ సమకాలీన పరిణామాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమీ,హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక, వాణిజ్య రంగాల్లో ఏర్పడిన కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించాలి. సీహెచ్‌ఎస్‌ఎల్ అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌ను కీలకంగా భావించాలి. ముఖ్యమైన సమకాలీన పరిణామాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. స్టాక్ జీకేకు సంబంధించి ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు, అవార్డులు-విజేతలు వంటి వాటిని ఔపోసన పట్టాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించేందుకు వ్యాకరణంపై పట్టు సాధించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్ మొదలు ప్యాసేజ్ కాంప్రహెన్షన్ వరకూ.. అన్ని రకాల గ్రామర్ అంశాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా యాక్టివ్ అండ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సినానిమ్స్, యాంటానిమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై పట్టు సాధించాలి.

పునశ్చరణ, మోడల్ టెస్టులు

అభ్యర్థులు నిరంతరం పునశ్చరణ కొనసాగించేలా ప్లాన్ చేసుకోవాలి. అదేవిధంగా ఒక టాపిక్ లేదా యూనిట్ చదవడం పూర్తయ్యాక..నమూనా పరీక్షలు, మాక్ టెస్ట్‌లు రాయాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయిలోని గణిత పుస్తకాలతో తమ ప్రిపరేషన్ ప్రారంభించాలి. వాటి ద్వారా ముందుగా కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత అప్లికేషన్ దృక్పథంతో ప్రాక్టీస్ చేయాలి. ఫలితంగా ఆయా అంశాలపై పట్టు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూలై 21, 2023
- **దరఖాస్తు సవరణ అవకాశం:** జూలై 26-28
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** సెప్టెంబర్‌లో నిర్వహించే అవకాశం
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ssc.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	505	65,280
నిఫ్టీ ▽	166	19,332


మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,661	▽	18
డోజోన్స్	33,735	▽	187
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,257	▽	24
డాక్స్	15,603	△	75
షాంఘై	3,197	▽	9
నికాయ్	32,388	▽	385


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

గెట్.. సెట్.. ఫారిన్!

చక్రవర్తి (40) ఐటీ టెక్నికల్ మేనేజర్. శుభ్ర (32) ఐటీ బిజినెస్ అనలిస్ట్. ఈ దంపతులు మెరుగైన ఉద్యోగ అవకాశాల కోసం, నాణ్యమైన జీవితం కోరుకుంటూ 2019లో విదేశానికి వెళ్లిపోయి స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. కెనడా శాశ్వత నివాస హోదా కోసం దరఖాస్తు చేసుకున్నారు. చివరికి 2022 మార్చిలో వీరు టొరంటోకు వెళ్లిపోయారు. ఇదొక్క ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు ఉన్నత విద్య పేరుతో వెళ్లి, కోర్సు ముగిసిన అనంతరం అక్కడే అవకాశాలు వెతుక్కుని స్థిరపడుతున్నారు. ఇక్కడ కెరీర్ మొదలు పెట్టిన వారు కూడా విదేశీ అవకాశాల కోసం అన్వేషిస్తున్నారు. కానీ, వలసపోవడం అంత సులభ ప్రక్రియ కాదు. దానికి చాలా సమయం తీసుకుంటుంది. అనుకున్న గడువు కంటే ముందుగా ఆరంభించాలి. దీనికి ఎన్నో పత్రాలు సమర్పించాలి. ముందస్తు ప్రణాళిక మేరకు నడుచుకుంటే అనుకున్న విధంగా విదేశీయానం సుఖవంతమవుతుంది. ఈ దిశగా ఆలోచన చేసే వారు నిపుణుల సూచనలు తెలుసుకోవడం వల్ల మెరుగైన ప్రణాళిక వేసుకోవడం సాధ్యపడుతుంది.



- విదేశాలకు వలస వెళ్లాలంటే చాలా అంశాలపై దృష్టి పెట్టాలి
- ఏ మార్గంలో వెళుతున్నారన్నది కీలకం
- ఒక్కో వీసాకు భిన్నమైన ప్రక్రియ, చార్జీలు
- వెళ్లే ముందే అక్కడి చట్టాలను తెలుసుకోవాలి
- కొన్ని నెలల ఖర్చులకు సరిపడా ఉంచుకోవాలి
- రెండు దేశాల కరెన్సీలను తీసుకెళ్లడం నయం
- ముందస్తు ప్రణాళికతో ఇబ్బందులు దూరం





'ప్యూ రీసెర్చ్' అధ్యయనం ప్రకారం ప్రపంచ దేశాల్లో ఉద్యోగ వలసలు భారత్ నుంచే ఎక్కువగా ఉంటున్నాయి. ''2020లో 1.79 కోట్ల మంది అంతర్జాతీయ వలసవాదుల మూలాలు భారత్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత 1.12 కోట్ల మంది మెక్సికో, 1.08 కోట్ల మంది రష్యా మూలాలు కలిగి ఉన్నారు''అని 'ప్యూ రీసెర్చ్' నివేదిక వెల్లడించింది. మన దేశం నుంచి ఏటా లక్షల సంఖ్యలో విదేశాలకు వలస పోతున్నట్టు ఈ నివేదికలోని గణాంకాలు తెలియజేస్తున్నాయి. ''విదేశీయాన ప్రక్రియను ముందుగా ప్రారంభించాలి. అప్పుడు అది సులభతరం అవుతుంది. ఏదైనా ఊహించని ఘటన ఎదురైనా ఎదురుకావచ్చు. మరో ఆరు నెలల్లో వెళ్లాలని అనుకుంటే ఇప్పుడే ఆ ప్రక్రియను ప్రారంభించాలి''అనిక్యానమ్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో క్యాలబ్రెస్ సూచించారు. క్యానమ్ అనేది న్యూయార్క్‌కు చెందిన బహుళజాతి పెట్టుబడుల నిర్వహణ సంస్థ.

వివరాలతో సరైన ప్రణాళిక ఎలా..?

చక్రవర్తి, శుభ్ర 2019లో కెనడా వెళ్లాలని ప్లాన్ చేసుకోగా, 2020లో కరోనా రాకతో ఆలస్యం అయింది. కాకపోతే భారత్‌లో వారు పనిచేస్తున్న కంపెనీయే ఇద్దరు బదిలీకి ఏర్పాట్లు చేయడంతో ఆలస్యమైనా సాఫీగా విదేశానికి తరలిపోయారు. కానీ, ప్రతి ఒక్కరికీ ఇలా జరగాలని లేదు. ''కొందరు విద్యార్థులుగానే విదేశాలకు వెళ్లి గ్రాడ్యుయేషన్ అయిన వెంటనే ఉద్యోగంలో చేరిపోతారు. కొందరు స్వదేశంలోనే విద్య పూర్తి చేసుకుని నిపుణులుగా తర్వాత విదేశీ ఉద్యోగానికి వెళ్లిపోతుంటారు. కొందరు వ్యాపారవేత్తలుగా వెళ్లి వ్యాపారాలు ప్రారంభిస్తుంటారు. చివరిగా పెట్టుబడి పెట్టడం ద్వారా కూడా విదేశీ పౌరసత్వం సొంతం చేసుకోవచ్చు''అని శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన గ్లోబల్‌గేట్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అభినవ్ లోహియా వివరించారు. విదేశంలో ఉద్యోగం సంపాదించి వలసపోవడం అన్నింటిలోకి ప్రముఖమైనది. 'ఎక్స్‌పాట్ ఇన్‌సైడర్ 2021' సర్వే ప్రకారం విదేశాల్లో పని చేస్తున్న 59 శాతం మంది భారతీయులు కెరీర్‌లో మెరుగైన అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లినవారే. అంతర్జాతీయంగా ఈ రేటు 47 శాతంగానే ఉంది. ఇలా విదేశాల్లో స్థిరపడిన భారతీయుల్లో 23 శాతం మంది సొంతంగా ఉద్యోగాన్ని వెతుక్కోగా, 19 శాతం మందిని అంతర్జాతీయ సంస్థలు సొంతంగా నియమించుకున్నాయి. 14 శాతం మందిని వారి సంస్థలే పంపించాయి. కేవలం 3 శాతం మంది వ్యాపారం పేరుతో విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. బ్రిటన్‌ను తీసుకుంటే భారత్ నుంచి ఎక్కువమంది స్కిల్డ్ వర్కర్ వీసా ద్వారానే అక్కడికి వెళుతున్నారు. 2022లో భారతీయులు 1,03,000 యూకే వీసాలను సొంతం చేసుకున్నారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 148 శాతం ఎక్కువ. 2022లో యూకే జారీ చేసిన వర్కర్ వీసాల్లో 46 శాతం భారతీయులకే దక్కాయి. జాబ్ ఆఫర్ ఉన్న వారికే స్కిల్డ్ వర్కర్ వీసా జారీ చేస్తారు. అభ్యర్థులకు ఇంగ్లిష్ ప్రావీణ్యం కూడా ఉండాలి''అని ఏవై అండ్ జే అసోసియేట్స్ డైరెక్టర్ యాష్ దుబాల్ తెలిపారు.



స్టూడెంట్ వీసా ద్వారా విదేశాలకు వెళ్లడం మరో మార్గం. ఇది పరోక్ష మార్గం కిందకు వస్తుంది. సాధారణంగా స్టూడెంట్ వీసా గడువు పూర్తయిన తర్వాత, విద్యార్థులు ఏడాది గడువుతో కూడిన విజిట్ పాస్ పొందొచ్చు. ఈ కాలంలో ఉద్యోగం వెతుక్కోవచ్చు. ఉద్యోగం పొందిన ఆరు నుంచి రెండేళ్ల అనంతరం (వివిధ దేశాల్లో వివిధ కాల వ్యవధి) శాశ్వత నివాస హోదా పొందొచ్చు. స్టూడెంట్ వీసా ఖర్చు అన్నది వివిధ దేశాల మధ్య మారిపోతుంటుంది. కొన్ని దేశాల్లో పౌరసత్వం కొనుగోలు చేసుకోవడం మరొక మార్గం. పరిమితి మేరకు పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈబీ-5 వీసా తీసుకోవచ్చు. అమెరికాలో ఈబీ-5 వీసా కోసం యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ సర్వీస్ ప్రాయోజిత ప్రాజెక్టులో పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. అమెరికాకు స్వల్ప వ్యవధిలోనే పౌరసత్వం ద్వారా వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఇది. విద్యార్థులు అయితే యూనివర్సిటీ ర్యాంకింగులు చూడాలి. కెరీర్ వృద్ధి, ఉద్యోగ స్థిరత్వాన్ని పరిశీలించాలి. వ్యాపారం ప్రారంభించేందుకు వెళ్లేవారు ముందే విజయావకాశాలను అంచనా వేసుకోవాలి.

వ్యయాలు చూడాలి..

ఏ దేశానికి, ఏ రూపంలో వెళ్లాలనే దాని ఆధారంగా ఖర్చు మారిపోతుంది. ఓ కంపెనీలో పనిచేసే నిపుణుడు అదే కంపెనీ ఉద్యోగిగా వేరే దేశానికి వెళ్లేట్టు అయితే టికెట్, రవాణా చార్జీలను పెట్టుకుంటే చాలు. ఇమిగ్రేషన్ చార్జీలను కంపెనీలే భరిస్తాయి. వీసా, లీగల్ ఫీజు వంటి ఇతర వ్యయాలు కూడా ఉంటాయి. ''నా స్నేహితులు కొందరు ఉద్యోగం కోసం ఇక్కడకు (కెనడాకు) వచ్చారు. తగిన ఉద్యోగం వెతుక్కునేందుకు కొన్ని నెలల పాటు ఇక్కడ ఉండాల్సి వచ్చింది. ఇక్కడ అద్దెలు చాలా ఎక్కువ. కనుక ఇక్కడకు వచ్చే వారు ముందుగానే ఈ ఖర్చుల గురించి తెలుసుకోవాలి. అందుకు సరిపడా బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసుకుని రావాలి. తమ ఖర్చులకు సరిపడా డబ్బు ఉన్నట్టు ఆధారాలు కూడా చూపించాలి''అని శుభ్ర తెలిపారు. కెనడాకు వెళ్లాలంటే ఒక వ్యక్తికి ఎంతలేదన్నా 15,500 కెనడియన్ డాలర్లు కావాలి. అదే దంపతులకు అయితే 21,000 డాలర్లు, పిల్లలతో వెళ్లాలంటే 30,000 డాలర్లు అవసరమవుతాయి. అమెరికాకు వెళ్లాంటే గ్రీన్ కార్డ్ కోసం కనీసం 1.8 మిలియన్ డాలర్ల పెట్టుబడి అవసరం అవుతుంది. అదే ఆస్ట్రేలియాకు వెళ్లాలంటే నలుగురు సభ్యుల కుటుంబానికి 30,000 నుంచి 40,000 ఆస్ట్రేలియన్ డాలర్లు కావాలి. ''ఈబీ-5 వీసా కోసం పెట్టుబడి వేర్వేరుగా ఉంటుంది. అమెరికా అయితే ఈబీ-5 వీసా ఖర్చు 8 లక్షల డాలర్లు. కెనడా అయితే 12 లక్షల కెనడియన్ డాలర్లు. ఈబీ-5 వీసాకు ముందు లోతైన పరిశీలన ఉంటుంది. సంబంధిత వ్యక్తి చేసే పెట్టుబడులకు మూలాలు, ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నది చూస్తారు. దీనికి అదనంగా అమెరికాలో పరిపాలనా, న్యాయపరమైన చార్జీలు 75,000 డాలర్లు అవుతాయి. అటార్నీ ఫీజులు 10,000-20,000 డాలర్లు పెట్టుకోవాలి. అదే యూకే అయితే స్కిల్డ్ వర్కర్ వీసా కోసం దరఖాస్తు ఫీజు 625 నుంచి 1,423 బ్రిటిష్ పౌండ్లు ఉంటుంది. హెల్త్‌కేర్ సర్‌చార్జీ మరో 624 బ్రిటిష్ పౌండ్ల వరకు ఉంటుంది. కస్టమ్స్ డ్యూటీ, హోటల్ తదితర చార్జీలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

వెళ్లే ముందుగా..

''విదేశానికి వలస వెళ్లే వరకు రెండు దేశాల కరెన్సీని దగ్గర ఉంచుకోవాలి. ఎందుకంటే కొత్త దేశానికి వెళ్లి సెటిల్ అవ్వడానికి ఎంత సమయం పడుతుందో తెలియదు. నివసించే దేశానికి సంబంధించి పన్ను నిబంధనలు, పౌర చట్టాల గురించి తెలుసుకోవాలి. విదేశాల్లో నివాస ప్రమాణాలు చాలా ఎక్కువ. కనుక తగినన్ని నిధులు సిద్ధం చేసుకుని వెళ్లాలి. పెద్ద మొత్తంలో ఖర్చులు ఎదురుకావచ్చు'' అని ఎప్సిలాన్ మనీ మార్ట్ ప్రాడక్ట్స్ హెడ్ నితిన్ రావు సూచించారు. ఇక బీమా తీసుకోవడం కూడా మర్చిపోవద్దు. చాలా దేశాల్లో దీన్ని తీసుకోవడం తప్పనిసరిగా అమల్లో ఉంది. తీసుకునే బీమాలో వేటికి కవరేజీ ఉంది, లేనిదీ తెలుసుకోవాలి. విదేశాలకు వెళ్లిన తర్వాత భారత్‌లో కేవైసీల్లో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. దేశీయంగా పెట్టుబడులు కలిగిన ఆర్థిక సంస్థలకు విదేశాల్లోని చిరునామా ఇవ్వాలి. ఎన్ఆర్ఐగా హోదా మార్చుకోవాలి. అప్పుడు స్వదేశంలో పెట్టుబడులు, పన్నుల బాధ్యతలు కొనసాగించుకోవచ్చు. విదేశాలకు తరలిపోయే వారు స్వదేశంలో విలువ తరిగిపోయే ఆస్తులను వదిలించుకుని వెళ్లడమే సరైనది. విలువ పెరిగే రియల్ ఎస్టేట్ వంటి ఆస్తులు ఉంటే వాటి సంరక్షణ బాధ్యతలను ఎవరో ఒకరు చూసేలా ఏర్పాటు చేసుకోవాలి. ఇలా అన్ని అంశాలను సమగ్రంగా తెలుసుకుని, అన్నీ విచారించుకుని, తగిన ప్రణాళికతో బయల్దేరితే విదేశీయానం సుఖవంతమవుతుంది.

క్యూ1 బిజినెస్ ఇండికేటర్స్ సానుకూలం: సీఐఐ సర్వే



న్యూఢిల్లీ: సీఐఐ బిజినెస్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ ఏప్రిల్-జూన్ (క్యూ1) త్రైమాసికంలో సానుకూలంగా నమోదయ్యింది. జనవరి-మార్చి మధ్య 64 వద్ద సూచీ ఉంటే, క్యూ1లో ఇది 66.1కి పెరిగింది. జీఎస్‌టీ వసూళ్లు, విమాన- రైలు ప్రయాణీకుల ట్రాఫిక్ వంటి అధిక ఫ్రీక్వెన్సీ సూచికల్లో ఆశావహ ధోరణి నమోదయ్యింది. ఈ మేరకు జరిగిన బిజినెస్ ఔట్‌లుక్ సర్వేలో 180కి పైగా సంస్థల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మెజారిటీ సంస్థల ప్రతినిధులు (63 శాతం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023-24) భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 6.7 శాతంగా ఉంటుందని అంచనా వేస్తు న్నా యి. 2022-23లో సంవత్సరంలో ఈ రేటు 7.2 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. 2022-23కన్నా వృద్ధి రేటు తగ్గడానికి ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులే కారణమని సర్వే పేర్కొంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు) ఆర్‌బీఐ 6.5 శాతం వద్దే యథాతథంగా కొనసాగిస్తుందన్న అభిప్రాయాన్ని 53 శాతం సంస్థల ప్రతినిధులు వ్యక్తం చేశారు. ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ పరిస్థితులు మెరుగుపడుతున్నాయన్న అభిప్రాయాన్ని 65 శాతంమంది వ్యక్తం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-7-2023	
విశాఖ	435-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	72.00
9-7-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	5.10

సోనా కామ్‌స్టార్ | ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 535

టార్గెట్: రూ. 624



ఎందుకంటే: ఆటో విడిభాగాల దిగ్గజం సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్(సోనా కామ్‌స్టార్) ఆదాయంలో డిఫరెన్షియల్ గేర్స్(32 శాతం), డిఫరెన్షియల్ అసెంబ్లీస్(23%), హైబ్రిడ్‌లకు స్టార్టర్ మోటార్స్(20%), ఐసీఈ స్టార్టర్ మోటార్స్ (16%), 2వీలర్ ఈవీ ట్రాక్షన్ మోటార్స్(4%) చొప్పున వాటా ఆక్రమిస్తున్నాయి. ఇక ఎగుమతుల వాటా 71%కాగా.. యూఎస్, యూరప్ అతిపెద్ద మార్కెట్లుగా నిలుస్తున్నాయి. వేగవంత వృద్ధిలో ఉన్న ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) విభాగం కంపెనీకి అదనపు బలాన్నివ్వనుంది. ప్రస్తుత ఆర్డర్ బుక్ రూ. 21,500 కోట్లలో ఈవీ నుంచే 77% లభించడం ఈ అంశాన్ని ధ్రువ పరుస్తోంది. కాగా.. సంప్రదాయ డిఫరెన్షియల్ విభాగంలోనూ కంపెనీ పటిష్ట పనితీరు చూపుతోంది. అంతేకాకుండా ఇతర విభాగాలైన ఈడీఎల్, ఏడీఏఎస్(ఇటీవ ల కొనుగోలు చేసిన నోవెలిక్ ద్వారా) ప్రొడక్టులలోనూ వృద్ధిని సాధిస్తోంది. అయితే ఐసీఈపై ఆధారపడుతున్న నేపథ్యంలో స్టార్టర్ మోటార్ బిజినెస్ నీరసిస్తోంది. అయినప్పటికీ జోరు చూపుతున్న ఈవీ బిజినెస్ ఈ లోటును పూడ్చుతోంది. తేలికపాటి వాహనాల(లైట్ వెహికల్స్) ఎలక్ట్రిఫికేషన్ ద్వారా కంపెనీ లబ్ది పొందనుంది. డ్రైవర్‌లైన్, మోటార్స్ విభాగాలు ఇందుకు సహకరించనున్నాయి. ఈవీ విభాగంలో పలు ప్రొడక్టులను ప్రవేశపెట్టనుండటంతో మార్కెట్లతో సంబంధంలేకుండా పురోగతిని సాధించే వీలుంది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకంలో భాగంగా ఈ ఏడాది(2023-24) ప్రొడక్టులకు అనుమతి లభిస్తే వచ్చే వచ్చే ఏడాది (2024-25) నుంచి అదనపు లబ్ధిని చేకూర్చనుంది.

ఎస్‌బీఐ | మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 593

టార్గెట్: రూ. 700




ఎందుకంటే: పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) గత ఆర్థిక సంవత్సరానికి(2022-23) వెలువరించిన వార్షిక నివేదికలో బ్యాలన్స్‌షీట్‌ను నిరంతరంగా పటిష్టపరచుకుంటున్న అంశాన్ని హైలైట్ చేసింది. నాయకత్వ స్థాయిని నిలుపుకుంటూ రావడంతోపాటు నిలకడగా మెరుగైన ఆర్‌వోఈని సాధిస్తున్నట్లు తెలియజేసింది. అత్యుత్తమ లోన్‌బుక్‌ను నిర్మించడంపై బ్యాంక్ ప్రత్యేక దృష్టిని కొనసాగిస్తోంది. ఒత్తిడికలిగిన ఆస్తులు(రుణాలు) తగ్గుతూ రావడం, పీసీఆర్ మెరుగుపడుతుండటం, గతేడాది రుణాల్లో నమోదైన 17 శాతం వృద్ధి తదితర అంశాలు లోన్ బుక్‌పై ప్రత్యేక దృష్టిని ప్రతిబింబిస్తున్నాయి. రిటైల్ రుణ విభాగం పన్నుకుముందు లాభం(పీబీటీ) రెండున్నర రెట్లు జంప్‌చేయగా.. కార్పొరేట్ విభాగం పీబీటీ అంతక్రితం ఏడాది(2021-22)లో 5 రెట్లు ఎగసింది. వెరసి గత 2020-23 మధ్య కాలంలో ఎస్‌బీఐ ఆర్జన వార్షిక ప్రాతిపదికన 51 శాతం దూసుకెళ్లింది. ఫలితంగా మార్చితో ముగిసిన గతేడాది బ్యాంక్ చరిత్రలోనే తొలిసారి రూ. 50,000 కోట్లకుపైగా నికర లాభాన్ని అందుకుంది. ఇక డిజిటల్ విభాగంలోనూ ఆకర్షణీయ పురోగతి సాధిస్తూ వస్తోంది. యోనో 14.3 కోట్ల డౌన్‌లోడ్స్ ద్వారా సరికొత్త రికార్డులకు తెరతీసింది. 6 కోట్ల రిజిస్టర్డ్ వినియోగదారులతో రోజుకి సగటున 10.3 మిలియన్ లాగిన్స్ ద్వారా చరిత్ర సృష్టిస్తోంది. గతేడాది రూ. 24,300 కోట్ల విలువైన 1.39 మిలియన్ల డిజిటల్ రుణాలు మంజూరు చేసింది. యోనో ద్వారా 64 శాతం పొదుపు ఖాతాలను తెరిచింది. ఆస్తుల(రుణాలు) నాణ్యతను మరింత మెరుగుపరచుకుంటూ పీసీఆర్‌ను 76 శాతానికి(కార్పొరేట్ బుక్‌లో 98.6 శాతం) చేర్చుకుంది.

డిజిటల్ ఎకానమీ అధ్యయనంపై కేంద్రం దృష్టి

ఏజెన్సీ నియామకంపై కసరత్తు

న్యూఢిల్లీ: దేశీ డిజిటల్ ఎకానమీ రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో వృద్ధి చెందనుందన్న అంచనాలను నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుత వాస్తవిక పరిమాణం ఎంత ఉందో తెలుసుకోవడంపై కేంద్రం దృష్టి పెట్టింది. దీనిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెన్సీని నియమించనున్నట్లు అధికారిక డాక్యుమెంటులో వెల్లడైంది. దీని ప్రకారం ఏజెన్సీల నుంచి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ (మెయిటీ) దరఖాస్తులను (ఆర్‌ఎఫ్‌పీ) ఆహ్వానించనుంది. ఎంపికయ్యే సదరు ఏజెన్సీ తొమ్మిది నెలల వ్యవధిలో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి 2029-30 వరకు డిజిటల్ ఎకానమీ పరిమాణం, అంచనాల గురించి ముసాయిదా నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. మదింపు ప్రక్రియలో భాగంగా రాష్ట్రాల ర్యాంకులు, డిజిటల్ ఎకానమీలో వాటి వాటా, అలాగే ఈ-కామర్స్, కొత్త టెక్నాలజీల ప్రభావం మొదలైన అంశాలను కూడా నివేదికలో పొందుపర్చాలి. దేశీ డిజిటల్ ఎకానమీ 2025 నాటికల్లా 1 లక్ష కోట్ల డాలర్ల స్థాయికి వృద్ధి చెందగలదన్న అంచనాల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.



స్థిరాదాయాన్నిచ్చే మార్గాలు ఏమిటి..?

నా వయసు 62 ఏళ్లు. స్థిరమైన ఆదాయం కోసం పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నాను. అందుబాటులో ఉన్న మార్గాలు ఏవి?

– నారాయణ్

విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపాలంటే అందుకు తగినంత నిధిని సమకూర్చుకుని ఉండాలి. ఈ నిధి నుంచి క్రమం తప్పకుండా ఆదాయం పొందడం ద్వారా సౌకర్యవంతమైన జీవితాన్ని గడపొచ్చు. సీనియర్ సిటిజన్లు సహజంగా సంప్రదాయ మార్గాలనే ఎంపిక చేసుకుంటూ ఉంటారు. అత్యవసరాల్లో కావాల్సినప్పుడు వెంటనే పొందే లిక్విడిటీ కూడా ఉండాలని కోరుకుంటారు. ఇన్వెస్ట్ చేయడానికి ముందు ప్రతీ నెలా ఎంత మొత్తం కావాలో నిర్ణయించుకోవాలి. ఇతర మార్గాల ద్వారా ఏదైనా ఆదాయం వస్తుంటే దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అంటే అద్దె రూపంలో ఆదాయం, పెన్షన్ లేదా మరొకటి కావచ్చు. ఏటా ఎంత మొత్తం పెట్టుబడి నుంచి కావాలో స్పష్టతకు రావాలి. ఒకవేళ ఏటా 4-6 శాతానికంటే ఎక్కువ కోరుకుంటుంటే అంచనాలను తగ్గించుకోవాల్సిందే. ఉదాహరణకు మీ పెట్టుబడి నిధి రూ.కోటి ఉందనుకుంటే వార్షికంగా ఉపసంహరించుకునే మొత్తం రూ.6 లక్షలకు మించి ఉండకూడదు. ఒకవేళ 6 శాతానికి మించి వెనక్కి తీసుకుంటే కనుక ఆ తర్వాతి సంవత్సరాల్లో తక్కువ ఆదాయానికి సిద్ధం కావాల్సిందే. ద్రవ్యోల్బణాన్ని విస్మరించడానికి లేదు. నేడు నెలవారీ ఖర్చులకు రూ.50,000 సరిపోతుంటే.. 5, 10, 15 ఏళ్ల తర్వాత ఈ మొత్తం చాలదు. ఆ సమయంలో ఇంకాస్త అధికంగా కావాల్సి ఉంటుంది. అందుకనే రిటైర్మెంట్ తీసుకున్న వారు ద్రవ్యోల్బణాన్ని తట్టుకుని రాబడులను ఇచ్చే మార్గాలను చూసుకోవాలి. అందుకని రిటైర్మెంట్ తర్వాత కూడా ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగించాలి. అప్పుడే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం మించి రాబడులకు అవకాశం ఉంటుంది. పెట్టుబడుల మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయకూడదు. 30-40 శాతం చాలు. మిగతా మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లోనే ఉంచాలి. ప్రభుత్వ హామీతో కూడిన పథకాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్), పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక ఇన్వెస్టర్ ఈ పథకాలు అన్నింటిలోనూ కలిపి రూ.24.5 లక్షలు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మిగిలిన మొత్తాన్ని అధిక నాణ్యతతో కూడి డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా 30-40 శాతం మేర ఉండేలా ఏడాదికోసారి పెట్టుబడులను మార్పులు (అస్సెట్ రీబ్యాలన్స్) చేసుకోవాలి.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



ఆర్థిక ప్రణాళికను రూపొందించుకునే విషయంలో ఏ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి?

– రేవతి

మీ అవసరాలకు అనుగుణమైన ప్రణాళికను రూపొందించుకోవడమే ప్రాథమిక కర్తవ్యంగా ఉండాలి. చేతిలో అవసరాలకు కొంత నగదు, అత్యవసర నిధి ఏర్పాటు, జీవిత బీమా, ఆరోగ్య బీమాకు చోటు ఇవ్వాలి. ఆ తర్వాత మీ ఆకాంక్షల విషయానికి రావాలి. మీ పొదుపు, పెట్టుబడులకు స్థాయికి తగ్గట్టు వీటిని మార్చుకోవచ్చు. ఆర్థిక ప్రణాళిక రూపొందించుకునేందుకు కచ్చితమైన సూచనలు అంటూ ఉండవు. ఒక్కొక్కరికి సంబంధించి ఒక్కో రకంగా ఉంటుంది. ఎవరికి వారు తమ అవసరాలకు తగ్గట్టుగా దీన్ని డిజైన్ చేసుకోవాలి.

క్లుప్తంగా...

ఎన్జీరంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ కోటా ఫీజుల తగ్గింపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ఎన్ఆర్ఐ కోటాలో వివిధ కోర్సులలో ప్రవేశాలకు ఫీజులు తగ్గిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ ఫీజును రూ.5 వేల డాలర్ల నుంచి రూ.4 వేల డాలర్లకు తగ్గించటం జరిగిందని పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ కోటా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీల్లో ముగిసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2023–24 విద్యాసంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 5 నుంచి నిర్వహిస్తోన్న ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారంతో ముగిసింది. క్రీడా, ఎన్సీసీ, దివ్యాంగులు, సైనికోద్యోగులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీల్లో అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. స్పోర్ట్స్ కేటగిరీ కింద 635 మంది, ఎన్సీసీ అభ్యర్థులు 884 మంది, దివ్యాంగ అభ్యర్థులు 204 మంది, సైనికోద్యోగుల పిల్లలు కోటా అభ్యర్థులు 190 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అభ్యర్థులు 165 మంది హాజరైనట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు చెప్పారు. ఈ నెల 13న ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామన్నారు.

'ప్రశస్త' ద్వారా దివ్యాంగ బాలల గుర్తింపు

సాక్షి, అమరావతి: ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి.. వారి సమగ్ర వివరాలను 'ప్రశస్త' యాప్‌లో నమోదు చేస్తున్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ రూపొందించిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో సమగ్ర శిక్ష ద్వారా అమలు చేస్తున్నారు. పిల్లల సంరక్షణ కేంద్రాలతో పాటు ప్రభుత్వ విద్యా సంస్థల్లోని సిబ్బంది గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. 21 రకాల దివ్యాంగులను గుర్తించేందుకు 63 ప్రశ్నలను యాప్‌లో పొందుపరిచారు. పిల్లల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ప్రత్యేక అవసరాలున్న 36 వేల మంది పిల్లలను గుర్తించారు. వారికి ధ్రువపత్రాలు అందిస్తున్నారు. తద్వారా తగిన వైద్య సేవలు, సహాయక చర్యలు, సంక్షేమ కార్యక్రమాలను అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

వియత్నాం చేరుకున్న 'కిర్పాన్'



వియత్నాం సాగర జలాల్లో కిర్పాన్ యుద్ధ నౌక

సాక్షి, విశాఖపట్నం: వియత్నాంతో బలపడుతోన్న ద్వైపాక్షిక సంబంధాల్ని మరింత దృఢం చేసుకునే లక్ష్యంతో ఆ దేశానికి కానుకగా ఇచ్చిన ఐఎన్ఎస్ కిర్పాన్ యుద్ధ నౌకకు వియత్నాం దేశ నౌకాదళం నుంచి ఘన స్వాగతం లభించింది. విశాఖలోని నేవల్ డాక్ యార్డు నుంచి గత నెల 28న బయలుదేరిన కిర్పాన్.. వియత్నాంలోని కామ్‌రాన్ ఇంటర్నేషనల్ పోర్టుకు ఆదివారం చేరుకుంది. ఇటీవల వియత్నాం రక్షణ మంత్రి జనరల్ ఫాన్‌వాన్ జియాంగ్ భారత పర్యటనకు వచ్చిన సమయంలో యుద్ధ నౌకని కానుకగా ఇస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధం బలోపేతం అయ్యేందుకు మాత్రమే కిర్పాన్‌ని బహుమతిగా ఇచ్చామని భారత్ చెబుతున్నా.. దక్షిణ చైనా సముద్ర తీరంలో చైనా కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయడానికి వీలు కలుగుతుందన్న ఉద్దేశంతోనే భారత్ ఈ అడుగులు వేసినట్లు సమాచారం. ఈ నెలాఖరు వరకు వియత్నాం నౌకాదళానికి కిర్పాన్ కార్యకలాపాలు, పని తీరుపై శిక్షణ అందించిన తర్వాత.. భారత నౌకాదళ సిబ్బంది తిరుగు ప్రయాణం అవుతారని తూర్పు నౌకాదళాధికారులు తెలిపారు.


ఎస్ఆర్కే కళాశాలకు అటానమస్ హోదా



అటానమస్ హోదా సర్టిఫికెట్ అందుకుంటున్న ఏకాంబరం నాయుడు, శ్రీకృష్ణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్ఆర్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదాను ప్రదానం చేసిందని కళాశాల సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ తెలిపారు. పదేళ్ల పాటు స్వయం ప్రతిపత్తి హోదాను యూజీసీ మంజూరు చేసిందని చెప్పారు. దీనివల్ల బీటెక్, ఎంటెక్, ఎంబీఎ, ఐఎంబీఎ, ఎంసీఏ కోర్సుల నందు పారిశ్రామిక రంగాలకు అవసరమైన నూతన కోర్సులు నేర్చుకొనుటకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. అటానమస్ హోదా సాధించినందుకు కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, ఏవో ప్రతాప్, అన్ని విభాగాధిపతులకు అభినందనలు తెలిపారు.

ఇక సులభంగా సరుకు రవాణా



పారిశ్రామిక ప్రాంతాల వద్ద నదుల్లో రో-రో సర్వీసులు

తొలి దశలో ముక్త్యాల, ఇబ్రహీంపట్నం, సీతానగరం వద్ద ఏర్పాటు

- దీజిల్ వినియోగం తగ్గడం ద్వారా రూ.183 కోట్ల విదేశీ మారకం ఆదా
- ఆర్థిక వ్యవస్థలోకి రూ. 852 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా
- మూడు నెలల్లో పనులు ప్రారంభించేలా ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: భూమిపైన ఉన్న జల మార్గాలను వినియోగించడం ద్వారా ఇంధనం, సమయం ఆదా చేసే దిశగా ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ అడుగులు వేస్తోంది. దీనికోసం రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి నదుల్లో రోరో సర్వీసుల (ఒకేసారి 15 వరకు సరుకు రవాణా వాహనాలను తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న పెద్ద సైజు పడవలు)ను ప్రవేశపెట్టడంపై దృష్టిసారించింది. నదులపై వంతెనలు లేని చోట, సరుకు రవాణా వాహనాలు అవతలి తీరానికి చేరాలంటే సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి వస్తున్న ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ రోరో సర్వీసులను ప్రారంభించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా తొలి దశలో ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల, ఇబ్రహీంపట్నం, తూర్పుగోదావరి జిల్లా సీతానగరం వద్ద రోరో సర్వీసు పనులను మూడు నెలల్లో ప్రారంభించాలని నిర్ణయించినట్లు ఏపీ ఇన్‌లాండ్‌వేస్ అథారిటీ సీఈవో ఎస్‌వీకే రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. కృష్ణా నది తీరంలో ఎన్టీఆర్ జిల్లా వైపు ఉన్న ముక్త్యాల వద్ద అధికంగా సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయి. అక్కడ వంతెన లేకపోవడంతో ఆ పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు కావాలన్నా, ఉత్పత్తి అయిన సిమెంట్‌ను సరఫరా చేయాలన్నా మరోవైపు ఉన్న పల్నాడు జిల్లాకు 125 కి.మీ ప్రయాణించాల్సి వస్తోంది. ఇందుకోసం ముక్త్యాలకు అవతలి గట్టున ఉన్న మాదిపాడును కలుపుతూ రోరో సర్వీసులను ప్రవేశపెడతామని, దీని వల్ల ప్రయాణ సమయంతో పాటు ఇంధనం గణనీయంగా కలసి వస్తుందన్నారు. ముక్త్యాల నుంచి రోజుకు 500 ట్రక్కులు ప్రయాణిస్తున్నట్లు తమ సర్వేలో తేలిందని, రోరో సర్వీసులు ప్రవేశపెట్టడం ద్వారా ఏడాదికి 9.2 మిలియన్ లీటర్ల డీజిల్ వినియోగం తగ్గడం ద్వారా రూ. 103 కోట్ల విదేశీ మారక నిల్వలు ఆదా అవనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు ఏడాదికి రూ. 497 కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు.

అదేవిధంగా పోలవరం పునరావాస గ్రామాలకు నిర్మాణ సామగ్రిని తరలించడం కోసం గోదావరి నదిపై సీతానగరం–తాడిపూడి వద్ద రోరో సర్వీసులు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కూడా ఈ సర్వీసులు ప్రవేశ పెట్టేలా ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ సర్వీసుల ద్వారా సరుకు రవాణా వ్యయం టన్నుకు రూ.2.50 వరకు తగ్గుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఈ మూడు సర్వీసుల ద్వారా ఏటా డీజిల్ వినియోగం తగ్గడం ద్వారా రూ. 183 కోట్ల విదేశీ మారకం ఆదాతో పాటు ఆర్థిక వ్యవస్థకు రూ. 852 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నామన్నారు.

విజయవాడ నుంచి శ్రీశైలానికి నదీమార్గం..

త్వరలోనే విజయవాడ చుట్టుపక్కల ఏడు ప్రధాన దేవాలయాలను ఒకే రోజు సందర్శించి వచ్చే విధంగానూ, విజయవాడ నుంచి శ్రీశైలానికి నదీమార్గంలో వెళ్లే విధంగానూ లాంచీ సర్వీసులను ప్రవేశపెట్టే విధంగా ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.

రోరో అంటే..

రోరో అంటే రోల్ ఆన్.. రోల్ ఆఫ్ పడవలు (ఫెర్రీ). ఇవి పెద్దగా ఉండటం వల్ల వీటి లోపలికి వాహనాలను నేరుగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోవచ్చు. అలాగే దిగవచ్చు. తక్కువ దూరంలోని రెండు తీరాల మధ్య నదిలో నడపడానికి ఇవి వీలుగా ఉంటాయి. తీరంలో వీటి కోసం ప్రత్యేకంగా ర్యాంపులు నిర్మిస్తారు. సరుకు రవాణా వాహనాలతో పాటు సాధారణ కార్లు, ప్రజలు కూడా వీటిలో ప్రయాణించేందుకు వీలుంటుంది. వంతెనలను కట్టడానికి వీలులేని ప్రదేశాల్లో పెద్ద నదులను దాటాల్సిన చోట వీటిని ఏర్పాటు చేస్తే సమయం, ఇంధనం కూడా ఆదా అవుతుంది. వీటిని తొలిసారి మన దేశంలో గుజరాత్ రాష్ట్రంలోని గోఘా, దహెజ్ మధ్య ప్రవేశపెట్టారు.

ఇ వీ లా భా లు

ముక్త్యాల (కృష్ణానది)
- స్టేట్ హైవే 34, 216 గుండా 500 లారీల ప్రయాణం
- రోరో ఏర్పాటు ద్వారా తగ్గనున్న 125 కి.మీ దూరం
- ఒక ట్రిప్‌కు తగ్గనున్న 40 గంటల ప్రయాణ సమయం
- తద్వారా ఏడాదికి 9.2 లక్షల లీటర్ల ఇంధనం ఆదా
- ఏడాదికి రూ. 103 కోట్ల విదేశీ మారక నిల్వలు ఆదా
- ఆర్థిక వ్యవస్థకు రూ. 497 కోట్ల ఆదాయం

ఇబ్రహీంపట్నం (కృష్ణానది)
- జాతీయ రహదారి 30, 65 నుంచి రోజుకు 300 లారీల ప్రయాణం
- రోరో ద్వారా తగ్గనున్న 70 కి.మీ దూరం
- ట్రిప్‌కు తగ్గనున్న 24 గంటల ప్రయాణ సమయం
- ఏడాదికి 3.2 మిలియన్ లీటర్ల ఇంధనం ఆదా
- రూ. 36 కోట్ల ఆదా కానున్న విదేశీ మారక నిల్వలు
- ఆర్థిక వ్యవస్థకు రూ. 157 కోట్ల ఆదాయం

సీతానగరం (గోదావరి)
- పోలవరం పునరావాస గ్రామాల నిర్మాణానికి రోజుకు 300 ట్రక్కుల ప్రయాణం
- రోరో ద్వారా తగ్గనున్న 75 కి.మీ దూరం
- ఒక ట్రిప్‌కు తగ్గనున్న 24 గంటల ప్రయాణ సమయం
- ఏడాదికి 3.42 మిలియన్ లీటర్ల ఇంధనం ఆదా
- ఆదా కానున్న రూ.44 కోట్ల విదేశీ మారక నిల్వలు
- ఆర్థిక వ్యవస్థకు రూ. 198 కోట్ల ప్రయోజనం

శ్రీకాళహస్తిలో ఘోర ప్రమాదం

- లారీని ఢీకొట్టిన కారు • ఆరుగురు మృతి • మరొకరికి తీవ్ర గాయాలు

- త్రిపురాంతకం వద్ద మరో ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి
- మరో 10 మందికి గాయాలు



శ్రీలత(ఫైల్)



రమేష్‌బాబు, రాజేశ్వరి దంపతులు(ఫైల్)



మూర్తి, రమణి దంపతులు, వారి కుమార్తె అక్షయ(ఫైల్)

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లారీని ఓవర్‌టేక్ చేసిన కారు ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ దుర్ఘటనలో విజయవాడకు చెందిన ఆరుగురు మృత్యువాతపడగా.. ఓ యువకుడు గాయాలతో మిట్టకండ్రిగ వద్ద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఐ అంజు యాదవ్ కథనం ప్రకారం.. విజయవాడ కృష్ణలంకలోని బాలాజీ టవర్స్ 304 ఫ్లాట్‌లో ఉంటున్న తుంగల రమేష్‌బాబు, ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), కుమారుడు భరత్(ఇంటర్), విజయవాడ సమీపంలోని ఉయ్యూరులో ఉంటున్న రాజ్యలక్ష్మి అక్క శ్రీలత(42), కృష్ణలంక ప్రాంతంలోని బాలాజీనగర్ పోలీస్ కాలనీలో ఉంటున్న రాజ్యలక్ష్మి స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త మూర్తి(47), కుమార్తె అక్షయ(17)లు కారులో శుక్రవారం రాత్రి తిరుమలకు బయలుదేరారు. శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం వేకువజామున తిరుగుపయనమయ్యారు. అలిపిరి వద్ద టిఫిన్ చేసి అక్కడి నుంచి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రేణిగుంటలో భోజనం చేసి కారులో శ్రీకాళహస్తికి బయలుదేరారు. శ్రీకాళహస్తి రెండు కిలోమీటర్ల దూరం ఉందనగా.. మిట్టకండ్రిగ వద్ద రమేష్‌బాబు నడుపుతున్న కారు ఓ లారీని ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న మరో లారీని వేగంగా ఢీకొట్టింది. కారు నడుపుతున్న తుంగల రమేష్‌బాబు, భార్య రాజ్యలక్ష్మి(40), ఆమె అక్క శ్రీలత(42), స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త మూర్తి(47), కుమార్తె అక్షయ(17) అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఇంటర్మీడియెట్ చదువుతున్న తుంగల భరత్ ఒక్కడే గాయాలపాలై ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాలను కారులోంచి బయటకు తీసేందుకు రెండు గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. డ్రైవింగ్ చేస్తున్న రమేష్ మృతదేహం ఎంతకీ రాకపోవడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించి ఆపై కట్టర్లతో కారు డోరును కత్తిరించాల్సి వచ్చింది. ప్రమాదం కారణంగా పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

అమ్మా, నాన్న ఏమయ్యారు

ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన భరత్ 'సార్.. అమ్మా, నాన్న ఏమయ్యారు. పెద్దమ్మ (శ్రీలత) ఏమైంది. వారు ఎక్కడ ఉన్నారు. నన్నెందుకు ఇక్కడకు తీసుకొచ్చారు. కారు ఎక్కడ ఉంది' అని కన్నీటి పర్యంతమవుతూ పోలీసులతో మాట్లాడిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఆ యువకుడు ఎక్కడ షాక్‌కు గురవుతాడోనన్న ఉద్దేశంతో నిజాన్ని దాచిపెట్టిన పోలీసులు తల్లిదండ్రులు వేరే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పి ఊరడించారు. భరత్ కుడికాలు నుజ్జవడంతో వైద్యులు వెదురు కర్రలు పెట్టి కట్టుకట్టి చికిత్స అందిస్తున్నారు. భరత్ రేణిగుంటలో భోజనం అనంతరం నిద్రపోతానని కారు వెనుక సీట్లోకి వెళ్లాడు. ఆపై నిద్రలోకి జారుకున్నాడు. మిట్టకండ్రిగ వద్ద పెద్ద శబ్దం రావడంతో మెలకువవచ్చి చూడగా.. కారు సీటుకింద ఇరుక్కుపోయి శరీరం నుంచి రక్తమోడింది. ఆ వెంటనే స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు వెంటనే గుర్తించి కారు డోరును తెరిచి కొన ఊపిరితో ఉన్న భరత్‌ను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

త్రిపురాంతకం వద్ద ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

త్రిపురాంతకం: ఆర్టీసీ బస్ లారీని ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్ మృతి చెందగా.. మరో 10 మంది తీవ్రంగా గాయపడిన ఘటన ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం శ్రీనివాస నగర్ సమీపంలో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. కర్నూలు వెళ్తున్న కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీనివాసనగర్ సమీపంలో హైవేపై తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో వెళ్తోంది. మూల మలుపు వద్ద ఎదురుగా రెండు కార్లు ఓవర్‌టేక్ చేసుకుంటూ దూసుకురాగా.. ఎదురుగా వెళ్తున్న లారీ డ్రైవర్ బ్రేకేసి స్లో చేసి పక్కకు తీసే క్రమంలో ఆ వెనుకే వస్తున్న ఆర్టీసీ బస్సు లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ భైరవమూర్తి, విశ్రాంతి తీసుకుంటున్న రెండో డ్రైవర్ రాజుతోపాటు బస్సులో ప్రయాణిస్తున్న వి.నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఆర్.రాము, జి.వెంకట సుబ్రహ్మణ్యం, సుగుణ, కృష్ణవంశీ, ఉమాదేవి, మస్తాన్‌బీ తదితరులు గాయపడ్డారు. క్షతగాత్రులు మార్కాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్ భైరవమూర్తిని మార్కాపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గాయపడిన వారిలో ఎక్కువ మంది కాకినాడ, ఏలూరు ప్రాంతాలకు చెందినవారు.

ఇక కొండలపై మొక్కల పెంపకం



సీడ్ బాల్స్ విధానంలో ఒక్కో మొక్క పెంపకానికి అర్థరూపాయి ఖర్చు

- 'ఉపాధి' పథకంలో ఒకే రోజు కోటి మొక్కలను విత్తనున్న గ్రామీణాభివృద్ధి శాఖ
- ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు కొండల గుర్తింపు
- ఉసిరి, సీతాఫలం, రేగు, కుంకుడు మొక్కలకు ప్రాధాన్యం

సాక్షి, అమరావతి : గ్రామీణ ప్రాంతాల్లోని కొండలపై ఈ వర్షాకాలంలో ఒకే రోజు కోటి పండ్ల మొక్కలు నాటేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సిద్ధమైంది. ఉపాధి హామీ పథకంలో.. కొండలపై మొక్క బతికేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఒక్కో మొక్కపై కేవలం అర్థరూపాయి ఖర్చుతో అధికారులు ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. సాధారణంగా మొక్కల పెంపకంలో ఒక్కో మొక్క నాటాలంటే.. గుంత తీసేందుకు కనీసం రూ.25, మొక్క కొనుగోలుకు రూ.25 నుంచి రూ.50.. ఇలా ఒక్కో మొక్కకే రూ.50 నుంచి 100 దాకా ఖర్చవుతుంది. అయితే సీడ్ బాల్స్ విధానంలో ఒక్కో మొక్కపై కేవలం అర్థరూపాయి మాత్రమే ఖర్చుపెట్టేలా కొండలపై ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. సేంద్రియ ఎరువులతో కూడిన పోషకాలు ఎక్కువగా ఉండే మట్టిని సిద్ధం చేసుకుని.. ఆ మట్టిని ఉండలు ఉండలుగా చేస్తారు. ఒక్కో ఉండలో నాటాల్సిన మొక్కకు సంబంధించిన విత్తనాన్ని ఉంచుతారు. ఎలాంటి నేలలోనైనా నామమాత్రపు తేమకే ఆ విత్తనం మొలకెత్తేలా ఆ మట్టి ఉండలు(సీడ్స్ బాల్స్) అత్యంత నాణ్యంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. విత్తనం, మట్టి ఉండల తయారీకి అయ్యే ఖర్చు కూడా ఒక్కో దానికి అర్థరూపాయి లోపే ఉంటుందంటున్నారు.

కనీసం వెయ్యి కొండల్లో పదివేల చొప్పన..

ఈ వర్షాకాలంలో కొండలపై కోటి మొక్కలు పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ.. రాష్ట్రమంతటా ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు మండలానికి రెండేసి కొండలను ఎంపిక చేసుకోనుంది. మండలానికి కనీసం ఒక్క కొండపైనైనా ఈ సీడ్ బాల్స్ విధానంలో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఇలా రాష్ట్రంలో 660 మండలాల్లో కనీసం వెయ్యి కొండల్లో ఒక్కో కొండపై పది వేల చొప్పున మొక్కల పెంపకాన్ని చేపడతారు. ఉపాధి హామీ పథకం, వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో భాగంగా గతంలో కూలీల ద్వారా వర్షం నీరు నిల్వలకు ట్రెంచ్‌ల తవ్వకం జరిపిన కొండలను ఎక్కువగా ఈ కార్యక్రమానికి ఎంపిక చేస్తారు. కాగా, సీతాఫలం, ఉసిరి, రేగు వంటివాటితో పాటు కుంకుడు, వెలగ వంటి వాటినే ఈ మొక్కల పెంపకం కార్యక్రమంలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు అధికారులు వెల్లడించారు. నీడకు పనికొచ్చే వేప, కానుగ మొక్కలను కూడా పెంచుతారు. కొండల గుర్తింపు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి.. వర్షాకాలం మధ్య కల్లా కార్యక్రమాన్ని చేపడతామని అధికారులు వెల్లడించారు.

బూతు 'కూన'ల బరితెగింపు

శ్రీకాకుళంలో కూన బ్రదర్స్ బూతుల పంచాంగం

- విద్యుత్తు శాఖ ఏఈని ఫోన్‌లో బెదిరించిన రవికుమార్
- గతంలో ఎమ్మార్వో, సీఐ, ఎంపీడీవో, వీఆర్వోపై పరుష పదజాలం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అధికారంలో లేకున్నా వారి ఆగడాలకు అంతులేదు. ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించడం, దూషించడం 'బూతుల బ్రదర్స్'కు నిత్యకృత్యంగా మారింది. శ్రీకాకుళం జిల్లాలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగడాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయి. గతంలో పలువురు ప్రభుత్వ అధికారులను దుర్భాషలాడిన రవికుమార్ తాజాగా పొందూరు విద్యుత్తు శాఖ ఏఈని ఫోన్‌లో బెదిరించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఉద్యోగం చేయాలని లేదా..?

'కాస్త మర్యాదగా ఉద్యోగాలు చేయడం నేర్చుకో..! నీకు సరీస్ లేదా? ఉద్యోగం చేయవా నువ్వు...? (రాయలేని భాషలో తిడుతూ) నాకు రూల్స్ చెబుతావా? తమాషాలు దొబ్బుతున్నావా? విద్యుత్ మీటర్ విషయంలో నా మనిషికే నోటీసు ఇస్తావా? డిస్ కనెక్ట్ చెయ్.. జీవితంలో ఇంత పెద్ద తప్పు చేశానా అని బాధపడే రోజు వస్తుంది చూడు నీకు... గుర్తు పెట్టుకో.. నువ్వు ముందు నోటీసు విత్‌డ్రా చేసుకో. ఎవడా డీఈ...? నా కొడుకు.. ఆడికి చెప్పు.. మళ్లీ నీకు చెబుతున్నా వెధవ వేషాలు వేశావా.. మళ్లీ జీవితంలో కోలుకోలేవు..' అంటూ పొందూరు ఎలక్ట్రికల్ ఏఈ పైడి దుర్గాప్రసాద్‌ను కూన రవికుమార్ బెదిరించాడు. ఈ ఘటన మూడు నెలల క్రితం జరగ్గా ఆ సంభాషణ ఆలస్యంగా వెలుగు చూసింది. ఇలాంటి వ్యక్తులు పొరపాటున ఎన్నికైతే ప్రజలను, ఉద్యోగులను బతకనిస్తారా? అనే చర్చ సర్వత్రా జరుగుతోంది.

తాజా బాగోతమిది

పొందూరులో 'గరుడ' పేరుతో రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసిన టీడీపీ ఎంపీటీసీ బాడాన గిరి అనుమతి లేకుండా విద్యుత్ మీటర్‌ను అమర్చారు. పంచాయతీ అనుమతి లేదని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందడంతో వివరణ ఇవ్వాలని ఎలక్ట్రికల్ ఏఈ పైడి దుర్గా ప్రసాద్ నోటీసు ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన కూన రవికుమార్ ఫోన్ చేసి అసభ్యంగా దూషించారు. ఈ అవమానాన్ని భరించలేక విద్యుత్ శాఖ అధికారి కుమిలిపోయారు.

కూన బ్రదర్స్‌కు ఆనవాయితీనే..

- శ్రీకాకుళం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆర్ఈసీహెచ్ ప్రసాద్‌ను గతంలో కూన రవికుమార్ నోటికొచ్చినట్టు దూషించారు. నీకు ఉద్యోగం, యూనిఫాం లేకుండా చేస్తా... ఆఫ్టర్ టూ అండ్ ఆఫ్ ఇయర్స్ నీకు ఉద్యోగం ఉండదు.. గుర్తుపెట్టుకో అంటూ బెదిరించారు.
- కోవిడ్ సమయంలో మందీ మార్బలంతో పోలీసు స్టేషన్‌కు వచ్చిన రవికుమార్ శంకరగిరి మాన్యాలు పట్టిస్తానంటూ పోలీస్ అధికారులను బెదిరించారు. 'మీ స్థాయి ఎంత..? మీరు ఎంత..?' అంటూ నరసన్నపేట సీఐ, ఎస్‌లనుద్దేశించి నోరు పారేసుకున్నారు.
- పొందూరులో టీడీపీ కార్యాలయం నిర్వహిస్తున్న భవనాన్ని ఖాళీ చేయాలని కోరినందుకు ఆ ఇంటి యజమానికి ఫోన్‌లో వార్నింగ్ ఇచ్చారు.
- పింఛన్ల విషయంలో తన మాట వినలేదని మండల కార్యాలయంలోనే సరుబుజ్జిలి ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీకి వార్నింగ్ ఇచ్చారు. ఆఫీసులోనే తలుపులు వేసి మరీ బాదేస్తా.. నన్ను ఎవరూ ఆపలేరు. చెట్టుకు కట్టి కాల్చేస్తా.. చెప్పింది చేయకపోతే నేనేంటో చూపిస్తానంటూ బెదిరించారు.
- పనుల విషయంలో తాను చెప్పినట్లు వినకుంటే కుర్చీలో కూర్చున్నా లాక్కుని వచ్చి తంతానంటూ పంచాయతీ కార్యదర్శులను కూన రవికుమార్ భయపెట్టారు.
- ఒక బిల్లు విషయంలో సరుబుజ్జిలి ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.
- మట్టి అక్రమంగా తరలించిన వాహనాలను విడిచిపెట్టలేదని పొందూరు తహసీల్దార్‌పై బెదిరింపులకు పాల్పడ్డారు. 'పట్టుకున్న వాహనాలను విడిచి పెట్టకపోతే లంచం డిమాండ్ చేశావని నీమీద కంప్లైంట్ చేస్తా. చెప్పు ఎంత కావాలి...? పది వేలు కావాలా? లక్ష కావాలా? ఎంత కావాలి...? ప్రాసెస్ గురించి నాకు చెబుతున్నావా? అంటూ రాయలేని భాషలో ఏకంగా ఎమ్మార్వోను దూషించారు.
- కూన రవికుమార్ తమ్ముడు కూన వెంకట సత్యనారాయణ ఇటీవల పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ కెసీహెచ్ మహంతిపై దాడి చేసే వరకు వెళ్లారు. తాను చేసిన పనులకు సంబంధించి ఏఈ అభ్యంతరం వ్యక్తం చేయడంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలోనే దౌర్జన్యం చేశారు. 'ఎంత ధైర్యం రా...! నాకే నోటీసు ఇస్తావా..? ఏమనుకుంటున్నావ్.. నేను కూన రవికుమార్ బ్రదర్ని.. జాగ్రత్త... ఇక్కడే పాతేస్తా... ' అంటూ సత్యనారాయణ రెచ్చిపోయాడు.

తెలంగాణ

వైభవంగా ఉజ్జయినీ మహంకాళి బోనాలు

రాంగోపాల్‌పేట్(హైదరాబాద్): చారిత్రక సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. తెలంగాణ సీఎం కె.చంద్రశేఖరరావు దంపతులతో పాటు వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన సతీమణితో కలిసి అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.